www.jagritiweekly.com

సంపుటి : 75 సంచిక : 44 పుటలు : 52

జాగృతి

కలి 5125 - శ్రీ శోభకృత్ నిజ శ్రావణ శుద్ధ పంచమి

21-27 ఆగస్ట్ 2023

వెల : ₹20/-

ప్రతిపక్షాల మహా పలాయనం

మణిపూర్ మీద ప్రధాని సమాధానం కావాలంటూ అవిశ్వాసం పేరుతో జరిగిన చర్చ మోదీని లక్ష్యంగా చేసుకుని సాగించిన ఒక తమాషా

జాగృతి చందాను చెల్లించడానికి పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను మీ మొబైల్‌తో స్కాన్ చేయండి. లేదా http://payit.cc/S18970 అని బ్రౌజర్‌లో టైప్ చేయండి.

కీ.శే. శ్రీ కొటిగే నాగప్ప

కీ.శే. శ్రీమతి కొటిగే సావిత్రమ్మ

అనంతపురం జిల్లా, రాయదుర్గం పట్టణానికి చెందిన
మా నాన్న గారైన కీర్తిశేషులు శ్రీ కొటిగే నాగప్ప (గైక్వాడ్) గారి శత జయంతి
(24.08.1923-24.08.2023) సందర్భంగా నివాళులు అర్పిస్తూ..

కుమారుడు: కె.ఎన్. మల్లికార్జున్, కుమార్తె: కె. గౌరమ్మ

Address: 15-4-483 Netaji Road, Rayadurg,
Anantapur Dist. A.P.
cell: 9490296548

స్వకులసాలే సమాజ బాంధవ్యులందరికి
శ్రీ జిహ్వేశ్వర మహారాజ్ జయంతి (29.08.2023)
శుభాకాంక్షలు

కీర్తిశేషులు శ్రీ కొటిగే నాగప్ప
కీర్తిశేషులు శ్రీమతి కొటిగే సావిత్రమ్మ గార్ల జ్ఞాపకార్థం..

కుమారుడు కె.యన్. మల్లికార్జున, కుమార్తె కె. గౌరమ్మ
తమ ఇల్లు (15-4-483), (35×90) సైజుగల స్థలాన్ని
స్వకులసాలే సమాజానికి 08.06.2023న విరాళంగా అందజేశారు.

కుమారుడు
కె.యన్. మల్లికార్జున

కుమార్తె కె. గౌరమ్మ



స్వర్గీయ కె.శ్రీదేవి
(చిన్న కుమార్తె)

జాతీయ భావాలను మేల్కొల్పే ఉత్తమ సాహిత్యం
మీరు తప్పక చదివి, పదిమందిచే చదివించదగిన పుస్తకాలు



వెల : ₹.220/-



వెల : ₹.200/-



వెల : ₹.390/-



వెల : ₹.250/-



వెల : ₹.250/-

వెల : ₹.100/-



వెల : ₹.100/-



వెల : ₹.200/-



వెల : ₹.100/-



వెల : ₹.150/-



వెల : ₹.799/-



వెల : ₹.499/-



వెల :₹.495/-



వెల : ₹.799/-



వెల : ₹.549/-

పై పుస్తకములకు మరియు క్రొత్త, పాత నవయుగ భారతి ప్రచురణలకై సంప్రదించండి

ఫోన్ ద్వారా మీకు కావలసిన పుస్తకాలు తెలియజేయండి! రిజిష్టరు పోస్టులో అందుకోండి!!

సాహిత్య నికేతన్ : 3-4-852, కేశవనిలయం, బర్కత్‌పురా, హైదరాబాద్ -27.
040-27563236, 9290127329

సాహిత్య నికేతన్ : ఏలూరు రోడ్, గవర్నరు పేట, విజయవాడ - 2, దూరవాణి : 8333812687

వాకాటి పాండురంగారావు స్మారక కథల పోటీ

జాగృతి వారపత్రిక దీపావళి ప్రత్యేక సంచిక కోసం సుప్రసిద్ధ కథా రచయిత స్వర్గీయ వాకాటి పాండురంగారావు స్మారక 'కథల పోటీ - 2023' నిర్వహిస్తున్నాం. రచయితలకు ఆహ్వానం..

ప్రథమ బహుమతి : రూ. 12000/-
ద్వితీయ బహుమతి : రూ. 7000/-
తృతీయ బహుమతి : రూ. 5000/-

1. సమకాలీనం, చారిత్రకం, సైన్స్ ఫిక్షన్ ఇతివృత్తంతో కూడిన కథలను పంపవచ్చు. భారతీయ సామాజిక జీవనమే నేపథ్యంగా ఉండాలి. సాధ్యమైనంత వరకు ఆంగ్ల పదాలను పరిహరించండి.
2. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు ఎనిమిది కథలకు రూ.1,000 చొప్పున ప్రోత్సాహక బహుమతి, సాధారణ ప్రచురణకు స్వీకరించిన ప్రతి కథకు జాగృతి పారితోషికం ఉంటాయి.
3. కథ నిడివి 1500 పదాలకు మించరాదు. ఒక రచయిత 3 కథలకు మించి పంపరాదు.
4. కథ తన స్వంతమేనని, అనువాదం, అనుసరణ కాదని, బ్లాగుల్లోనూ, వెబ్ పత్రికల్లోనూ మరెక్కడా ప్రచురితం, ప్రసారం కాలేదని; పరిశీలనలో లేదని విడిగా హామీపత్రం జతచేయాలి. హామీపత్రంలో రచయిత పేరు, చిరునామా, ఇ-మెయిల్ ఐడి, ఫోన్ నంబర్ తప్పక రాయండి. కథ రాసిన పుటలలో ఎక్కడా రచయిత పేరు గానీ, ఇతర వివరాలేవి ఉండరాదు.
5. దీపావళి సంచిక నుంచి ఆరంభించి, వరుసగా ఈ కథలను ప్రచురిస్తాం.
6. కథలను తెలుగులో అను లేదా యూనికోడ్ ఫాంట్‌లో డిటిపి చేసి jagriticompetition@gmail.com కు మెయిల్ చేయాలి. చేతి రాత అందంగా, న్యాయనిర్ణేతలకు అర్థమయ్యేలా ఉంటే స్కాన్ చేసి పంపినా పరవాలేదు. కొట్టివేతలు ఉన్నా, సరిగా స్కాన్ చేయకున్నా పోటీకి తీసుకోలేం.
7. కథను పోస్టు లేదా కొరియర్ ద్వారా పంపాలనుకుంటే 'కథల పోటీ' జాగృతి వారపత్రిక, 3-4-228/4/1, జాగృతి భవన్, కాచిగూడ, హైదరాబాద్-500027 కు పంపొచ్చు. జాగృతికి కథల్ని చేర్చే బాధ్యత రచయితలదే.
8. కథల ఎంపికలో ఉత్తర, ప్రత్యుత్తరాలకు తావులేదు. సంపాదకునిదే అంతిమ నిర్ణయం.

కథలు జాగృతికి చేరడానికి చివరి తేది: 2 సెప్టెంబర్, 2023

Printed & Published by **Nagol Sreenivas Reddy** on behalf of **Jagriti Prakashan Trust** and printed at Kala Jyothi Process Ltd, CFC 1&2, Raviryala, Maheswaram, Rangareddy - 501 359. And published at Jagriti Bhavan, 3-4-228/4/1, Lingampalli, Kachiguda, Hyderabad - 500 027.
Editor : Dr. Goparaju Narayana Rao.

సర్క్యులేషన్ వివరాలు, ఫిర్యాదులు, వ్యాపార ప్రకటనల వివరాల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య) సంప్రదించండి.

జి. తుకారాం సర్క్యులేషన్ మేనేజర్ 040-27561453/9959997013

జాగృతి చందా – సూచనలు

5 సం॥ల చందా రూ.4000, సంవత్సర చందా రూ.850, విడి ప్రతి రూ.20

- అడ్రసులో పేరు, ఇంటి నెం., గ్రామం, మండలం, జిల్లా, పిన్‌కోడ్, మొబైల్ నెం. సమగ్రంగా ఉండాలి. లేకుంటే కంప్యూటర్ ఆమోదించదు.
- తాత్కాలిక రసీదు చేరిన 15 రోజుల తర్వాత చందా నెం., ప్రారంభ తేది వివరాలు మీకు ఎస్.ఎం.ఎస్. చేస్తాం. ఆ వెంటనే సంచిక కూడా అందుతుంది. మీరు చందా నెం. నోట్ చేసుకోవాలి.
- పత్రిక అందకపోతే వెంటనే సంప్రదించగలరు. చిరునామా మారితే కార్యాలయానికి విధిగా తెలపండి.

చందా కట్టించే వారికి సూచనలు :

- చందాలు వసూలు చేసి పంపేవారు తమ పూర్తిపేరు, సెల్ నెం. రాయాలి.
- రశీదుపై చందాదారుని పూర్తి చిరునామా, పిన్‌కోడ్, సెల్ నెం., ఈమెయిల్ ఉండాలి. వివరాలు jagritiweeklysub@gmail.comకు మెయిల్ చేయాలి.
- ఆన్‌లైన్/చెక్ ద్వారా కూడా చెల్లించవచ్చు. డబ్బు పంపాక 040-27561453/ 9959997013 నంబర్లకు తెలియజేయాలి.
- మరిన్ని వివరాలకు చందాపుస్తకంలో మొదటి రసీదు వెనుక చూడగలరు.

చందా పంపవలసిన చిరునామా :

- 3-4-228/4/1, కాచిగూడ, హైదరాబాద్-500 027.

జాగృతి బ్యాంకు ఖాతా వివరాలు :

- **A/c Name & No. Jagriti Prakashan Trust, 920010061405325, Axis Bank, Kothapet Branch. IFSC : UTIB0002157, PAN : AAATJ3829L**
- **చెక్కు, డిడిపై Jagriti Prakashan Trust అని ఆంగ్లంలో రాయాలి.**

సంపాదక మండలితో సంప్రదింపుల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య)

కె. దుర్గారెడ్డి — అసోసియేట్ ఎడిటర్
సబ్ ఎడిటర్ — **9959991304**

డిజైనర్ : సిహెచ్. కుమార్

ఒక వలసదేశం కోసం, నిలువెల్లా జాత్యహంకారం ఉన్న ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టిన చట్టాలే ఇప్పటికీ అమలవుతున్నాయి. 1860-1898 మధ్య కాలంలో రూపొందించిన చట్టాలవి. ఏ విధంగా చూసినా అవి నేటి కాలానికి వర్తించవు. నేర సామ్రాజ్యం అన్నమాట పదే పదే వింటున్న కాలంలో దానిని కూలగొట్టే శక్తిసామర్థ్యాలు ఉన్న చట్టాలు లేకపోతే అరాచకం తప్పదు. దేశ కాలమాన పరిస్థితులే కాదు, ప్రపంచమంతా పూర్తిగా మారిపోయిన నేపథ్యంలోనూ ఆనాటి చట్టాలనే ఇంకా అమలు చేసుకుంటున్నాం. అందుకే న్యాయం జరిగింది అన్న మాట తక్కువగా వినిపిస్తున్నది. హక్కులకు రక్షణ కరవైందన్న మాట బిగ్గరగా వినిపిస్తున్నది. కొన్ని నేరాలకు సరైన నిర్వచనాలు లేకపోవడం అతి పెద్ద లోటు. ఇది కూడా మారిపోయిన పరిస్థితులు తెచ్చిపెట్టినదని వేరే చెప్పనక్కరలేదు. ఉన్న చట్టాలయినా విదేశీయులు తమకు అనుకూలంగా, వలస దేశవాసులను అణచి ఉంచేందుకు తీర్చిదిద్దుకున్నవే. ఇందులో ప్రజలకు న్యాయం చేయాలన్న ఆశయం కంటే, తమ పాలన కొనసాగేందుకు అవసరమైన వాతావరణాన్ని నిర్మించుకోవాలన్న దృష్టే ఎక్కువ. వీటన్నిటి పరిష్కారం కోసం ఎన్డీయే ప్రభుత్వం చట్ట వ్యవస్థకు సమూల మార్పులు తలపెట్టింది. ఇదొక విప్లవం. ఇంగ్లీష్ చట్టాలు పోయి, ఇక పరిపూర్ణ భారతీయ చట్టాలు అమలులోకి రానున్నాయి.

నేర శిక్షాస్మృతి (1898), భారత సాక్ష్యాధార చట్టం (1872), భారత శిక్షాస్మృతి (1860) ఇక కాలగర్భంలో కలసి పోతున్నాయి. వాటి స్థానంలోనే భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్షా సంహిత, భారతీయ సాక్ష్య బిల్లులను తీసుకువచ్చేందుకు కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఆగస్ట్ 11న కీలక బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి, భవిష్యత్తులో ప్రతిపక్షాలు తమ పాత్ర ఇందులో ఏదీ అని ప్రశ్నించకుండా, వాటిని స్టాండింగ్ కమిటీకి ప్రస్తావించారు.

ఉగ్రవాదం అంటే ఏమిటో స్పష్టంగా నిర్వచించుకోవలసిన కాలంలో భారత్ మాత్రమే కాదు, మొత్తం ప్రపంచమే ఉంది. నిజానికి ఇది ఎప్పుడో

శాలివాహన 1945 శ్రీ శోభకృత్ నిజ శ్రావణ శుద్ధ పంచమి

లోపలి పేజీలలో...

ముఖపత్ర కథనం
ప్రతిపక్షాల మహా పలాయనం
6లో

జాతీయం
అల్లర్ల వెనుక వ్యక్తులు బయటపడుతున్నారు
12లో



ధారావాహిక నవల
మహా సంకల్పం
– పి. చంద్రశేఖర ఆజాద్
20లో

జాగృతి

సంపాదకీయం

జరగాలి. పైగా భారతదేశానికి ఆ బెడద మరింత ఎక్కువ. ఉగ్రవాదుల కర్మాగారం మన పొరుగుననే ఉన్నది కూడా. కానీ హక్కుల ముసుగులో, మత విశ్వాసాల చాటున, మైనారిటీల పేరుతో ఉగ్రవాదం పెట్రేగిపోతున్న సంగతిని అంతా అంగీకరించాలి. ఇప్పుడు కేంద్రం ఆ లోటును తీర్చింది. ఉగ్రవాదం అంటే ఏమిటో, దాని పరిధి ఎంతో తొలిసారి నిర్వచించింది. దేశ సమగ్రతను దెబ్బతీయడమే లక్ష్యంగా ఇక్కడ లేదా దేశం వెలుపల ప్రయత్నించే వారంతా ఉగ్రవాదులే అవుతారు. దేశ విచ్ఛిన్నమే లక్ష్యంగా జనజీవనాన్నీ, ముఖ్యంగా ఒక సమూహాన్నీ భయ భ్రాంతులకు గురి చేయడం కూడా ఉగ్రవాదమే అవుతుంది. ఉగ్రవాద చర్యలకు పాల్పడినా, ఆ దుశ్చర్యలో ప్రాణహాని ఉన్నా

బ్రిటిష్ చట్టాలకు సెలవు

జీవిత ఖైదు విధించవచ్చు. రూ. 10 లక్షలు జరిమానా కూడా విధించవచ్చు. అంతేకాదు, ఇలాంటి వాళ్లు కారాగారంలో ఉంటే దొడ్డితోవన విడిపించుకునే మార్గాలనూ ఈ బిల్లు మూసేసింది. వీరిని విడుదల చేసే విషయం ఆలోచించాలన్నా ఏడేళ్లు ఆగాలి. మూకహత్యకు కూడా నిర్వచనం ఇచ్చిందీ బిల్లు.

ఆ మధ్య రాజద్రోహం అంశం నేరస్మృతిలోనే కాదు, ఈ దేశంలోనే వినపడకూడదన్న వాదన బయలుదేరింది. ఇందులో వచ్చిన చిక్కు- రాజద్రోహం అంశం బ్రిటిష్ ప్రభుత్వం తెచ్చినదని వేరే చెప్పనక్కరలేదు. కానీ ఇప్పుడు రాజద్రోహం మరొక రూపంలో ఉన్నదని చెప్పడానికి అభ్యంతరం అక్కరలేదు. ఇదే దేశద్రోహ చట్టంగా చెలామణిలో ఉన్నది. అయితే పాత స్మృతి స్థానంలో కేంద్ర ప్రభుత్వం సెక్షన్ 150 తీసుకువచ్చింది. అంటే ఇప్పటిదాకా 124ఎ సెక్షన్ కింద ఆ నేరానికి శిక్షలు పడేవి. కానీ 124ఎ కంటే 150వ సెక్షన్ ఇంకాస్త కఠినమైనదే. దేశ సమైక్యతకు చేటు తెచ్చే కార్యకలాపాలు, సార్వభౌమత్వానికి సవాలు, వేర్పాటువాదం, సాయుధ తిరుగుబాటు ఇవన్నీ ఇకపై 150వ సెక్షన్ కింద శిక్షార్హమవుతాయి. 124ఎ కంటే కఠినంగా 150 సెక్షన్ రావడం జాతీయ భావాలు కలిగి, వాస్తవికంగా, ప్రజాస్వామ్యబద్ధంగా ఆలోచించే వారందరికీ పెద్ద ఊరట. దేశద్రోహ చింతన విరివిగా సాగుతు న్నప్పుడు ఆ చర్యను నేరంగా చూపే, శిక్షించే విభాగాన్ని రద్దు చేయాలని కోరడం ఏం సబబు? ఈ అంశాన్ని అమిత్ షా సరైన పంథాలోనే పరిష్కరిస్తున్నా రనిపిస్తుంది.

సామూహిక అత్యాచారాలు, 18 ఏళ్ల లోపువారి మీద జరిగే అత్యాచారాల పట్ల కేంద్రం ఉక్కు పిడికిలి బిగించింది. ఇది చాలామంది సాధారణ పౌరుల కోరిక. సామూహిక అత్యాచారాలలో నేరం రుజువైతే 20 ఏళ్లు, మైనర్ల మీద అత్యాచారం చేస్తే మరణశిక్షను కొత్త బిల్లు ప్రతిపాదిస్తున్నది. చిన్నారుల మీద నేరాలకు పాల్పడినా పది నుంచి ఏడేళ్లు శిక్ష వేసేందుకు వీలు కల్పించారు. ప్రలోభాలతో, మాయమాటలతో లొంగదీసుకోవడం, పెళ్లి చేసుకోవడం కూడా తీవ్ర నేరాలుగానే ఇక పరిగణిస్తారు. ప్రలోభాల పరిధిలోకి ఎన్నికల నేరాలను కూడా చేర్చారు. ఆర్థిక నేరాలలో శిక్ష పడితే వారి ఆస్తులను బాధితులకు పంచి పెట్టే విధానం కూడా తెచ్చారు. అలాగే సేవను (కమ్యూనిటీ సర్వీస్) శిక్షగా విధించే ప్రక్రియను కూడా తొలిసారి ప్రవేశపెట్టబోతున్నారు. మాయమాటలు చెప్పి, తన వివరాలు గోప్యంగా ఉంచి పెళ్లి చేసుకున్నా, లొంగదీసుకున్నా శిక్షార్హులను చేయడం లవ్ జిహాద్‌ను అరికట్టడానికి కావచ్చు.

ఏమైనా, సరైన శిక్షలు లేక నేరాలు పెరిగిపోతున్నాయన్న ప్రజాభిప్రాయాన్ని, వాస్తవిక దృష్టిని ఆధారం చేసుకుని ఈ బిల్లును తీసుకువచ్చినట్టు కనిపిస్తున్నది. సైబర్ నేరాలు, నయాన్నో భయాన్నో స్త్రీలను తమ పరం చేసుకోవాలన్న ప్రవృత్తిని పరిపూర్ణంగా నిరోధించే చట్టాలు ఇక అవసరం అవుతాయి. అంతేకాదు, ఇలాంటి నేరస్మృతులను, శిక్షాస్మృతులను నిర్ణీత వ్యవధిలో సమీక్షించుకునే అవకాశం కూడా ఈ బిల్లు ఇస్తే ఇంకా మంచిది. ★

కథ

జాగృతిలో నవ సుమాలు..

- డాక్టర్ శ్రీదేవీ శ్రీకాంత్

అటకెక్కిన 'సమాచార హక్కు' (తెలంగాణ) - 14
నిధుల మళ్లింపు... కష్టాల్లో పంచాయతీలు (వేదిక) - 16
కొంటెబొమ్మలతో కొద్దిసేపు (రేఖలు) - 24
భజన నింపిన గుండె ధైర్యం (అమృతోత్సవాలు) - 30
విలువ లేని పాక్ ప్రకటనలు (అంతర్జాతీయం) - 32
ద్విశతావధాన విద్వన్మణి బాలభాను (మహిళ) - 34
మరాఠీ మొలక..17 ఏళ్లకే విశ్వవిజేత! (క్రీడ) - 43
కొత్తదనం కరవైన 'భోళా శంకర్' (సినిమా) - 50

ప్రతిపక్షాలు ప్రదర్శించే ప్రహసనానికి పార్లమెంట్ వేదిక కావడం భారత ప్రజాస్వామ్యంలోనే పెద్ద విషాదం. మణిపూర్ మీద ప్రధాని నరేంద్ర మోదీ నోరు విప్పాలంటూ ప్రతిపక్షాలు అత్యున్నత చట్టసభలో చేసిన గందరగోళం చివరికి ఎలా ముగిసింది? ఓటింగ్‌కు కూడా భయపడి విపక్షాలు తోక ముడిచాయి. విపక్ష నేతలలో కనీసం వాగాడంబరం కూడా లేదు. అసలు విపక్షాల నాయకుల ఉపన్యాసాలన్నీ ముందస్తుగా నాలుగు విషయాలు నెమరు వేసుకోకుండా దర్జాగా సభకు వచ్చి మొక్కుబడి చెల్లించినట్టే ఉన్నాయి. ఈ ఉపన్యాసాలలో కెల్లా అత్యంత వికారమైనది రాహుల్ గాంధీ ఉపన్యాసమేనని జాతి యావత్తు నిర్ధారించింది. ఇంతకీ అవిశ్వాస తీర్మానం ఫలశ్రుతి ఏమిటి? విపక్షాలకు మణిపూర్ సమస్య ముఖ్యం కాదు. అది పరిష్కారం కావడం గురించి వాటికి ఆసక్తి కూడా లేదు. మణిపూర్ మీద ప్రధాని సమాధానం కావాలంటూ అవిశ్వాసం పేరుతో ఆగస్ట్ 8, 9, 10 తేదీలలో జరిగిన చర్చ మోదీని లక్ష్యంగా చేసుకుని సాగించిన ఒక తమాషా. కానీ మోదీ ఎదురుదాడితో విపక్షాలకు గుక్క తిప్పుకోలేని పరిస్థితి వచ్చింది. తన సుదీర్ఘ పాలనలో ఈశాన్య భారత్‌ను కాంగ్రెస్ మరిచిపోతే, తాను తన హృదయంలో భాగం చేసుకున్నానని మోదీ చెప్పారు. మిజోరం ప్రజల మీద వైమానిక దాడి చేయించిన పార్టీ అక్కడి ప్రజల సంక్షేమం గురించి మాట్లాడడం ఎంత అజ్ఞానమో మోదీ తూర్పార పట్టారు. కానీ ఇవాళ ఉగ్రవాదులను విడిపించుకుపోవడానికి వచ్చిన మహిళలపై సైన్యం ఒక్క తూటా ప్రయోగించలేదు. మిజోరాం ప్రజానీకం మీద వైమానిక దాడి, పంజాబ్‌లో స్వర్ణాలయం మీద సైనిక దాడి జరిపిన ఘనత కాంగ్రెస్‌ది. ఇవన్నీ మోదీ ఏకరువు పెట్టే సరికి నోట మాట రాకనే విపక్షం చావు తప్పి కన్ను లొట్టపోయిన చందంగా బయటపడింది. నిజానికి ఇదొక మహా పలాయనం.

పార్లమెంటు వర్షాకాల సమావేశాలలో ప్రతిపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం గెలుస్తుందని ఎవరూ ఊహించలేదు. దానికి ఏ గతి రాసి పెట్టి ఉన్నదో ముందే తేలిపోయింది. భారత్, పాక్ క్రికెట్ మ్యాచ్ చూసేందుకు ప్రజలు టీవీలకు అతుక్కు పోయినట్టుగా, ఈ ఘట్టాన్ని వీక్షించేందుకు, ప్రధాని మోదీ సమాధానం వినేందుకు ప్రజలు టీవీలకు అతుక్కుపోయారు. ప్రతిపక్షాలు వేసిన నోబాల్స్‌కు సైతం మోదీ సిక్సర్లు కొడుతుండడంతో, ప్రతిపక్షాలు రిటైర్డ్ 'హర్ట్' అయ్యి, ఓటింగ్ సైతం చెయ్యకుండా సభలో నుంచి వాకౌట్ చేశాయి. 2023లో కూడా ప్రతిపక్షాలు అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెడతాయంటూ 2018లో వారు పెట్టిన అవిశ్వాస తీర్మానానికి సమాధానమిస్తున్న సందర్భంలో ప్రధాని నరేంద్ర మోదీ అన్న మాటలను ప్రతిపక్షాలు నిజం చేశాయి. ఈసారి కూడా ప్రధాని మోదీ 2028లో కూడా ప్రతిపక్షాలు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడతాయంటూ జోస్యం చెప్పారు. కనీసం అప్పుడైనా ప్రతిపక్షాలు కాస్త తయారై వచ్చి మాట్లాడాలంటూ ప్రధాని వారికి చురక తగిలించడం విశేషం.

మణిపూర్ సంక్షోభంపై ప్రతిపక్ష కూటమి (ఐ.ఎన్.డి.ఐ.ఎ) తరఫున కాంగ్రెస్ నాయకుడు గౌరవ్ గోగోయ్ అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. వారు కోరుకున్నట్టుగానే మోదీ తీర్మానానికి సమాధానమిస్తూ, మణిపూర్ అంశానికి సమాధానం చెప్పే లోపలే ప్రతిపక్షాలు సభలో నుంచి వాకౌట్ చేయడం వారి అహంకారమో లేక పిరికితనమో తేల్చుకోలేక ప్రజలు తికమక పడుతున్నారు. ప్రధాని మోదీ మాత్రం ఆ చర్యను అహంకారంగానే భావించారు. అందుకే ఐ.ఎన్.డి.ఐ.ఎ.లోని రెండు 'ఐ'లు వారి అహంకారానికి చిహ్నమంటూ మరో చురక అంటించారు.

పార్లమెంటు కార్యకలాపాలు సాగుతున్నంత కాలం నినాదాలు చేస్తూ, మణిపూర్ అంశంపై ప్రధాన మంత్రి సమాధానం చెప్పాలని పట్టుబట్టి సభను సాగనివ్వకుండా చేసిన ప్రతిపక్షాలు, ఆ క్షణం వచ్చినపుడు సభ నుంచి ఉడాయించడం వారి అయోమయ వ్యూహానికీ, ఆలోచనలకీ అద్దం పట్టింది. అలా బయటకు వెళ్లడం తమను తాము అవమానించుకోవడమేనని, దానివల్ల ప్రజలలో తమ పట్ల మిగిలిన ఆ ఆవగింజంత విశ్వసనీయతను కోల్పోతామనే విషయాన్ని మోదీ పట్ల ఉన్న గుడ్డిద్వేషం ప్రతిపక్షాలను ఆలోచించనివ్వలేదు. ప్రతిపక్షాలు మణిపూర్ సమస్యను సూత్రబద్ధంగా పట్టి చూపకుండా, తమకు అనుకూలమైన రాజకీయ అంశంగా మార్చుకునే ప్రయత్నం చేయడం వల్లనే

క్షీల మహా పలాయనం

విఫలమయ్యాయన్నది వాస్తవం.

ప్రధాని ప్రసంగానికి ముందురోజు మాట్లాడిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా, తాను తొలి రోజు నుంచే మణిపూర్ సమస్యపై చర్చకు సిద్ధంగా ఉన్నానని, కానీ ప్రతిపక్షాలకి చర్చ అవసరం లేదనీ, తాను మాట్లాడకుండా అడ్డుకోవడమే వారికి కావలసిందంటూ ఆరోపించారు. నిజానికి, వారు బాధ్యత గల ప్రతిపక్ష సభ్యులు అయి ఉంటే, వారు చర్చకు పూర్తిగా సిద్ధమై, కనీసం అమిత్‌షాను అయినా సూటి ప్రశ్నలు వేసి సమాధానాలు కోరి ఉండేవారు. కానీ ఆ పనీ చేయలేకపోయారు. అయినప్పటికీ, అమిత్ షా మణిపూర్‌లో జరిగిన ఘటనా క్రమాన్ని, దానిని పరిష్కరించేందుకు ప్రభుత్వం చేపట్టిన చర్యలను గురించి తన సుదీర్ఘ ఉపన్యాసంలో సవివరంగా చెప్పారు. మే 3న హింస చోటు చేసుకున్న వెంటనే ప్రధాని మోదీతో చర్చించి, రాష్ట్ర డీజీపీ, ప్రధాన కార్యదర్శి, భద్రతా సలహాదారును మార్చడం గురించి, విచారణకు కమిషన్‌ను నియమించడం గురించి, 36వేల మంది పారా మిలటరీ సిబ్బందిని అక్కడ మోహరించిన అనంతరం మరణాలు తగ్గిన విషయం గురించి చెప్పారు. దీనితో పాటుగా గత తొమ్మిదేళ్ల పాలనా కాలంలో ప్రధాని మోదీ 50సార్లు ఈశాన్య ప్రాంతాన్ని సందర్శించిన విషయాన్ని పట్టి చూపుతూ, తమకు గల నిబద్ధతను చాటుకున్నారు. గొడవలు జరుగుతున్న నేపథ్యంలో పరిస్థితులను చక్కదిద్దేందుకు తాను మూడు రోజులు అక్కడే గడిపానని, సహాయ మంత్రి నిత్యానంద రాయ్ వరుసగా 23 రోజులు అక్కడే ఉన్నారంటూ కాంగ్రెస్ పాలనా కాలంలో అనేక హింసాత్మక సంఘటనలు చోటుచేసుకున్నప్పటికీ ఏ మంత్రీ అక్కడకు వెళ్లని విషయాన్ని ఆయన ఎత్తి చూపారు. ఈశాన్య రాష్ట్రాల పట్ల ప్రతిపక్షాలకు నిబద్ధత లేదని, మణిపూర్ అనేది వారికొక రాజకీయ ముసుగు మాత్రమేననే విషయం స్పష్టం అయ్యేలాగా షా ప్రసంగం ఉంది.

ప్రతిపక్షాలు చేసిన ఘోర తప్పిదం, ప్రభుత్వానికి వ్యతిరేకంగా అవిశ్వాసాన్ని ఈ సమయంలో ప్రవేశపెట్టడమే అనే విషయాన్ని అవి గ్రహించలేదేమో కానీ ప్రజలు గ్రహించారు. దీనిని ప్రవేశపెట్టడం ద్వారా 2024 ఎన్నికల ప్రచారానికి ప్రధాని మోదీ శంఖం పూరించడానికి వారే అవకాశం ఇచ్చినట్టు అయింది. తీర్మానాన్ని ప్రవేశపెట్టిన ప్రతిపక్షాలు కేవలం మణిపూర్‌పై మాట్లాడేలా ఒత్తిడి చేయలేకపోయారు. ప్రధాని ఆర్థిక వ్యవస్థ, ద్రవ్యోల్బణం, నిరుద్యోగిత, మణిపూర్‌లో మహిళలపై హింస గురించి మాట్లాడతారని ఆశించామని, కానీ ఆయన మాత్రం ఐ.ఎన్.డి.ఎ.ఐ.పై దృష్టి కేంద్రీకరించారంటూ వాకౌట్ చేసిన తర్వాత ప్రతిపక్ష నాయకులు అనడం వారి మూర్ఖత్వానికే అద్దం పడుతుంది. వాస్తవానికి వారు మోదీ లాంటి వక్త ఏం మాట్లాడతారో ఊహించలేకపోవడం వారి తెలివి తక్కువతనమనాలో, అతి ఆత్మవిశ్వాసం అనాలో తెలియదు. సందర్భాన్ని ఉపయోగించుకున్న ప్రధాని ఎన్డీయే సాధించిన ప్రగతిని చెబుతూ, ప్రతిపక్ష కూటమిలో ఉన్న వైరుధ్యాలను బహిర్గతం చేశారు.

ప్రధాని మోదీ తన ప్రసంగంలో భారత్ ప్రపంచంలోనే అతిపెద్ద మూడవ ఆర్థిక వ్యవస్థగా రూపొందేందుకు ఎలా సిద్ధంగా ఉన్నది, ఈ దేశ యువత తమ కలలను నెరవేర్చుకునేందుకు తాను మార్గాన్ని ఎలా సుగమం చేస్తున్నదీ చెప్పడంతో పాటుగా, ప్రతిపక్షాల దార్శనికత, నాయకత్వంపై ప్రశ్నలను లేవనెత్తారు. తన ప్రసంగంలో భాగంగా మోదీ రాహుల్ పేరు ప్రస్తావించకుండా, విఫలమైన ఉత్పత్తిని పదే పదే ప్రయోగిస్తున్నారని వ్యంగ్యాస్త్రాలను

ఈశాన్య భారతం

'మణిపూర్‌లో భారతమాతను హత్య చేశారు' అంటూ దేశ అత్యున్నత చట్టసభలో తర్జని చూపుతూ వీరంగం వేసిన అల్పుడికీ, అతడు ప్రాతినిధ్యం వహిస్తున్న రాజకీయ పార్టీకీ దీటుగానే ప్రధాని మోదీ సమాధానం ఇచ్చారు. ఈశాన్యమంటే తనకు గుండెలో భాగమని మోదీ అన్నారు. మణిపూర్ హింస నిజంగానే బాధాకరమని అంటూ, అక్కడ సాధారణ పరిస్థితులు, శాంతి నెలకొల్పడానికి కేంద్రం, రాష్ట్రం కలసి పనిచేస్తాయని మోదీ హామీ ఇచ్చారు. కానీ ఈశాన్యం మీద కాంగ్రెస్ వారి ప్రేమ ఎలాంటిది? అది గుర్తు చేయడానికే మోదీ మిజోరాం రాజధాని ఐజ్వాల్ మీద జరిగిన వైమానిక దాడుల గురించి దేశ ప్రజలకు తన ఉపన్యాసం ద్వారా గుర్తు చేశారు.

అయితే ఆయన ప్రస్తావించిన రెండు అంశాల గురించి ఓ వర్గం మీడియాలో చర్చ జరుగుతున్నది. ఆ రెండు అంశాలను మోదీ ప్రస్తావించడం గురించి ఆ మీడియాకు ఏదో అసౌకర్యం కలిగినట్టు మాట్లాడుతోంది. కానీ అది చరిత్ర. భారతమాతను హత్య చేయడం వంటి నీచ వదజాలం ఉపయోగించిన వారికి సరైన సమాధానం కూడా. మణిపూర్ వివాదం మీద ప్రధాని చేత మాట్లాడించడం తప్ప మాకు మరొక ఉద్దేశం లేదని చర్చను ప్రారంభించిన గౌరవ్ గోగోయ్ (కాంగ్రెస్) ఆదిలోనే అస్త్ర సన్యాసం చేశారు. మొత్తం చర్చకు జవాబు ఇస్తూ ప్రధాని, మొత్తం ఈశాన్య భారత పరిపాలనను కాంగ్రెస్ గాలికి వదిలేసిందని అన్నారు. దీనితో పాటు మార్చి 5, 1966న మిజోరాం ప్రజల మీద కాంగ్రెస్ ప్రభుత్వం వైమానిక దాడులు చేయించిన సంగతిని కూడా సభలో ప్రస్తావించారాయన. ఇంకా 1984 నాటి స్వర్ణాలయం మీద దాడిని కూడా గుర్తు చేశారు. అంటే అసలు కాంగ్రెస్ మిజోరాంను ఈ దేశంలో భాగంగా గుర్తించనట్టా అన్నదే మోదీ ప్రశ్న. వైమానిక దళాలు దాడి చేయగలిగింది విదేశాల మీదనే.

సైనిక, వైమానిక దళాలను దేశ పౌరుల మీద ప్రయోగించరు. ప్రజాస్వామిక దేశంలో అయితే ఆ

సంధించారు. నిజానికి మోదీ ఆ పని చేయనవసరం లేదని, ప్రతిపక్ష కూటమికి తనను తాను నాయకుడిగా ప్రతిష్టించుకునే బంగారు అవకాశాన్ని వ్యర్థం చేసుకోవడంలో రాహుల్ అద్భుతంగా రాణించాడని విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు.

ఎందుకంటే, రాహుల్ గాంధీ తన ఉపన్యాసంలో భారత్ జోడో యాత్రలో తనకు వచ్చిన మోకాలు నొప్పి, ఆధ్యాత్మిక అనుభవాల గురించి మాట్లాడ కుండా మణిపూర్‌పై తార్కికంగా, సమర్థవంతంగా మోదీ ప్రభుత్వం ఈ సంక్షోభాన్ని నిర్వహిస్తున్న తీరుపై దాడి చేయకుండా, సందర్భ శుద్ధిలేని మాటలు మాట్లాడి దొల్లతనాన్ని బయిటపెట్టుకున్నారు. ప్రభుత్వంపై ఆగ్రహాన్ని ప్రకటిస్తూ రాహుల్ చేసిన ఉపన్యాసం మణిపూర్‌లో సంక్షోభం తీవ్రతను ప్రజలకు తెలియచేయలేకపోయింది. కారణం, అతడికి విషయంపై అవగాహన లేకపోవడమే.

ఇందుకు భిన్నంగా ప్రధాని మోదీ ఉపన్యాసం స్పష్టతతో, సానుకూలతతో ఉండటాన్ని ప్రజలు గమనించారు. ప్రతిపక్షాలు తనకు వ్యతిరేక నినాదాలు చేస్తున్నప్పటికీ, వాటిని విస్మరించి, తొణకకుండా తాను అనుకున్న విధంగానే ఒక క్రమంలో తాను చెప్పదలచుకున్న విషయాలను చెప్పారు. కానీ, ఆయన మణిపూర్‌పై సమాధానం చెప్పేవరకూ కూర్చోవడం ప్రతిపక్షాలకు కష్టమైంది. ప్రధాని తమ ప్రభుత్వం చేపడుతున్న పథకాల గురించి, ఈ పార్లమెంటు సెషన్‌లో ఆమోదించిన బిల్లుల గురించి, భారత్ పురోగతి గురించి వివరంగా మాట్లాడుతూనే, ప్రతిపక్షాల బాధ్యతరాహిత్యాన్ని కూడా పట్టి చూపారు.

ప్రతిపక్షాల భావ దారిద్ర్యాన్ని, ఒక అంశంపై లోతైన అవగాహన లేకపోవడాన్ని, ప్రతిపక్ష నాయకులు ముందస్తుగా తయారు కాకుండానే సభకు వచ్చి ఆరోపణలు చేయడాన్ని ప్రధాని తప్పుబట్టారు. మణిపూర్‌లో త్వరలోనే శాంతి నెలకొంటుందని హామీ ఇస్తూ, ఈశాన్య ప్రాంతం త్వరలోనే భారత అభివృద్ధికి కీలకంగా మారుతుందని చెప్పారు. మయన్మార్, థాయ్‌లాండ్‌లను అనుసంధానం చేస్తూ నిర్మిస్తున్న హైవే నిర్మాణం పూర్తి అయిన వెంటనే మణిపూర్ వాణిజ్యానికి, తూర్పు ఆసియాతో అనుసంధానతకు కేంద్రంగా మారుతుందంటూ ఆ రాష్ట్రానికి ఒక సానుకూల భవిష్యత్తు ఉన్న విషయాన్ని ఆయన పట్టి చూపారు.

ఇవన్నీ ఒక ఎత్తయితే, అవిశ్వాస తీర్మానం సందర్భంగా ఆగస్ట్ 10న నరేంద్ర మోదీ లోక్‌సభలో ప్రసంగిస్తుండగా కాంగ్రెస్ నాయకులు ప్రవర్తించిన తీరు జుగుప్సాకరంగా ఉంది. సోనియా గాంధీ ఎంత దిగజారి ప్రవర్తించారో మీడియాలో కథనాలు వచ్చాయి. గోల చేయమని, ప్లకార్డులు చూపమని ఆమె తన పార్టీ సభ్యులనే కాదు, మిత్రపక్షాల ఎంపీలను కూడా బాగా ప్రోత్సహించారు. అంటే నరేంద్ర మోదీ ఉపన్యాసం సమయంలో గోలకు, గందరగోళానికి వెనుక ఉన్నది సోనియా గాంధీయే. 'ఇండియా' అని, 'మణిపూర్' అంటూ నినాదాలు చేయాలని ముందే కూడబలుక్కుని వచ్చారన్న సంగతి కూడా అర్థమవుతుంది. ప్రధాని ఉపన్యాసానికి ముందే ప్రతిపక్ష నాయకుడు అధీర్ రంజన్ చౌధురి తన ప్రవర్తన కారణంగా సస్పెండయ్యారు. అధీర్ రంజన్ గందరగోళం రక్తి కట్టడం లేదన్న అనుమానం కాబోలు. ఒక దశలో సోనియాగాంధీ ఆయనకు సైగ చేశారు. ఇక చల్లబడి, మంచినీళ్లు తాగమని ఆ సైగల ఉద్దేశం. మొదట తన పార్టీ సభ్యుడు గౌరవ్ గొగోయ్, తరువాత డీఎంకే సభ్యుడు దయానిధి మారన్, ఆ తరువాత టీఎంసీ ఎంపీ మొహువా మొయిత్ర సోనియాగాంధీ కనుసన్నలలో అరుపులు లంఘించు కున్నారు. అసలు మోదీ సాయంత్రం నాలుగు ప్రాంతంలో సభలోకి ప్రవేశిస్తున్నప్పుడే 'ఇండియా' అంటూ విపక్షాలు నినాదాలు అందు కున్నాయి. అయితే ఈ గోల సమయంలో రాహుల్ సభకు గైర్హాజరయ్యారు. మోదీ కుటుంబ పాలన అంటూ విమర్శలకు దిగినప్పుడు బీజేపీలో కూడా అలాంటి సంస్కృతి ఉందని చెప్పే ఒక చార్ట్‌ను సోనియా ఆజ్ఞ మేరకు దయానిధి మారన్ ప్రదర్శించారు.

ఇక సోనియా సుపుత్రుడు, గాంధీ కుటుంబ వారసుడు, కాంగ్రెస్ అగ్ర నాయకుడు రాహుల్ నిర్వాకం చూడాలి! తాజా అవిశ్వాస తీర్మానం మీద ఆయన ఉపన్యాసం తీరుతెన్నులు, సభలో ప్రద ర్శించిన మర్యాదలు గమనించిన తరువాత దేశంలో ఎక్కువ మీడియా సంస్థలు ముక్కు మీద వేలేసు కున్నాయి. ఫ్లయింగ్ కిస్‌లు వదిలి ఆయన తనదైన శైలిలో పార్టీ పరువును దిగజార్చారు. అది తప్పేమీ కాదు, అది సర్వులనూ ప్రేమించే విశాల హృదయం, ఇదంతా 'ప్రేమ దుకాణం' వ్యవహారం అన్నట్టు

నా గుండెలో భాగం

ఊహే ఉండదు. కానీ భారతదేశంలో తొలిసారి మిజోరాం రాజధాని ఐజ్వాల్ మీద నాటి కేంద్రం, ఇందిర ప్రభుత్వం వైమానిక దాడులు చేయించింది. ఆ దుర్దినాన్ని అక్కడి ప్రజలు ఇప్పటికి ఏటా గుర్తు చేసుకుంటున్న సంగతిని కూడా ప్రధాని కాంగ్రెస్ సభ్యులకు గుర్తు చేశారు. అదే 'జోరామ్ ని' లేదా 'జోరామ్ దినం'.

వారం పాటు ఆగకుండా జరిగిన మిజో తిరుగుబాటును అణచడానికి ఇందిర ఈ తీవ్ర చర్య తీసుకున్నారు. ఇక ఖలిస్తాన్ తీవ్రవాదులను అమృత్‌సర్‌లోని స్వర్ణదేవాలయం నుంచి బయటకు తీసుకురావడానికి ఇందిరాగాంధీ ఆపరేషన్ బ్లూస్టార్ నిర్వహించారు. ఇది భారత సైన్యం ఆధ్వర్యంలో జరిగింది. దేశ పౌరుల మీద రక్షక దళాలను ప్రయోగించిన పార్టీ వారసులు వారి రక్షణ గురించి గొంతు చించుకోవడం విషాదమే మరి.

ఆయన పార్టీ సమర్థించుకునే ప్రయత్నం చేసి రాహుల్ కంటే దారుణంగా పార్టీని అపఖ్యాతి పాల్జేసింది. ఆయన భారత రాజకీయ రంగం మీదకి వచ్చి రెండు దశాబ్దాలు గడిచాయి. నాలుగుసార్లు లోక్‌సభ సభ్యుడు. అయినా పరిణతిని కాస్త కూడా ప్రదర్శించ లేకపోతున్నారు. ఇందుకు అవిశ్వాసం మీద ఉపన్యాసమే పెద్ద ఉదాహరణ అన్నది న్యూస్ 18 చానల్. ఆ ఉపన్యాసాన్ని 'వికృతం', 'వికారం' అని చెప్పడానికి ఆ చానల్ సందేహించలేదు. దేశమంతా వీక్షించే అత్యున్నత సభలో తాను ఏం మాట్లాడాలో కనీసం అవగాహన లేకుండా, ముందస్తుగా దాని గురించి ఆలోచించకుండా వచ్చి మాట్లాడారని రాహుల్‌ను దుమ్మెత్తి పోస్తున్నది మీడియా. పార్లమెంట్‌లో ప్రవర్తన మాత్రమేనా! గాఢనిద్రలో ఉన్న పార్టీని మేల్కొల్పే నైపుణ్యాన్ని సాధించలేదు అని కూడా వ్యాఖ్యానించింది. ఆఖరికి తల్లి సోనియా గాంధీ బీజేపీయేతర పార్టీలను కూడగట్టి మోదీకి వ్యతిరేకంగా నిలబెట్టే సత్తా కూడా కనిపించడం లేదని చెప్పేసింది. కాంగ్రెస్ పరిస్థితి మునగానాం తేలానాం అన్నట్టు ఉంటే, రాహుల్‌లో ఆ వైఫల్యాల నుంచి నేర్చుకోవాలన్న తపన కాస్త కూడా కానరాదు. కుటుంబం ఎన్ని కడగండ్లు పడుతున్నా అందులోని చంటి పిల్లలకి పట్టదు కదా! రాహుల్ వ్యవహార సరళి సరిగ్గా అదే అనిపిస్తుంది.

కాంగ్రెస్ నేతలలో ఆది నుంచి ఒక ప్రత్యేక లక్షణం కనిపిస్తూ ఉంటుందని పెద్దలు చెబుతారు. ఆ లక్షణాన్నే రాహుల్ గాంధీ పుణికిపుచ్చుకున్నారు. ప్రదర్శనలు, యాత్రల విషయంలో ఆ పార్టీ నాయకులు చిన్నా పెద్దా, ఆడా, మగా, బీదా బిక్కీ అనే తేడా లేకుండా వాళ్లు చెబుతున్నది పరమ శ్రద్ధగా వింటున్నట్టు కనిపిస్తారు. చెవి అవతలివారి నోటికి అందిస్తారు కూడా. రాహుల్ గాంధీ అయితే పొదివి పట్టుకుని మరీ తన వెంట నడిపించుకువెళ్లారు, భారత్ జోడో యాత్రలో. అయితే ఇలాంటి నిభాయింపు పార్లమెంటులో, అందులోనూ కాంగ్రెసేతర పక్షాలు అధికారంలో ఉంటే కనిపించదు. గాంధీ కుటుంబీకుల వ్యవహార నరళి అధ్వానంగా మారిపోతుంది. ఆనంద్ రంగనాథన్ వంటి వారు విసిరే చెణుకులకు లోటే ఉండడం లేదు. మోదీ ఇంటి పేరుతో చెడ వాగి రెండేళ్లు శిక్ష పడిన రాహుల్, సుప్రీంకోర్టు నుంచి స్టే తెచ్చుకుని మళ్లీ సభలోకి వచ్చారు. ఆ సమయంలో కాంగ్రెస్ శ్రేణులు బాణసంచా పేల్చి, మిఠాయిలు పంచుకుని సంబరాలు చేసుకున్నారు. ఆనంద్ రంగనాథన్ అభిప్రాయం ప్రకారం ఆ పండుగ చేసుకోవలసింది కాంగ్రెస్ కాదు, బీజేపీయే. ఎందుకంటే, తమ ప్రధాన నిందాస్తుతి కారుడు మళ్లీ సభకు వచ్చినందుకు! నిజానికి అందుకు సుప్రీంకోర్టుకు కూడా బీజేపీ కృతజ్ఞత చూపాలి. ఇప్పటిదాకా 250 స్థానాలు వస్తాయనుకుంటున్న బీజేపీకి రాహుల్ మళ్లీ రంగం మీదకు వచ్చారు కాబట్టి కచ్చితంగా 350 సీట్లు వస్తాయని రంగనాథన్ జోస్యం పలికారు.

భారత్ జోడో యాత్రతో దేశంలో బీజేపీయేతర శిబిరంలో ఒక జాతీయ నేత అవతరించాడని కొందరు తొందరపడి నిర్ణయానికి వచ్చారు. ఈ మాట ఎవరో అనక్కరలేదు. అవిశ్వాసం మీద రాహుల్ ఉపన్యాసంతోనే విపక్షాల అనుభవానికి వచ్చింది. ఆయన భారత్ జోడో యాత్ర చేసినా ప్రయోజనం శూన్యమన్న అభిప్రాయానికి వచ్చేశారు.

ఆమె మరణం గురించి ఆలోచనేమిటి?

ఎన్డీయే ప్రభుత్వం మీద వచ్చిన అవిశ్వాస తీర్మానానికి సమాధానం ఇస్తూ ప్రధాని నరేంద్ర మోదీ మణిపూర్ అంశం మీద తన మనోగతాన్ని సభ ముందు ఉంచారు. ఇంత రచ్చ చేసి, ఇంతకాలం సమావేశాలను సాగనీయకుండా చేసిన కాంగ్రెస్, విపక్షాలు ఆ సమయానికి బయటకు ఉడాయించాయి.

అవిశ్వాసంలో కీలకమైన మణిపూర్ సమస్య మీద ప్రధాని మనోగతం:

మణిపూర్ రాష్ట్రంలో సమీప భవిష్యత్తులోనే శాంతిభద్రతలు నెలకొంటాయని భారతజాతికి నేను హామీ ఇస్తున్నాను. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం అక్కడ శాంతిని నెలకొల్పేందుకు కలసి పనిచేస్తాయి. ఇందుకు మా ప్రభుత్వాలు కట్టుబడి ఉన్నాయి. అక్కడ జరిగిన నేరాలకు, మహిళలపై జరిగిన వాటితో సహా బాధ్యులైన వారికి కఠిన శిక్షలు పడేటట్టు చేస్తాం. భారతదేశం, పార్లమెంట్ మీకు అండగా ఉన్నాయి. భారతమాతను మణిపూర్‌లో హత్య చేశారంటూ రాహుల్ గాంధీ సభలో చేసిన వ్యాఖ్యను ప్రధాని ఆయన విజ్ఞతకే వదిలిపెట్టారని అనిపిస్తుంది. భారతమాత మరణం గురించి కొందరు ఆ విధంగా ఎందుకు ఊహిస్తున్నారో నాకు అంతుపట్టడం లేదు అని ఆయన వ్యాఖ్యానించారు. నిజమే, ఇంతకు మించి భారతమాత హత్య గురించి మాట్లాడితే మోదీకీ, రాహుల్‌కీ తేడా ఉండేది కాదు. మణిపూర్ అంశం మీద ప్రతిపక్షాలు అనుసరించిన వైఖరిని మోదీ దుయ్యబట్టారు. వారిని మేం చర్చలకు ఆహ్వానించాం. అందుకు సంబంధించి హోంమంత్రి లేఖ కూడా పంపించారు. అయితే విపక్షాలకు ఆ అంశాన్ని చర్చించే ధైర్యం లేదని మోదీ తేల్చి చెప్పారు.

'ఇండియా' అని యూపీఏ కూటమికి పేరు మార్చడం గురించి కూడా మోదీ ఘాటుగా స్పందించారు. కేవలం పేరు మార్చి అధికారం కైవసం చేసుకోవాలని ప్రతిపక్షాలు చూస్తున్నాయని ప్రధాని విమర్శించారు. దీనినే ఆయన ఘమండ్డియా అని పిలుస్తున్నారు. అంటే దగాకోరుల కూటమి. దీనికి ప్రధాని ఇచ్చిన ముగింపుతో విపక్షాలకు దిమ్మ తిరిగింది. ఇండియా కూటమిని తెచ్చి, యూపీఏకు స్వస్తి పలికిన వారందరికీ నా కృతజ్ఞతలు అని మోదీ ముక్తాయించారు.

ఎంత బుద్ధిమాలిన వాడైతే ''భారతమాతను మణిపూర్‌లో హత్య చేశారు'' వంటి వ్యాఖ్యాలు నిండు సభలో చేస్తాడు! రాహుల్ గాంధీ బలహీనతలు, తిక్కలు, భయానక నట వినాస్యాలు ఇవన్నీ దాచేందుకు ఏర్పడిన 'ఇండియా' ప్రయత్నాలన్నీ వమ్ము అయిపోయాయని వారు అప్పుడే తీవ్ర నిర్వేదంలో పడిపోయారనిపిస్తుంది. గతంలో థమ్స్ అప్ గుర్తులా బొటన వేలు చూపించడం, తరువాత కన్నుకొట్టడం వంటి వాటిని 'ఇండియా' వంటి గంభీరమైన పేరు వెనుక దాచేద్దామని అనుకుంటే, ఈసారి ఏకంగా ఫ్లయింగ్ కిస్ ఇచ్చి విపక్షాలను అక్షరాలా నీరు గార్చేశాడు యువరాజు. సమయం సందర్భం లేకుండా కెమేరాల నంగతి పట్టించుకోకుండా ఇలా కన్ను కొట్టేవాడితోనూ, ఫ్లయింగ్ కిస్‌లు విసిరేవాడితోనూ 2024 ఎన్నికల సమరంలోకి దూకగలమా అన్న పెద్ద సందేహం ఇప్పుడే వాళ్లలో మొదలయింది. ఆ మేరకైనా ఆ శిబిరానికి మేలు జరిగినట్టే. అవిశ్వాస తీర్మానం మీద చర్చకు తేదీలు రావడం, రాహుల్ గాంధీకి పడిన శిక్ష మీద సుప్రీం కోర్టు స్టే ఇవ్వడం ఒకేసారి జరిగాయి. మా నేతను వెంటనే పార్లమెంటుకు పిలవాలంటూ లోక్‌సభలో కాంగ్రెస్ నేత అధీర్ రంజన్ చౌధురి విజ్ఞప్తి పని చేసిందా, లేక రాహుల్ పార్లమెంట్‌లో కనిపించి నాలుగు మాటలు మాట్లాడినా పార్టీకి లాభమే జరుగుతుందని బీజేపీ తెలివిగా ఊహించిందో తెలియదు కానీ, ఆగమేఘాల మీద రాహుల్‌ను లోక్‌సభలో ప్రతిష్టించారు. మొదట ప్రధాన వక్తలలో పేరు కూడా చేర్చారు. చివరి క్షణాలలో స్వల్పకాలిక ఉపన్యాసానికి పరిమితం చేశారు. స్వల్పకాలిక ఉపన్యాసంతోనే ఇంత వైరాగ్యాన్ని సృష్టించినవాడికి ప్రధాన వక్తగా అవకాశం ఇచ్చి, సుదీర్ఘంగా ప్రసంగించే అవకాశం ఇచ్చి ఉంటే ఇంకెంత ఉత్పాతం జరిగి ఉండేదో! కానీ మోదీని దుమ్మెత్తి పోసే పాత విద్యే తమకు బాగా నప్పిందని రాహుల్ మాతృమూర్తి, ఇతర కాంగ్రెస్ నాయకులు గట్టిగా అభిప్రాయపడిన మీదటే, లోక్‌సభలో పునఃప్రవేశం చేసిన తరువాత కూడా రాహుల్ పాత పంథాలోనే నడుస్తున్నారని ఒక వర్గం మీడియా చెబుతోంది.

పైగా 2.13 గంటలు రసవత్తరంగా సాగిన ప్రధాని మోదీ ఉపన్యాసం ముందు రాహుల్ మాట చిన్న కొవ్వొత్తిలా కూడా కనిపించలేదు. మోదీ ఎప్పటిలాగే తన ఉపన్యాస కళకు అదనంగా చక్కని హోమ్‌వర్క్ చేసి వచ్చారు. అందుకే వచ్చేసారి (మరో ఆరు నెలల వరకు ఎలాగూ అవిశ్వాసం పెట్టలేరు. కాబట్టి 2024లో మళ్లీ తామే నెగ్గిన తరువాత అన్నది మోదీ ఆంతర్యం) అయినా కాస్త అస్త్రాలకి, శస్త్రాలకీ పదును పెట్టుకుని వస్తారని ఆశిస్తున్నాను అని కర్రు కాల్చి వాత పెట్టారు. అయితే మోదీ వాగ్ధాటి రాహుల్ వంటి రసహీనుడికీ, రాజకీయ అజ్ఞానికీ జోకులు, అసందర్భ ప్రలాపంగా కనిపించడం వింతేమీ కాదు. మీడియా ఒక గణనీయమైన అంశాన్ని ఇప్పుడు దేశం ముందుకు తెస్తున్నది.

అవిశ్వాసం వంటి శుష్క యత్నం చేయడంలోనే కాంగ్రెస్, విపక్షాల– మొత్తంగా ఇండియా వైఫల్యం కనిపిస్తుంది. ఏమీ సాధించలేమని తెలిసి పరిమిత ప్రయోజనం కోసం అవిశ్వానం తీర్మానం ప్రవేశపెట్టిన విపక్షాలు నిజానికి చేయ వలసింది అది కాదు. అంతర్యుద్ధం స్థాయికి వెళ్లిపోతున్న మణిపూర్ ఘర్షణలకి, హిందూ ముస్లిం ఘర్షణలకి సంబంధించి, ఇంకా చెప్పాలంటే ముస్లిం ఉన్మాదానికి తీక్షణంగా హరియాణాలో ఎదురైన ప్రతిఘటన ఫలితంగా తలెత్తుతున్న సరికొత్త పరిణామాల గురించి పార్లమెంటులో చర్చించడానికి సిద్ధపడేవారు. కానీ ఆ ధైర్యం ఈ పార్టీలు చేయలేవు. మత కల్లోలాల మీద, సంఘర్షణల మీద చర్చ లేవదీస్తే వాటి బండారమే బయటపడుతుంది. బుజ్జగింపు ధోరణితో ఈ దేశం ఎంత నష్టపోయిందో దేశ ప్రజలకు తెలుస్తుంది. ముస్లిం మతోన్మాదం కూడా ఆ పార్టీ పెంచి పోషించినదే కదా! మణిపూర్ కల్లోలం కాంగ్రెస్ హయాంలో ఈశాన్య భారతం మీద పుట్టిన వ్రణం. అలాంటి రాష్ట్రానికి సాంత్వన చేకూర్చడం కాంగ్రెస్ ఉద్దేశం కాదని ఈ చర్చ తేల్చేసింది.

వీలైతే కాస్త ఆజ్యం పోయడమే పరమోద్దేశంగా కూడా కనిపిస్తుంది. అవిశ్వాసం ప్రతిపాదిస్తున్న వారికైనా తమ చర్య పట్ల కొంచెం సమ్మకం ఉండాలి. ఈసారి అవిశ్వాస తీర్మానంలో విపక్ష శిబిరంలో లోపించింది సరిగ్గా అదే.

– జాగృతి డెస్క్

మురళీ కృష్ణంరాజు

గోదావరి లంక గ్రామాలకు శాశ్వత పరిష్కారం ఎప్పుడు?

ఇటీవల కురిసిన వర్షాలు, అదేవిధంగా గోదావరికి వచ్చిన వరద కారణంగా లంక గ్రామాలకు బాహ్యప్రపంచంతో కమ్యూనికేషన్ తెగిపోయిన పరిస్థితి కొద్దిరోజుల పాటు ఏర్పడింది. ఈ క్రమంలో గోదావరి ప్రవాహం ఏ మాత్రం పెరిగినా పర్యావరణంతో పాటు లంక గ్రామాలకు ఇబ్బందులు ఎదురవుతాయి. లంక గ్రామాలపై ప్రభుత్వాలకు దూరదృష్టి లేదు. లంక ప్రాంతాల విషయంలో భవిష్యత్ ప్రణాళికలు లేవు. వచ్చే దశాబ్దంలో ఇక్కడ ఏర్పడనున్న పరిస్థితులు, అందుకు అనుగుణంగా ఉండాల్సిన సన్నద్ధతపై కూడా శాస్త్రీయ కోణంలో ప్రభుత్వాలు వ్యవహరించాలి. పాలక ప్రభుత్వాలు గోదావరి లంక ప్రాంతాల విషయంలో ఏవిధమైన చర్యలు చేపడతాయి, అందుకు అనుగుణంగా అక్కడ ప్రజలను ఎలా సన్నద్ధం చేయాలి? అనే కోణంలో నిర్ణయాలు తీసుకోకపోతే గోదావరి ప్రాంత భవిష్యత్ అంతా సమస్యల సుడిగుండంలా మారిపోవడానికి ఆస్కారం ఎక్కువగా కనపడుతోంది.

వ్యవసాయమే జీవనాధారంగా సాగే గోదావరి పరీవాహక ప్రాంతంలో ఆ రంగాన్ని రక్షించాలంటే గోదావరి లంక ప్రాంతంలో సమస్యలు పరిష్కరించడంతో పాటు, లంక ప్రాంతంలో ఒక నిర్దిష్ట విధానం అమలు చేయాలి. లేదంటే భవిష్యత్తులో పరిష్కరించలేని ఇబ్బంది ఎదురుకావడం తథ్యంగా కనపడుతోంది.

జీవనది అయిన గోదావరి నదీ పరీవాహక ప్రాంతం వ్యవసాయ రంగానికి ఒక జీవనాడి. అయితే తరచుగా సంభవించే ప్రకృతి వైపరీత్యాల కారణంగా అక్కడ వ్యవసాయ రంగాన్ని కుదుపుతున్న సమస్యలు కూడా అనేకం ఉన్నాయి. పలుమార్లు సంభవిస్తున్న వరదల కారణంగా ఈ ప్రాంతం సమస్యలను ఎదుర్కొంటోంది. ముఖ్యంగా, 1986లో వరదలు వచ్చినప్పుడు విలవిల్లాడిపోయింది. ఆ తరువాత రెండు, మూడు సందర్భాల్లో వరదలు వచ్చినప్పటికీ పెద్దగా ప్రభావం రైతాంగంపై పడలేదు. గోదావరి పరీవాహక ప్రాంతంపై ఆధారపడి జీవనం సాగించే కుటుంబాలు లక్షల సంఖ్యలో ఉన్నాయి.

గోదావరి పరీవాహక ప్రాంతాన్ని మూడు రకాలుగా విభజించారు. ఒకటి పశ్చిమ డెల్టా అంటే, వశిష్ఠ గోదావరి కుడివైపున ఉన్న ప్రాంతం. అదేవిధంగా వశిష్ఠ గోదావరి ఎడమ వైపు ఉన్న ప్రాంతం తూర్పు డెల్టా. అలాగే, ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లోకి గోదావరి ప్రవేశించిన తరువాత పాయలుగా విడిపోయిన సందర్భంలో గోదావరి మధ్యభాగంలో ఉన్న ప్రాంతాన్ని సెంట్రల్ డెల్టా అంటారు. గోదావరి నదీ పరీవాహక ప్రాంతం సమీపంలోని భూములు నల్ల రేగడి భూములు కావడంతో ఏకకాలంలో రెండు నుండి మూడు పంటలు పండించే సత్తా ఇక్కడి రైతాంగం సొంతం.

స్వాతంత్ర్యం వచ్చిన తరువాత మొదటి పంచవర్ష ప్రణాళికలో సాంద్ర వ్యవసాయ పథకం అమలుకు బడ్జెట్ కేటాయింపులు జరిపారు. ఆ విధంగా దేశ వ్యాప్తంగా ఆరు జిల్లాలను ఎంపిక చేయగా, వాటిలో గోదావరి కూడా ఒకటి. అందువల్ల ఆనాడు రేడియో వార్తల్లో ప్రతి రోజూ సాంద్ర వ్యవసాయ పథకం అమలులోఉన్న ఉభయ గోదావరి జిల్లాల్లో వాతావరణం వివరాలు ప్రత్యేకంగా చెప్పేవారు. ఈ విధంగా వ్యవసాయ రంగంలో విప్లవాలు తీసుకుని వచ్చిన ప్రాంతమిది.

గోదావరి ఏటి గట్టుకు లోపల భాగం అంటే, గోదావరి మేట వేసిన ప్రాంతంలో వ్యవసాయానికి రైతాంగం.. నాటి నుండి కొంత ప్రయత్నం చేస్తూ వచ్చింది. అంటే ఇరిగేషన్ శాఖ అధీనంలో ఉండే లంక ప్రాంతంలో సాగు మాత్రమే జరిగేది. ప్రస్తుతం గోదావరికి ఇరువైపులా లంక ప్రాంతాల్లో సాగుతో పాటు నివాస ప్రాంతాలు ఏర్పాటు కావడంతో వర్షాకాలం వస్తే చాలు లంక గ్రామాలకు వరద వచ్చే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఒక దశాబ్ద కాలంలో చిన్నగా ప్రారంభమైన నివాస ప్రాంతాలు మైనర్, మేజర్ పంచాయతీలుగా రూపాంతరం చెందాయి.

గోదావరి ఒడిలో నివసించే ప్రజలు అందరూ ఇక్కడ రవాణా సదుపాయాలు కల్పించాలని, అందుకు అనుగుణంగా వారధులు నిర్మాణం చేయాలని కోరుతున్నారు.

పర్యావరణం మాట దేవుడికెరుక, రవాణా సౌకర్యాలు పెంచాలన్నదే ఇక్కడ ప్రాంతవాసులు ప్రధాన డిమాండ్‌గా కనపడుతోంది. వశిష్ఠ గోదావరి కుడి వైపున దాదాపుగా 25 పంచాయితీ గ్రామాలు ఉండగా, అయోధ్య లంక మాత్రం మేజర్ పంచాయతీగా రూపాంతరం చెందింది. అదే విధంగా తూర్పు డెల్టా వైపు కూడా లంక గ్రామాలు అధికంగా ఉన్నాయి. అక్కడ కూడా లంక గ్రామాల సంఖ్య పెరుగుతూ వస్తున్న సందర్భం కనపడుతోంది. ★

అల్లర్ల వెనుక వ్యక్తులు బయటపడుతున్నారు

పార్లమెంటులో మణిపూర్ కల్లోలంపై ప్రతిపక్షాలు నానా రభస సృష్టిస్తున్న సమయంలోనే, నాలుగు దశాబ్దాల నాటి పాలకులు, నేటి ప్రతిపక్ష నాయకులు తొక్కి పెట్టిన ఉత్తర్‌ప్రదేశ్‌లోని మొరాదాబాద్ మత ఘర్షణలపై జ్యుడిషియల్ కమిషన్ ఇచ్చిన నివేదికను యోగి ప్రభుత్వం ఆగస్టు 8న ఉత్తర్‌ప్రదేశ్ అసెంబ్లీలో ప్రవేశపెట్టడం ద్వారా వెలుగులోకి తీసుకువచ్చింది. ఎన్నికలలో గెలుపుకోసం ఓటు బ్యాంకు రాజకీయాలు, మైనార్టీ సంతృప్తీకరణ విధానాలు అవలంబించడం వల్లే 40 ఏళ్లపాటు ఈ నివేదిక వెలుగులోకి రాలేక పోయింది. ఇప్పుడు ఈ నివేదికను అసెంబ్లీలో ప్రవేశపెట్టడం ప్రతిపక్షాలకు నచ్చడం లేదు. ఇంతకాలమైన తరువాత దీనిని బయటపెట్టడం వల్ల ప్రయోజన మేమిటని ప్రశ్నిస్తున్నారు కానీ, వాస్తవంగా వారు భుజాలు తడుముకుంటున్నట్టుగా ఉంది.

1980లో ఈ అల్లర్లు దేశాన్ని ఉలిక్కిపడేలా చేశాయి. నాడు ఉత్తర్‌పద్రేశ్ రాష్ట్రమంతా వ్యాపించి 300మంది ప్రాణాలను బలిగొన్న అల్లర్లకు సంబంధించిన నాటి అలహాబాదు మాజీ న్యాయ మూర్తి సక్సేనా ఇచ్చిన నివేదికను నాలుగు దశాబ్దాల పాటు ప్రభుత్వాలు బహిర్గతం చేయకుండా, అందులో వారు చేసిన సూచనలను పాటించకుండా తాత్సారం చేశాయి. మత కల్లోలాలు ఎక్కడ జరిగినా అటు రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ ఎస్ఎస్)ను, ఇటు భారతీయ జనతా పార్టీని అందుకు బాధ్యులను చేయడం నాటి పాలకులకు, మీడియాకు ఆనవాయితీగా ఉన్న విషయం తెలిసిందే. కానీ జస్టిస్ సక్సేనా నేతృత్వంలోని న్యాయ కమిషన్ సమర్పించిన 496 పేజీల నివేదిక ఆర్ఎస్ఎస్‌కూ, బీజేపీకి క్లీన్‌చిట్ ఇచ్చింది. అంతేనా, నాటి ముస్లింలీగ్ నాయకుడైన డా॥ షమీమ్ అహ్మద్‌ఖాన్‌ను, ఆయన ముఖ్య మద్దతు దారులను ఈ కల్లోలాలకు బాధ్యులుగా తేల్చింది. తమ రాజకీయ ఆకాంక్షలను నెరవేర్చు కోవడం కోసం వారు అల్లర్లను రెచ్చగొట్టడమే కాక పాలనా యంత్రాంగంపై తిరగబడి పోరాడేందుకు సిద్ధ మయ్యారని సక్సేనా నివేదిక పేర్కొంది. బహుశ, నాటి ప్రభుత్వాలు దానిని బయట పెట్టకపోవడానికి కారణం ఇదేనేమో!

ఏమిటీ మొరాదాబాద్ అల్లర్లు?

మొరాదాబాద్ పట్టణంలోని ఒక ఈద్గా వద్ద ఆగస్టు 13, 1980 ఈ అల్లర్లు ప్రారంభమై దావానలంలా సంభల్, అలీగఢ్, బరేలీ, ప్రస్తుత ప్రయాగ్‌రాజ్ అయిన అలహాబాద్‌కు, మొరాదాబాద్ గ్రామీణ ప్రాంతాలకు విస్తరించి 1981 వరకు కొనసాగాయి. కనిపించకుండా పోయిన వారిని కలుపుకుని 289 మంది మరణించినట్టు నాటి రాష్ట్ర హోంమంత్రి స్వరూప్ కుమారి బక్షి అసెంబ్లీలో వెల్లడించారు.

మొరాదాబాద్‌లోని ఈద్గా మైదానంలో ముస్లింలు ఈద్-ఉల్- ఫితర్ ప్రార్థనలు చేస్తున్న సమయంలో రెండు పందులు మైదానంలో కనిపించాయి. ఇస్లాంలో పందులను హరామ్‌గా లేదా నిషిద్ధమైనవిగా పరిగణిస్తారు. వాటిని చూడగానే, ముస్లింలు ఆగ్రహంతో ఊగిపోతూ, విచ్చలవిడిగా అల్లర్లకు దిగారు. విషయం తెలుసుకొని అక్కడికి వచ్చిన పోలీసులపై రాళ్లు విసరడంతో, వారు ఆ గుంపుపై కాల్పులు జరిపారు. ఇంక అంతే, ఉన్మాదంతో రెచ్చిపోయి, పోలీసుస్టేషన్లు, పోలీస్ ఔట్‌పోస్టులు, హిందువులపై దాడి చేశారు. తమకు సంబంధంలేని వ్యవహారంలోతమపై దాడులు చేస్తున్నందుకు హిందువులు తిరగబడడంతో అది మత ఘర్షణల రంగు పులుముకుంది. దీనితో ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రం కొన్ని నెలలపాటు ఉద్రిక్తలతో ఉడికిపోయింది.



ఆర్ఎస్ఎస్, హిందూ సంస్థల పాత్రను కొట్టి పారేసిన నివేదిక

1980 మొరాదాబాద్ అల్లర్లలో అటు ఆర్ఎస్ఎస్‌కు కానీ, ఇటు హిందూ సంస్థలకు కానీ ఎటువంటి సంబంధం లేదనే విషయాన్ని నివేదిక స్పష్టంగా వెల్లడించింది. ఆ సమయంలో ఆర్ఎస్ఎస్ కానీ బీజేపీ కానీ ఎటువంటి రహస్య సమావేశాలూ నిర్వహించలేదని, అటువంటి ఆధారాలు కూడా లేవని పేర్కొంది. వారు ఏ రకంగానూ, ముస్లిం వ్యతిరేక చర్యలకు జనాలను రెచ్చగొట్టలేదని నివేదిక చెప్పింది. వాస్తవాలను విస్తృతంగా విశ్లేషించిన అనంతరం, ఈ సంస్థలకు ఏరకంగానూ ఇందులో జోక్యం చేసుకోలేదనే విషయం తేలిందని నివేదిక నొక్కి చెప్పింది.

ముస్లిం లీగ్ నాయకుడి కీలక పాత్ర

కమిషన్ పరిశోధనలో డా॥ షమీమ్ అహ్మద్ ఖాన్, అతడి మద్దతుదారులు, ముస్లిం లీగ్ అనుబంధ సభ్యులు పోషించిన కీలక పాత్రను నొక్కి చెప్పాయి.

వాస్తవానికి నాడు ఈద్‌ఖానా, భురా చౌరాహా, బర్ఖ్‌ఖానాలో సంభవించిన మరణాలకు తోపులాట కారణమని, ఇందుకు పోలీసులను, అధికారులను బాధ్యులను చేయలేమని కమిషన్ అభిప్రాయపడింది. రాళ్లు విసురుతున్న అల్లరి మూకల నుంచి తమను తాము కాపాడుకునేందుకే పోలీసులు ఈద్గా వద్ద కాల్పులు జరిపారంటూ పోలీసులకు కూడా కమిషన్ క్లీన్ చిట్ ఇచ్చింది.

నివేదిక సూచనలు

నివేదిక కేవలం నాటి ఘటనలలో వాస్తవాలను బయటపెట్టడమే కాదు, భవిష్యత్తు గురించి లోతైన అంతర్ దృష్టులను ఇస్తుంది. భవిష్యత్తులో ఇటువంటి పరిస్థితులు ఏర్పడితే ఎదుర్కొనేందుకు, వాటిని

అణచివేసేందుకు వ్యూహాలను ప్రతిపాదించింది. ముఖ్యంగా భవిష్యత్తులో సంక్షోభ సమయంలో వదంతులను ఎదుర్కొనేందుకు లౌడ్ స్పీకర్లను ఉపయోగించాలని సూచించింది.

వీటన్నింటినీ మించి, ముస్లింల సంఖ్య పెరగడం, రాజకీయ నాయకులు వారిని ఓటు బ్యాంకుగా పరిగణించి ప్రత్యేక ప్రోత్సాహకాలు ఇవ్వడం మంచిది కాదని నివేదిక పేర్కొంది. ఈ ఘటన జరగడానికి ప్రధాన కారణాలలో ముస్లిం నాయకులు తమ ప్రయోజనాలు నెరవేర్చుకోవడానికి సాధారణ ముస్లింలను రెచ్చగొట్టడమేనని నివేదిక స్పష్టం చేసింది. ముస్లింలను ఓటుబ్యాంకుగా చూసే వైఖరిని ప్రోత్సహించరాదని నివేదిక హితవు పలికింది. వారిని ఒక వ్యాపార వస్తువుగా ఎన్నికల సమయంలో పరిగణిస్తే ఫలితాలు ప్రమాదకరంగా ఉంటాయని హెచ్చరించింది.

వెల్లడైన ఈ వాస్తవాలు చారిత్రిక వృత్తాంత వివరణలను తిరిగి అంచనా వేసుకునేందుకే కాక, మతపరమైన ఘర్షణల బహుముఖీయ స్వభావాన్ని గుర్తించి, అన్ని విశ్వాసాలను గౌరవించే ఒక సమరస మైన సమాజం దిశగా కలిసి పని చేసే అవకాశాన్ని కల్పిస్తాయి.

దేశంలో మత ఘర్షణలు

భారతదేశంలో అతి భారీ స్థాయిలో జరిగిన మత ఘర్షణలుగా దేశ విభజన సమయంలో పశ్చిమ బెంగాల్‌లోని నౌఖాలీ, బీహార్‌లోని గ్రామీణ ప్రాంతాలలో జరిగిన వాటిని పరిగణిస్తారు. కానీ, ఈ జాడ్యం 1893లో ముంబైలో చోటు చేసుకుంది. ఇందులో వందమంది మరణించగా, 800మంది గాయపడ్డారు. 1857లో సైనికుల తిరుగుబాటు అనంతరం హిందూ, ముస్లిం వర్గాల మధ్య బ్రిటిష్ వారి విభజించి, పాలించే విధానాలు దేశంలో మత మౌఢ్యాన్ని, ఉద్రిక్తతలను పెంచాయి. ముఖ్యంగా 1921-1940 మధ్య కాలం క్లిష్టంగా సాగింది. 1926లో కలకత్తాలో జరిగిన మొహర్రం వేడుకల సందర్భంగా చోటు చేసుకున్న ఘర్షణ 28 మరణా లకు దారితీసింది. అయితే, ఇవన్నీ స్వాతంత్ర్యానికి పూర్వం జరిగినవి. స్వాతంత్ర్యా నంతరం చోటు చేసుకున్న అతి భారీ మత కల్లోలాలు 1961లో మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్‌లో జరిగాయి.

1969 అహ్మదాబాద్ ఘర్షణలు: హిందూ, ముస్లింలకు మధ్య అల్లర్లు అహ్మదాబాద్‌లో 1969లో ప్రారంభమయ్యాయి. ఈ అల్లర్లలో సుమారు వెయ్యి మంది మరణించారు. కాగా, ఈ అల్లర్లను కేవలం మొరార్జీ దేశాయ్ అనుచరుడిగా ఉన్న నాటి గుజరాత్ ముఖ్యమంత్రిని అభాసుపాలు చేసేందుకు కాంగ్రెసు లోని ఇందిర మద్దతుదారులు సృష్టించినవనే వార్తలు నాడు వెలువడ్డాయి.

అనంతరం ఉత్తర్‌ప్రదేశ్‌లోనూ, దేశంలోని ఏదో ఒక ప్రాంతంలో ఇవి జరుగుతూనే వస్తున్నాయి.

1979లో జెంషెడ్‌పూర్‌లోనూ, అలీగఢ్ లోనూ జరుగగా, 1980లో మొరాదాబాద్‌లో మత కల్లోలాలు చోటు చేసుకున్నాయి.

1984లో సిక్కుల ఊచకోత: ఇందిరాగాంధీ హత్యానంతరం ప్రారంభమైన సిక్కుల ఊచకోత 15 రోజులపాటు కొనసాగింది. ఇందులో 2,700మంది మరణించగా, వేలాదిమంది గాయపడ్డారు. ఎన్నో విచారణా ప్యానెళ్ల తర్వాత 8మందిని శిక్షించగా, ఇందులో పాల్గొన్న రాజకీయ నాయకులు, పోలీసులు తప్పించుకున్నారు.

1987 మీరట్ అల్లర్లు: దాదాపు రెండు నెలలు కొనసాగిన అల్లర్లలో పోలీసులు దర్యాప్తు జరిపి నప్పటికీ, అనంతరం ప్రభుత్వం వాటిని ఉపసంహ రించింది. హషీంపూర్ అనే ప్రాంతంలో అరెస్టు చేసేందుకు వచ్చిన పోలీసులను అక్కడి ప్రజలు అడ్డు కోవడం, అదనపు సిబ్బంది రావడంతో ఆగ్రహించి ఘర్షణకు దిగడం, అనంతరం చినికి చినికి గాలివానై 350మంది ప్రాణాలు కోల్పోవడం జరిగింది.

1989 భాగల్‌పూర్ ఘర్షణలు: పోలీసుల అత్యాచారాలకు వ్యతిరేకంగా అక్టోబర్ 23, 1989న అల్లర్లు ప్రారంభమై నెలరోజుల పాటు సాగాయి. నమోదు చేసిన 864 కేసులలో 535 కేసులను ఆధారాలు లేకపోవడంతో కొట్టివేసి, నేరస్థులను వదిలేశారు. ఈ అల్లర్లలో వెయ్యిమంది ఊచకోతకు గురికాగా, 50వేల మంది నిర్వాసితులయ్యారు, 11,500 గృహాలను దహనం చేశారు.

1992 ముంబై అల్లర్లు: బాబ్రీ మసీదు కూల్చి వేసిన కొద్ది గంటల్లోనే ముంబైలో అల్లర్లు ప్రారంభం అయ్యాయి. 1992 డిసెంబర్‌లో ఆగకుండా ఐదు రోజుల పాటు, జనవరిలో ఒక పదిహేనురోజుల పాటు ముందెన్నడూ లేని విధంగా జరిగిన ఈ అల్లర్లలో దాదాపు 1,788 వ్యక్తులు మరణించగా, కోట్ల విలువైన ఆస్తులు ధ్వంస మయ్యాయి. దీనిపై వేసిన శ్రీ కృష్ణ కమిషన్ ఐదేళ్ల అనంతరం తన నివేదికను సమర్పించినా, ఆధారాలు లేక తప్పించు కున్నవారే ఎక్కువ.

2002 గుజరాత్ అల్లర్లు: విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ) కార్యకర్తలు ప్రయాణిస్తున్న రైలుపై 27 ఫిబ్రవరి 2002న ముస్లిం మూకలు దాడి చేసి, నిప్పంటించాయి. ఈ ఘటనలో 58 మంది హిందూ కార్యకర్తలు మరణించారు. ఈ ఘటన ఫలితంగా చోటు చేసుకున్న భారీ అల్లర్లలో అనేకమంది మరణించారు.

దశాబ్దాల పాటు కేంద్రంలో, రాష్ట్రాలలో అధికారం చేపట్టిన సెక్యులర్ పార్టీ కాంగ్రెస్ పాలనలోనే అత్యధిక మత ఘర్షణలు, కల్లోలాలు చోటు చేసుకున్నాయి. జాబితాలో పేర్కొన్నవి కొన్నే అయినా, మైనార్టీల సంతృప్తీకరణ రాజకీయాల కారణంగా ఆ కాలంలో దేశవ్యాప్తంగా మతపరమైన ఘర్షణలు చేసుకోని రాష్ట్రం లేదనడం అతిశయోక్తి కాదేమో!

- జాగృతి డెస్క్

అటకెక్కిన 'సమాచార హక్కు'

సమాచార హక్కు చట్టం-2005లో అమలులోకి వచ్చిన ఓ అస్త్రం. సామాన్యులు కూడా ప్రతి సమాచారాన్ని తెలుసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన బ్రహ్మాస్త్రం. ప్రభుత్వం, ప్రభుత్వ అధికారుల్లో జవాబుదారీతనం పెంచిన పరిణామం. పాలనను కూడా గాడిలో పెట్టేందుకు పనికొస్తున్న ఆయుధం. కానీ, తెలంగాణ రాష్ట్రంలో సమాచార హక్కు చట్టానికి పాతరేస్తున్నారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పక్కాగా అమలైన సమచార హక్కు చట్టం-2005, తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఆవిర్భవించినప్పటి నుంచీ క్రమంగా నిర్వీర్యమై పోతోంది. వాస్తవానికి పాలనలో పారదర్శకత పెంచడం, ప్రభుత్వంలో అవినీతిని తగ్గించడమే లక్ష్యంగా సమాచార హక్కు చట్టం అమల్లోకి వచ్చింది. కానీ, తెలంగాణ సర్కారు పనితీరు మాదిరిగానే ఈ చట్టం ప్రాధాన్యం కూడా కనుమరుగై పోతోంది. గ్రామ పంచాయతీ మొదలుకొని రాష్ట్ర సచివాలయం దాకా ఈ హక్కు చట్టం అసలు అమలు కావడం లేదు. చిన్నపాటి సమాచారం కూడా ప్రజలకు అందడం లేదు. మొత్తానికి రాష్ట్రంలోని 8వేల 924 ప్రభుత్వ కార్యాలయాల్లో అసలు సమాచార హక్కు చట్టం అమలు కావడమే లేదు. సాక్షాత్తూ సమాచార కమిషన్ ఈ విషయాన్ని వెల్లడించింది. ఇక జిల్లాల వారీగా నియమించాల్సిన సమాచార కమిటీల అడ్రస్‌లు లేవు. జిల్లా స్థాయిలో ఇప్పటిదాకా కమిటీలనే ఏర్పాటు చేయలేదు. ఔటర్ రింగ్ రోడ్డును ప్రైవేటుకు లీజుకు ఇస్తూ ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పంద వివరాలు ఇవ్వాలంటూ పీసీసీ అధ్యక్షుడు, ఎంపీ రేవంత్‌రెడ్డి హెచ్‌ఎండీఏకు సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేసినా అధికారులు సమాధానం ఇవ్వలేదు. ఒక ఎంపీ కోరితేనే సమాచారం ఇవ్వలేదంటే.. సాధారణ పౌరుల పరిస్థితేంటో, రాష్ట్రంలో సమాచార హక్కు చట్టం అమలు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. వాస్తవానికి సమాచార హక్కు చట్టం-2005 ప్రకారం పౌరులు కోరిన ఏ సమాచారం అయినా వెంటనే అందించాల్సిన బాధ్యత ప్రభుత్వ అధికారులపై ఉంది.

సమాచార హక్కు చట్టం అమలు చేయడం కోసం ప్రతి కార్యాలయంలో ఓ వ్యవస్థను ఏర్పాటు చేస్తూ నిర్ణయాలు, నియామకాలు జరిగాయి. గ్రామ పంచాయతీ, తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయం, కలెక్టరేట్, రాష్ట్ర సచివాలయం, అసెంబ్లీ.. ఇలా గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ఉన్నతాధికారి ప్రజా సమాచార అధికారిగా వ్యవహరిస్తారు. ఉదాహరణకు.. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ప్రజా సమాచార అధికారి-పీఐవోగా ఉంటారు. సమాచార హక్కు చట్టం ప్రకారం ఎవరైనా సమాచారం కోరితే సకాలంలో దానిని ఇవ్వాల్సిన బాధ్యత పీఐవోదేనని చట్టం స్పష్టం చేస్తోంది. ఒకవేళ నిరాకరిస్తే సహేతుకమైన కారణం తెలపాల్సి ఉంటుంది. ఉద్దేశపూర్వకంగా సమాచారం ఇవ్వకుంటే ఆ అధికారి బాధ్యత వహించాల్సి ఉంటుంది.

ప్రభుత్వం దీనిని ఉద్దేశపూర్వకంగానే నీరుగారుస్తోందన్న ఆరోపణలున్నాయి. ఈ చట్టంతో గతంలో ప్రజలు అనేక అవినీతి వ్యవహారాలను వెలుగులోకి తెచ్చారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు అనేక అవినీతి అక్రమాలను బయటపెట్టారు. అందుకే, ఈ చట్టం అమలుకు రాష్ట్ర ప్రభుత్వం అడ్డుపడుతోందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రం ఏర్పాటైన తర్వాత రెండేళ్ల వరకు సమాచార కమిషనర్లనే ఎంపిక చేయలేదు. హైకోర్టు జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. ఉన్నత న్యాయస్థానం ఆదేశాలతో సమాచార కమిషనర్లను నియమించినా.. చట్టం అమలుకు ఆరుగురు కమిషనర్లు చేసిందంటూ ఏమీ లేదు. ఈ చట్టం ప్రకారం ప్రజలు సమాచారం కోరినా వెంటనే ఇవ్వకూడదని, రాష్ట్రస్థాయిలో సంబంధిత శాఖ కార్యదర్శి అనుమతి తీసుకోవాలంటూ గతేడాది అప్పటి సీఎస్ సోమేశ్‌కుమార్ ఇచ్చిన ఉత్తర్వులు వివాదాస్పదమయ్యాయి. హైకోర్టుతోపాటు పౌర సంఘాల ఒత్తిడితో ప్రభుత్వం ఆ ఆదేశాలను ఉపసంహరించుకున్నా. చట్టం అమలు కాకుండా.. పరోక్షంగా అడ్డుపడుతూనే ఉందన్న అభిప్రాయాలు న్నాయి.

సమాచార హక్కు చట్టంలో అత్యంత కీలకమైన అంశం, సమాచారాన్ని స్వచ్ఛందంగా వెల్లడించడం. చట్టంలోని సెక్షన్ 4(1)(బి) ప్రకారం ప్రతి ప్రభుత్వ శాఖ తమ వద్ద ఉన్న సమాచారాన్ని అధికారిక వెబ్‌సైట్‌లో బహిరంగపరచాలి. ఉదాహరణకు రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఆసరా పింఛన్లు అందిస్తోంది. రాష్ట్రంలోని మొత్తం లబ్ధిదారుల వివరాలతో కూడిన సమాచారాన్ని జిల్లా, మండలం, గ్రామాల వారీగా సంబంధిత గ్రామీణాభివృద్ధి శాఖ తన అధికారిక వెబ్‌సైట్‌లో అంద బాటులో ఉంచాలి. కొత్తగా మంజూరు చేస్తే వారి వివరాలనూ ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తూ ఉండాలి. ఇలాగే

సుజాత గోపగోని, 6302164068

అన్ని శాఖలు అమలు చేస్తున్న పథకాల లబ్ధిదారుల వివరాలను స్వచ్ఛందంగా ప్రకటించాలి. తమ పరిధిలో అమలులో ఉన్న సంక్షేమ పథకాల వివరాలు, దరఖాస్తు చేసుకునే విధానం, ఎంపిక ప్రక్రియ లాంటి వివరాలను కూడా శాఖలు తెలపాలి. కానీ, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం నుంచి రాష్ట్రంలో ఒక్క ప్రభుత్వ శాఖ కూడా దీనిని అమలు చేయడంలేదు. ఈ విషయాన్ని సాక్షాత్తూ రాష్ట్ర సమాచార కమిషన్ ప్రకటించింది. సచివాలయం మొదలుకొని జిల్లా, మండల స్థాయిలోని 8వేల 924 ప్రభుత్వ కార్యాలయాల్లో సెక్షన్ 4(1)(బి) అమలు కావడం లేదని కమిషన్ తన వెబ్‌సైట్‌లో పేర్కొంది. కమిషన్‌లో ఆరుగురు కమిషనర్లు తమ మూడేళ్ల పదవీకాలాన్ని పూర్తిచేసుకున్నా సెక్షన్ 4(1)(బి) అమలును పట్టించుకోలేదంటే వారి పనితీరును కూడా అర్థం చేసుకోవచ్చు.

జిల్లాస్థాయిలో సమాచార హక్కు చట్టం పటిష్ఠంగా అమలు చేసేందుకు కమిటీలను కలెక్టర్‌లు చైర్మన్‌లుగా ఏర్పాటు చేయాల్సి ఉంది. ఈ చట్టం అమలుకు కృషి చేస్తున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను సభ్యులుగా ఎంపిక చేయాలి. చట్టం అమలుపై కలెక్టర్లు మూడు నెలలకోసారి కమిటీ సభ్యులతో కలిసి సమావేశం నిర్వహించాలి. ప్రభుత్వ శాఖల్లో పెండింగ్‌లో ఉన్న ఆర్టీఐ దరఖాస్తుల వివరాలను సమీక్షించాలి. దరఖాస్తుదారులు కోరిన సమాచారాన్ని గరిష్ఠంగా 30 రోజుల్లో అందించేలా అన్ని శాఖలను ఆదేశించాలి. జాప్యం చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించవచ్చు. అయితే రాష్ట్రంలో ఏ జిల్లాలోనూ కమిటీలు లేవు. జిల్లాల్లో ఆర్టీఐ అమలును కలెక్టర్లు పట్టించు కోవడం లేదు. రాష్ట్రస్థాయిలో సమాచార కమిషన్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. దీంతో గరిష్ఠంగా 30 రోజుల్లో అందాల్సిన సమాచారం కోసం పౌరులు ఏళ్ల పాటు నిరీక్షించాల్సిన దుస్థితి నెలకొంది. చివరికి రాష్ట్ర సమాచార కమిషన్‌ను ఆశ్రయించినా న్యాయం దక్కడంలేదు. గత కమిషన్లు సకాలంలో సమాచారం ఇవ్వని అధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకున్నాయి. భారీ జరిమానాలు విధించాయి. దీంతో అధికారులు వెంటనే సమాచారం అందించేవారు. తెలంగాణ ఆవిర్భావం అనంతరం ఏర్పడిన రాష్ట్ర సమాచార కమిషన్ మాత్రం అధికారులపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ప్రభుత్వ శాఖలు ఆర్టీఐ దరఖాస్తులను బుట్టదాఖలు చేస్తున్నాయి.

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్



జాబిల్లికి మరింత చేరువగా చంద్రయాన్-3

చంద్రునిపై పరిశోధనలకుగానూ భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ప్రతిష్టాత్మకంగా ప్రయోగించిన చంద్రయాన్-3 ఈ ఆగస్ట్ 13వ తేదీతో నెల రోజులు పూర్తి చేసుకుంది.

ప్రస్తుతం చంద్రుడి చుట్టూ చక్కర్లు కొడుతోన్న ఈ వ్యోమనౌక.. ఆ రోజున జాబిల్లికి మరింత చేరువైంది. ఈ సందర్భంగా చంద్రయాన్-3 కక్ష్య తగ్గింపు విన్యాసాన్ని (Orbit Reduction Maneuver) విజయవంతంగా నిర్వహించినట్లు ఇస్రో ప్రకటించింది. బెంగళూరులోని 'ఇస్రో టెలీమెట్రీ, ట్రాకింగ్ అండ్ కమాండ్ నెట్‌వర్క్ (ISTRAC) నుంచి ఈ ప్రక్రియ చేపట్టినట్లు వెల్లడించింది.

చంద్రుడి చుట్టు చక్కర్లు కొట్టే విషయంలో చంద్రయాన్-3కి ఇది రెండో చివరి కక్ష్య. ఆగస్ట్ 13 నాటి విన్యాసంతో వ్యోమనౌక కక్ష్యను 150 కి.మీ X 177 కి.మీలకు తగ్గించినట్లు ఇస్రో తెలిపింది. తదుపరి కక్ష్య తగ్గింపు విన్యాసాన్ని ఆగస్టు 16న ఉదయం 8.30కు చేపట్టినట్లు పేర్కొంది. దీంతో ఈ అంతరిక్ష నౌక.. చంద్రుడిపై 100 కిలోమీటర్ల ఎత్తున ఉన్న కక్ష్యలోకి చేరింది. ఆ తర్వాత ప్రొపల్షన్ మాడ్యూల్ నుంచి ల్యాండింగ్ మాడ్యూల్ విడిపోతుంది. అంతా సజావుగా సాగితే ఈ ఆగస్ట్ 23 సాయంత్రం ల్యాండర్ చంద్రుడిపై అడుగు పెట్టనుంది. కాగా 'చంద్రయాన్-3'ని జులై 14న ఎల్‌వీఎం3-ఎం4 రాకెట్ ద్వారా విజయవంతంగా భూకక్ష్యలో ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. ★

రెచ్చిపోతున్న ఖలిస్తాన్ వాదులు!

కెనడాలో ఖలిస్తాన్ తీవ్రవాదులు రోజురోజుకి రెచ్చిపోతున్నారు. ఆగస్ట్ 13న కెనడాలో పురాతన లక్ష్మీనారాయణ ఆలయంలో విధ్వంసం సృష్టించారు. ఖలిస్తానీ రెఫరండ పోస్టర్లను అక్కడి ఆలయం గోడలకు అతికించారు. దానిపై జూన్ 18 నాటి హత్య ఘటనలో భారత్ పాత్రపై కెనడా దర్యాప్తు చేస్తుంది' అని ఉంది. ఇటీవల మరణించిన ఖలిస్తానీ నేత హర్‌దీప్ సింగ్ సజ్జర్ చిత్రాలు కూడా ఆ పోస్టర్లపై ఉన్నాయి. కెనడాలోని సుర్రేలో గురునానక్ సిక్కు గురుద్వారా సాహెబ్ వద్ద నిజ్జర్‌ను జూన్ 18న ఇద్దరు వ్యక్తులు కాల్చి చంపిన విషయం తెలిసిందే. ★

దారి మళ్లించిన ఆర్థిక సంఘం పంచాయతీ నిధులను తిరిగి వాటి ఖాతాలో జమ చేయాలని కోరుతూ, ఆంధ్రప్రదేశ్ సర్పంచులు చేస్తున్న ఆందోళనకు బిజేపీ మద్దతు ప్రకటించింది. ఆగస్టు 11న రాష్ట్రంలోని 26 జిల్లాల కలెక్టరేట్ల వద్ద నర్పంచులు జరిపిన ఆందోళన కార్యక్రమాల్లో బిజేపీ తమ మిత్రపక్షం జనసేన శ్రేణులతో పాల్గొంది. బిజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ప్రకాశం జిల్లా ఒంగోలు కలెక్టరేట్ వద్ద, కేంద్ర మాజీ మంత్రి సుజనా చౌదరి విజయవాడలో, మాజీ మంత్రి ఆదినారాయణరెడ్డి కడపలో, బిజేపీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్ విశాఖలో, ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి, మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేశ్, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై.వి.బి. రాజేంద్రప్రసాద్(టీడీపీ), పోతిన మహేశ్(జనసేన) తదితర నేతలు ఆయా ప్రాంతాలలో నిరసన కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

నిధుల మళ్లింపు...

గ్రామ స్వరాజ్య స్థాపన కోసం రాజ్యాంగ బద్ధంగా ప్రజలు ఎన్నుకున్న సర్పంచుల హక్కులను వైసీపీ ప్రభుత్వం కాలరాయటమే కాకుండా వారి విధులకు భంగం కలిగేలా వైసీపీ ప్రభుత్వం వ్యవహరిస్తోందని దగ్గుబాటి పురందేశ్వరి ఆరోపించారు. పల్లె ప్రగతి కోసం కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను రాష్ట్రప్రభుత్వం దారి మళ్లించి గ్రామాల అభివృద్ధిని ఆటంకపరుస్తోందని విమర్శించారు. ఈ మూడేళ్లలో కేంద్రం ఇచ్చిన సుమారు రూ. 8,664 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించిందన్నారు. గ్రామాలభివృద్ధి కోసం కేంద్రం నేరుగా సర్పంచుల ఖాతాలలో జమచేసిన నిధులను పీడీ అకౌంట్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం వేరే పథకాలకు నిధులను కేటాయించడం సిగ్గుచేటు అన్నారు. చేసిన పనులకు బిల్లులు రాక కొందరు సర్పంచ్‌లు, తమకు జరుగుతున్న అవమానాలు తట్టుకోలేక మరికొందరు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాల్సి ఉందన్నారు. తక్షణమే సర్పంచులకు మంజూరు చేసిన నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ఖాళీ ఖజానాలతో పంచాయతీలు

గ్రామ పంచాయతీలను నిధుల కొరత వేధిస్తోంది. ఎన్నో హామీలిచ్చి ఎన్నికైన సర్పంచ్‌లు ఖాళీ ఖజానాను చూసి ఉసూరు మంటున్నారు. 80 శాతానికి పైగా పంచాయతీలను వైసీపీ కైవసం చేసుకుంది. ఇప్పుడు వారే పంచాయతీల పట్ల రాష్ట్ర ప్రభుత్వం చూపుతున్న వివక్షకు తలలు పట్టుకుంటు న్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆరుగొలను సర్పంచ్ పీతల బుచ్చిబాబు తప్పు చేసినట్లు భావిస్తూ చెప్పుతో కొట్టుకున్నారు.

పంచాయతీలకు సొంత నిధులు చాలా స్వల్పంగా ఉంటాయి. గ్రామంలో వసూలు చేసే ఆస్తిపన్ను, కుళాయిపన్ను, షాపుల అద్దె రూపంలో వచ్చే ఆదాయంతో పాటుగా చెరువులు, ఇతర ఆదాయ వనరుల నుంచి లభించే మొత్తం స్వల్పంగానే ఉంటుంది. కొన్ని మేజర్ పంచాయతీలు మినహా 70 శాతం ఉన్న మైనర్ పంచాయతీలు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు నుంచి వచ్చే నిధుల మీదనే ఆధార పడతాయి. ప్రతి పంచాయతీకి ఆర్థిక సంఘ నిధులు జనాభా ప్రాతిపదికన వస్తుంటాయి. ఆర్థిక సంఘం ద్వారా వచ్చే నిధులపై సర్పంచ్, కార్యదర్శి ఇతర అధికారులకు అవగాహన ఉంటుంది. ఆ నిధులతో ఇతర వనరులు అనుసంధానం చేసి అభివృద్ధి ప్రణాళికలను రూపొందించుకుంటారు. అందులో తలసరి గ్రాంటు, వృత్తిపన్ను, సీనరేజి నిధులు, గ్రామంలో జరిగే ఆస్తుల క్రయ విక్రయాలపై రిజిస్ట్రేషన్ ఫీజుల ద్వారా లభించే ఆదాయంలో వాటా వంటివి పంచాయతీలకు దక్కుతాయి. ప్రస్తుతం ఏడాదికి తలసరి ఏడాదికి రూ. 4 చొప్పున రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీలకు గ్రాంటుగా ఇస్తోంది. అంటే 3వేల జనాభా ఉన్న గ్రామానికి ఏడాదికి దాదాపు రూ. 12 వేలు గ్రాంటు వస్తుంది. ఇక సీనరేజి సహా వివిధ వాటాల బదలాయింపులో కూడా రాష్ట్ర ప్రభుత్వాలు ఇష్టారీతిన వ్యవహరిస్తూ ఉండడం చాలా కాలంగా వస్తోంది. దాంతో పంచాయతీలు ఉపాధి హామీ నిధులతో సిమెంట్ రోడ్లు వేయించుకోవడం, నీరు-మట్టి వంటి పథకాల్లో భాగంగా చెరువులు తవ్వించడం వంటి పనులకే పరిమితమయ్యాయి. సొంత నిధులు సరిపోకపోవడంతో ఆర్థిక సంఘాల పేరుతో వచ్చే నిధుల కోసం ఎదురుచూస్తూ ఉంటాయి. పంచాయతీ నిధుల్లో పారిశుద్ధ్యం, రోడ్లు, డ్రెయిన్ల నిర్వహణకు 40 శాతం వరకూ ఖర్చవు తాయి. సిబ్బంది వేతనాలకు మరో 30 శాతం ఖర్చయిపోతాయి. వీధిదీపాలు, తాగునీటి అవసరా లకు 30 శాతం వరకూ వెచ్చించాల్సి ఉంటుంది. దాంతో అభివృద్ధి పనులకు ఆస్కారం కలగడం లేదన్నది పంచాయతీ పాలకవర్గాల అభిప్రాయం. అయితే వైసీపీ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి పంచాయతీలకు నిధులు ఇవ్వకపోగా, వాటికి కేంద్రం నుంచి వచ్చే నిధులను దారి మళ్లిస్తూ రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరిస్తోందని సర్పంచులు ఆరోపిస్తు న్నారు. 14వ ఆర్థిక సంఘం నిధులు పంచాయతీ ఖాతాల్లో జమ అయిన వెంటనే సర్పంచ్‌ల చెక్ పవర్‌ను రద్దుచేసి, ఆ నిధులను ప్రభుత్వం తన ఖాతాలో బదలాయించుకున్న తర్వాత మళ్లీ ఇప్పుడు పంచాయతీ సర్పంచ్‌లకు చెక్‌పవర్‌ను ఇచ్చిందం టున్నారు. ఆర్దిక సంఘం విడుదల చేసిన నిధులను పంచాయతీల అభివృద్ధికి కేటాయించ కుండా సర్పంచుల వత్తిడి ఫలితంగా విద్యుత్ బిల్లులకు జమచేసుకున్నారు. గతంలో రాష్ట్ర ప్రభుత్వాలే విద్యుత్ బిల్లులు చెల్లించేవంటున్నారు. మూడేళ్లుగా కేంద్రం నుంచి వచ్చిన రూ. 8,664 కోట్లను జమచేసు కోవడంతో పంచాయతీలు తీవ్ర ఆర్థిక సమస్యలతో కూరుకుపోయినట్లు ఆక్షేపిస్తున్నారు.

పంచాయతీ వ్యవస్థ అదుపే లక్ష్యంగా

వైసీపీ అధికారంలో వచ్చినప్పటి నుంచి అన్ని వ్యవస్థలను అదుపులోకి తీసుకునే ప్రయత్నం చేసింది. రాజ్యాంగ బద్ధంగా హక్కులున్న సంస్థలను నిస్తేజం చేసింది. అందులో పంచాయతీ వ్యవస్థ కూడా ఒకటి. ఆంధ్రప్రదేశ్‌లో గ్రామ పంచాయతీ ఎన్నికల్లో జరిగిన

వేల్లూరు జయప్రకాష్ నారాయణ
ఛైర్మన్,సెంట్రల్ లేబర్ వెల్ఫేర్ బోర్డు,
కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వశాఖ

కష్టాల్లో పంచాయతీలు

రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీ పెత్తనం, ఆ పార్టీ నేతల మాటే పంచాయతీలలో చెల్లుబాటు అవుతోంది. పథకాలు అమలు పేరుతో ఓట్లు వేయించుకున్నారు. అక్కడక్కడ ఏకగ్రీవాల కోసం పంచాయతీలలో వేలం పాటలు జరిగాయి. ఊరికి ఏదొక పనిచేయిస్తానని లేదంటే ఫలానా సంఘానికి ఏదో ఇస్తానని ఇలా ఎవరు ఎక్కువ ఇస్తే వారికే పదవి కట్టబెట్టే రీతిలో వేలంపాటు సాగాయి. ఎవరు ఎక్కువ వెచ్చిస్తే వారికే పంచాయతీ పదవులు కట్టబెట్టడం కొన్ని పంచాయతీల్లో జరిగింది.

అక్రమాలు, దారుణాలపై దేశం మొత్తంలో చర్చ జరిగింది. 2019లో జరగాల్సిన ఎన్నికలు కరోనా కారణంగా వాయిదా పడ్డాయి. ఆ వాయిదా వివాదంగా మారింది. రాష్ట్ర ప్రభుత్వానికి, ఎన్నికల సంఘానికి మధ్య చిచ్చుగా మారింది. చివరకు సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పుతో 2021లో ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైంది. ఎన్నికల సంఘంతో ప్రభుత్వ యంత్రాంగం పూర్తిగా విభేదించింది. ఉద్యోగ సంఘాలతో పాటుగా జిల్లా కల్లెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులు సహాయ నిరాకరణను ప్రకటించారు. ఎన్నికల ప్రక్రియలో భాగంగా రమేష్‌కుమార్ ఏర్పాటుచేసిన వీడియో కాన్ఫరెన్స్‌కు జిల్లా కల్లెక్టర్లు సహా అధికారులు ఎవరూ హాజరు కాలేదు. చివరకు 4 విడతల్లో పోలింగ్ జరిగింది.

నోరెత్తని వారి కోసం ప్రయత్నాలు

స్థానిక సంస్థల్లో ఎన్నికయ్యే ప్రజాప్రతినిధులు పార్టీలకు అతీతంగా ఉంటారు. సర్పంచులు తమకు అనుకూలురు కాకుంటే సమస్య రావచ్చని వైసీపీ భావించింది. పంచాయతీల్లో తన మాటను వినే వారిని, తమ అదుపు ఆజ్ఞల్లో ఉండేవారి కోసం ఏకగ్రీవాల పేరుతో కొందరు నాయకులను సర్పంచులను చేసింది. సర్పంచ్‌లుగా తమ వారి గెలుపు కోసం ప్రభుత్వం అధికారాన్ని అడ్డుపెట్టుకుని అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి. సావ దానభేద దండోపాయాలు ప్రయోగించి సాధ్యమైన మేరకు ఏకగ్రీవాలు చేసింది. 80 నుంచి 90 శాతం గ్రామ పంచాయతీలలో అధికార వైసీపీ బలపరిచిన అభ్యర్థులు గెలిచారని ప్రచారం జరిగింది. వాస్తవంగా పంచాయతీ ఎన్నికలు ఏక పక్షంగా, ప్రజాస్వామ్య విరుద్ధంగా జరిగినట్లు విపక్షాలు ఆరోపించాయి. రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం, పోలీసు వ్యవస్థ పనిచేసిన తీరు తీవ్ర అభ్యంతకరంగా ఉంది. ఎన్నికల్లో పోలీసు, రెవెన్యూ, పంచాయతీరాజ్‌శాఖ అధికారులు, ఉద్యోగులు ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు ఎదుర్కొన్నారు.

పథకాలు - కార్యక్రమాల కోసం ఓట్లు

రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీ పెత్తనం, ఆ పార్టీ నేతల మాటే పంచాయతీలలో చెల్లుబాటు అవుతోంది. పథకాలు అమలుపేరుతో ఓట్లు వేయించుకున్నారు. అక్కడక్కడ ఏకగ్రీవాల కోసం పంచాయతీలలో వేలంపాటలు జరిగాయి. ఊరికి ఏదొక పనిచేయిస్తానని లేదంటే ఫలానా సంఘానికి ఏదో ఇస్తానని ఇలా ఎవరు ఎక్కువ ఇస్తే వారికే పదవి కట్టబెట్టే రీతిలో వేలంపాటు సాగాయి. ఎవరు ఎక్కువ వెచ్చిస్తే వారికే పంచాయతీ పదవులు కట్టబెట్టడం కొన్ని పంచాయతీల్లో జరిగింది.

ఏకగ్రీవంగా ఎన్నికైన పంచాయతీలకు భారీ నజరానా ప్రకటించినప్పటికీ వాటిని విడుదల చేసుకునేందుకు పలు ప్రయత్నాలు చేయాల్సి వచ్చింది. కొందరు సర్పంచులు ఆర్థిక సంఘం నిధులు వస్తాయనే భరోసాతో తమ చేతి డబ్బుతో కొందరు, అప్పులు చేసి కొందరు కొన్ని పనులు చేయించారు. పంచాయతీల సొమ్మును ప్రభుత్వం లాగేసుకోవడంతో వారు ఖిన్నులౌతున్నారు. కొందరు అప్పులపాలైపోయారు. పారిశుధ్యం, మంచినీరు, వీధిలైట్లు, రోడ్లు , వీధి లైట్లు వంటి గ్రామ సమస్యలు పరిష్కరించలేక సర్పంచులు గ్రామస్తులకు ముఖం చూపించ లేకపోతున్నారు.

రాజ్యాంగానికి విరుద్ధంగా

వైసీపీ ప్రభుత్వం గ్రామ సచివాలయాల ఏర్పాటుతో పాలనా వ్యవస్థ అందుబాటులోకి వచ్చింది. అయితే, ఇది ప్రజలు ఎన్నుకున్న గ్రామ పంచాయతీలకు పోటీగా లేదా వాటి హక్కులను, అధికారాలను హరించే విధంగా ఉంది. వాలంటీర్ల వ్యవస్థతో సంక్షేమం మొత్తం నడిపిస్తోంది. గ్రామ పాలన గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలోనే జరగాలని, కేంద్ర ప్రభుత్వం 12, 13 రాజ్యాంగ సవరణలను తెచ్చింది. కాని వైసీపీ ప్రభుత్వం అందుకు విరుద్ధంగా గ్రామ పంచాయతీల హక్కులను హరించేందుకు జీవో నెంబరు 2ను జారీ చేసి, హైకోర్టు తీర్పుతో భంగ పడింది. పంచాయతీల ఆధ్వర్యంలోనే గ్రామ సచివాలయాల పాలనంటూ మొదట జాబ్‌చార్ట్ రూపొందించి. దానికి భిన్నంగా పంచాయతీలు వేరు, గ్రామ సచివాలయాలు వేరన్న రీతిలో వీఆర్వోలను ప్రభుత్వం డీడీవోలుగా చేసింది. వీఆర్వోల పెత్తనం కొనసాగిస్తే పంచాయతీరాజ్ వ్యవస్థ నిర్వీర్యమై పోతుందని అభిప్రాయపడిన హైకోర్టు,గ్రామ కార్యాలయాల కార్యదర్శులపై వీఆర్వోల పెత్తనం వీలుకాదంటూ జీవో నంబర్ 2ని రద్దు చేసింది. మరోవంక, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వాలంటీర్ల పెత్తనంతో తమకు విలువ లేకుండా పోయిందని సర్పంచులు ఆక్రోశిస్తున్నారు.

సమాజ అభివృద్ధిలో గ్రామాల భాగస్వామ్యం, స్థానిక సంస్థల ప్రాధాన్యం అత్యంత ప్రధానమైనవి. రాజ్యాంగంలోని 73, 74 సవరణలు స్థానిక సంస్థల స్వావలంబనకు పట్టం కట్టాయి. పలు ప్రభుత్వాలు స్థానిక సంస్థలను కబ్జా చేయాలని ప్రయత్నిస్తూనే ఉన్నాయి. పాలకులు స్వార్థ ప్రయోజనాలకు, సంకుచిత ఆలోచనలకే ప్రాధాన్యం ఇస్తుండటంతో గ్రామస్వరాజ్యం కాగితాలకు, నినాదాలకే పరిమితమైంది. సకాలంలో ఎన్నికలు నిర్వహించక, హక్కులు, అధికారాలు బదిలీ చేయక అంతకు ముందున్న ప్రభుత్వాలు ఇదే బాటన నడిచాయి. పంచాయతీలకు ఇచ్చిన కొద్దిపాటి వనరులు, అధికారాలను కూడా తీసేసుకోవడం బాధాకరం. గ్రామ సచివాలయాలను గ్రామ పంచాయతీలకు జవాబుదారీగా చేయాలి. ప్రజలు ఎన్నుకున్న ప్రతినిధులకు అధికారాలను అప్పగించాలి. నిధులు విడుదల చేయడం ద్వారా తమను తామే పాలించు కునే విధంగా పంచాయతీలను ఎదగనివ్వాలి. ★



విశిష్ట గురువు వశిష్ఠుడు

రామాయణంలో మరో కీలక పాత్ర వశిష్ఠ మహర్షి. మహర్షులందరిలో అత్యంత విశిష్టమైన మహర్షి. త్యాగి, నిష్కామకుడు, స్వతంత్ర ప్రజ్ఞాశాలి.. ఆధ్యాత్మిక, యోగ జ్ఞానాలతో రాజ నీతిని సమన్వయం చేసి ఇక్ష్వాకుల వంశాన్ని ప్రభావితం చేశాడు. గొప్ప రచయితగా, రాజగురువుగా అన్నింటికీ మించి ఇక్ష్వాకుల కులగురువుగా రామచంద్రమూర్తిని న్యాయానికి, ధర్మానికి ప్రతిరూపంగా తీర్చిదిదాడు. బ్రహ్మజ్ఞానంతో యోగమయంగా, తపోమయంగా, జ్ఞానమయంగా జీవించిన మహనీయుడాయన. 'మనిషిలోని వికారాలను సాధ్యమైనన్ని వదిలివేసి, అసాధ్యమైతే అవసరాల మేరకు నియంత్రించి ఆదర్శప్రాయంగా జీవించేవాడే గురువు' అనే వ్యాఖ్యానానికి నిలువెత్తు నిదర్శనం. అయితే శత్రువుల రాకపోకలు, వారి శక్తిసామర్థ్యాలను అంచనా వేయటం, అదుపు చేయటంలో రాజర్షి విశ్వామిత్రుడు తనకంటే ప్రావీణ్యం గలవాడని గుర్తించాడు. అందుకే రామలక్ష్మణులు కొన్ని విద్యలు విశ్వామిత్రుని వద్ద నేర్చుకునేందుకు పరోక్ష కారకుడవుతాడు. అది ఎలాగంటే...

నూనూగు మీసాల వయస్కులైన రామలక్ష్మణులను తన యాగరక్షణ కోసం పంపాలని విశ్వామిత్రుడు దశరథుడిని కోరుతాడు. లేకలేక కలిగిన, అత్యంత సుకుమారులు, అల్లారుముద్దుగా పెంచుకొనే వారిని అరణ్యాలకు పంపడానికి దశరథుడు తటపటాయిస్తాడు. 'అవసరమైతే తాను, బలగాలతో వస్తాను' అని బతిమాలుతాడు. అప్పుడు వశిష్ఠ మహర్షి 'మహారాజా! విశ్వామిత్రుడు శత్రువులను సంహరించగల సమర్థుడే. మీ పిల్లలకు అనుభవంతో ప్రావీణ్యం పెరిగి, భయం తొలగి హితం కలుగుతుంది. నిరభ్యంతరంగా పంపండి' అని ప్రోత్సహిస్తాడు. దీనివల్ల దశరథుని మాట దక్కుతుంది.

హితకరం... విషహరం 'కసివింద'

వర్షాకాలంలో జలుబు, దగ్గు, జ్వరం వంటి సమస్యలు తరచూ వెంటాడుతుంటాయి. వీటితో బాధపడే వారికి నోరంతా చేదుగా, ఏ మాత్రం రుచి లేకుండా ఉంటుంది. దాంతో తినాలనే కోరిక కూడా పోతుంది. ఇలాంటి సమస్యను ఓ ఆకు కూరతో చేసే పచ్చడి పొగొడుతుంది. అదే చెన్నంగి ఆకు.. దీన్నే కసివింద అని కూడా అంటారు. ఈ ఆకులతో పచ్చడి చేసుకుని తింటే..నోటికి రుచి స్తుంది. జ్వరం వచ్చిన వాళ్లకి తిరిగి రుచి తెలిసేలా చేస్తుంది.

అడవి చెన్నంగి లేదా కసివింద చెట్లు రోడ్డు కిరువైపులా పసుపు పచ్చని పూలతో కనిపి స్తుంటాయి. సన్నని పొడవాటి కాయలు నాలుగు అంగుళాల పొడవు కలిగి ఉంటాయి. ఈ చెట్లు వాటంతటవే చెత్తకుప్పలపై మొలుస్తాయి. దీని ఆకులు, కాయలోని గింజలు వేరు భాగం ఎన్నో ఔషధగుణాలు కలిగి ఉన్నాయి. ఇది పిత్త వ్యాధుల్ని, చర్మ వ్యాధులను నయం చేస్తుంది. కఫం పెరగకుండా కాపాడుతుంది. తేలు, సాలెపురుగుల విషాన్ని విరిచేస్తుంది.

దీని ఆకులను శుభ్రంగా కడిగి నీటిలో వేసి ధనియాలు కలిపి మరిగించి చల్లార్చి కషాయం తాగితే మూత్రంలో రక్తం రాకుండా కాపాడుతుంది. మల బద్ధకానికి కూడా ఇది మంచి మందు. దీని ఆకుల కషాయం తాగితే ఊపిరితిత్తుల వ్యాధులు అస్తమా తగ్గిపోతుంది. ఆ ఆకులను ముద్దగా నూరి పుళ్లపై పూస్తే తగ్గిపోతాయి. కసివింద చెట్టు వేరు భాగాన్ని మెత్తగా దంచి పుల్లని మజ్జిగతో కలిపి సోరియాసిస్ ఉన్న వారికి చర్మంపై రాస్తే అది తగ్గు ముఖం పడుతుంది. ఈ ఆకుల రసాన్ని వేడిచేసి చల్లార్చి తాగితే కడుపులోని క్రిములు మలవిసర్జనలో బయటికి వస్తాయి.

జలోదర వ్యాధిలో కడుపంతా ఉబ్బిపోయి బాధ పడుతుంటే, దీని వేరును బాగా నలగ్గొట్టి దాంట్లో నిమ్మరసం కలిపి కడుపుపై, బొడ్డు కింద వరకు రసాన్ని లేపనంగా పూయాలి. మరికొంత వేరు రసాన్ని మజ్జిగలో కలిపి తాగించాలి. ఇలా చేస్తే జలోదర వ్యాధి తగ్గుముఖం పడుతుంది.

తేలు కుట్టినప్పుడు దీని వేరు రసాన్ని తేలు కుట్టిన చోట రుద్దాలి. సాలెపురుగు, కందిరీగ కుట్టినప్పుడు దీని ఆకుల ముద్దను పూయాలి. విష ప్రభావం తగ్గిపోతుంది. దీని గింజలను దోరగా వేయించి పొడిలా చేసుకుని, ఈ పొడిని తగినన్ని పాలలో కండ చక్కెరతో కలిపి తాగుతూ ఉంటే సమస్త మూత్ర

విశ్వామిత్రుని లక్ష్యం నెరవేరుతుంది. రామలక్ష్మణులలో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. ఇది రాజనీతి లక్షణం. కొన్ని గాథలను బట్టి వశిష్ఠ, విశ్వామిత్రులు పరస్పర శత్రువులని అపోహ పడతాం. నిజానికి వారిద్దరూ మిత్రులే. ఒకరి మనసును మరొకరు ఎరిగిన వారు. ఒకరి శక్తి సామర్థ్యాలను, విద్యలను మరొకరు బాగా తెలిసున్నవారు. అందుకే విశ్వామిత్రుని కోరిక మేరకు వశిష్ఠుడు 'యోగవాశిష్ఠం' వేదాంత గ్రంథంరాసి శ్రీరామునికి బోధిస్తాడు. వాస్తు గురించి వివరించాడు. ఒక సందర్భంలో నిండు కొలువులో విశ్వామిత్రుడు 'రాముని సత్యధర్మ పరాక్రమాలు నాకంటే వశిష్ఠునికే ఎక్కువ తెలుసు నని' నిజాయతీగా చెబుతాడు. వశిష్ఠుడు రచించిన వశిష్ఠ కల్పం, తంత్రం, పురాణం, శిక్ష, శ్రద్ధా కల్పం, వశిష్ఠ వ్రతం, వశిష్ఠ హోమం, లింగపురాణం వంటివి యోగవాశిష్ఠంతో ప్రభావితమయ్యాయి.

వశిష్ఠ మహర్షి యజ్ఞాలకు మెచ్చిన ఇంద్రుడు కామధేనువు పుత్రిక అయిన నందిని అనే గోవుని ఇస్తాడు. ఇది కామధేనువులాగే తన యజమానికి కోరినది ఇవ్వగలదు. ఒక సందర్భంలో విశ్వామిత్రుడు తన పరివారంతో వశిష్ఠుని ఆశ్రమానికి విచ్చేయగా వారిని వశిష్ఠుడు సాదరంగా ఆహ్వానించి ఆతిథ్యమిస్తాడు. అత్యంత సాధారణమైన ఆశ్రమ జీవితం గడుపుతున్న వశిష్ఠుడు అంతమందికి రాజోచితమైన విందు ఇవ్వడంతో ఆశ్చర్య చకితుడైన విశ్వామిత్రుడు ఆ ఆశ్రమంలో ఉండే నందిని ద్వారానే అదంతా సాధ్యమైందని తెలుసుకుని, దానిని తనకివ్వమని కోరతాడు. వశిష్ఠుడు అందుకు నిరాకరిస్తాడు. బలవంతంగా తీసుకుపోతా నంటాడు విశ్వామిత్రుడు. 'రాజబలం ముందు నేనెంత. తీసుకు వెళ్లమ్మంటాడు వశిష్ఠుడు. నందిని ప్రతిఘటిస్తుంది. దాంతో విశ్వామిత్రుడు, అతడి సైన్యం వెనుదిరగాల్సి వస్తుంది. కేవలం వశిష్ఠుని మీద పైచేయి సాధించేందుకే విశ్వా మిత్రుడు తపస్సు చేసి రాజర్షి అవుతాడు. అయినా సంతృప్తి చెందక ఆయనతో చేతనే తనను బ్రహ్మర్షి అని పిలిపించుకోవాలని ఉబలాటపడతాడు. జన్మతః రాజైనందువల్ల అతడిలోని అహంకార మమకారాలు చావలేదని గ్రహించిన వశిష్ఠుడు, అతడికి అనేక పరీక్షలు పెట్టి ఆ లక్షణాలన్నీ తొలగాయని తెలుసుకున్న తర్వాతనే విశ్వామిత్రుని బ్రహ్మర్షిగా సంబోధించి సంభావిస్తాడు. దాంతో విశ్వామిత్రుడు అమితా నందపడిపోయి, వశిష్ఠునికి మిత్రుడవుతాడు. 'విశ్వామిత్రుని భుజబలం, వశిష్ఠుని బుద్ధిబలం' రాముని రాజ్యం కళకళలాడేందుకు కారణమ వుతాయి. అందుకే, వశిష్ఠుడు సాధారణ గురువు, పురోహితుడు కాదు, రాజ నీతిజ్ఞుడు. అన్నీ తానై రాజ్యక్షేమం కోసం మార్గదర్శనం చేసిన గురువు. ఆయన రచించిన యోగవాశిష్ఠం భారతీయ తత్త్వశాస్త్రాలకే శిరోమణి వంటిది. వాల్మీకి మునిపుంగవులు శ్రీరామచంద్రునికి ఉపదేశించిన సంవాద రూపక గీత. ఈ గీతకు 'వాసిష్ఠ రామాయణం' అని కూడా నామాంతరం ఉంది.

శ్రీరామచంద్రుడు బాల్యావస్థలో దృశ్య ప్రపంచ అనిత్యతను ఎరిగి భోగ విలాసాల పట్ల పూర్ణ విరక్తి కలిగి కర్తవ్యం తెలియక విషాదగ్రస్తుడై ఉన్నప్పుడు వశిష్ఠ మహాముని ఆయనలో ధైర్యోత్సాహాలు పురిగొలుపుతూ ఈ వశిష్ఠగీతను బోధించాడు. దానివల్ల స్వకార్య దీక్షితుడైన రాముడు, "మునీంద్రా! మీ అనుగ్రహం వల్ల అజ్ఞానమిప్పుడు నశించింది. ఆత్మ స్వరూపం అవగతమైంద"ని పలికాడు. దీనిని బట్టి శ్రీరామచంద్రుడు గురుదేవుల ఉపదేశం వల్ల మనః క్లేశాల నుంచి బయటపడి బ్రహ్మజ్ఞానం పొంది ధర్మాచరణకు కార్యరంగాన దూకాడని తెలుస్తోంది.

ఈ వశిష్ఠ గీత బోధ సుమారు ఇరవై రోజుల పాటు దశరథుని ఆస్థానంలో జరిగింది. అనేక మంది రుషులు, మునీశ్వరులు, జిజ్ఞాసువులు పాల్గొన్నారు.

శ్రీరామచంద్రుడు, వశిష్ఠుడు, విశ్వామిత్రుడు, వాల్మీకి, భృగువు, అంగీరసుడు, పులస్త్యుడు, చ్యవనుడు, ఉద్దాలకుడు తదితర మహనీయులతో ఆ ఆధ్యాత్మిక సభ శోభించింది. రావణ వధానంతరం శ్రీరాముడు పట్టాభిషిక్తుడయ్యేంత వరకు వివిధ సందర్భాలలో వశిష్ఠ మహాముని విశిష్ట పాత్ర కనిపిస్తూనే ఉంటుంది. ★

రోగాలు తగ్గుతాయి. రక్తం కూడా శుద్ధి అవుతుంది. ఈ కాఫీ శరీరానికి మంచి శక్తినిస్తుంది ఉత్తేజాన్ని ఇస్తుంది, అలసటను దూరం చేస్తుంది.

కసివింద చెట్టురసం చేదుగా ఉండి వేడిని కలిగి స్తుంది. వాతాన్ని, విషాన్ని హరించే శక్తి దీనికి ఉంది. గాయాలను,వ్రణాలను, చర్మరోగాలను నయం చేయడంలో ఈ మొక్క ఎంతగానో ఉపయోగ పడుతుంది. దీని ఆకులను వెన్నతో నూరి చచ్చు బడిన శరీర భాగాలపైన ప్రతిరోజూ మర్దనా చేయడం వల్ల అవి పూర్వ స్థితికి చేరుకుం టాయి. ఆకులను, వేరు బెరడును ఎండబెట్టి పొడిలా చేసుకుని నిల్వచేసుకోవాలి. ఈ పొడికి తేనెను కలిపి లేపనంగా రాసుకోవడం వల్ల అనేక రకాల చర్మ వ్యాధులు, గాయాలు, వ్రణాలు తగ్గుతాయి. ★

❋ తాత్వి'కత' ❋

అసలైన ఆనందం

త్యాగంలోనే శాశ్వతానందం ఉందని, సర్వ జనుల హితంలోనే నిజమైన సౌఖ్యం ఉందని స్వర్గ సుఖాలను సైతం త్యజించిన భారతంలోని ముద్గలుడి వృత్తాంతం చెబుతోంది. ముద్గలుడు పండించిన ధాన్యాన్ని పేదలకు,పక్షులకు పంచి మిగిలిన ధాన్యాన్ని తన కుటుంబ పోషణకు ఉపయోగించే వాడు. ఆయన త్యాగనిరతిని మెచ్చి దేవతలు ఆయనను స్వర్గానికి తీసుకు వెళతారు. అక్కడికి వెళ్లిన తరువాత తాను చేయవలసిన కార్యమేమిటో చెప్పాలని దేవతల్ని అడిగాడు 'స్వర్గ సుఖాలను అనుభవించు, హాయిగా జీవించు' అని చెప్పారు దేవతలు.

అది విన్న ముద్గలుడు 'ఇక్కడ సుఖాలను అనుభవిస్తూ సోమరిగా ఉండటం కన్నా, కష్టించి పనిచేస్తూ నలుగురికి సాయం చేయడంలోనే ఆనందం ఉంది. ఈ స్వర్గంకన్నా నా భారతావనే మిన్న' అని చెప్పి తన మాతృభూమికి వెనుతిరిగాడు. త్యాగం అంటే అదే మరి. ★

అఖిలకి అక్క దగ్గరకు వెళ్లాలనిపించింది. తన మనసులోని బాధను ఎవరో ఒకరితో పంచుకోవాలి. అఖిల, స్వప్న బాగుంటారు. ఒకరి సమస్యల గురించి ఇంకొరు చెప్పుకుంటారు.

ముందు ఆద్య ధిక్కారాన్ని అఖిల అసలు భరించలేకపోతోంది. ఆదర్శ్ ఆద్యని 'నువ్వు జైపూర్ వెళ్లవద్దు' అని ఖచ్చితంగా చెప్పి ఉంటే బాగుండేది. అప్పుడూ గొడవ జరుగుతుంది. జరగనీ... అప్పుడే తేలిపోయేది. ఇంట్లో నుంచి వెళ్లిపోతాను అంటుంది. అననీ...

ఎంతకాలం బెదిరిస్తుంది. ఇవన్నీ మా కోసం మేం చేసుకుంటున్నామా? ఆ మాత్రం జ్ఞానం లేకుండా ఉందా? ఎన్ని రోజుల నుండి మనసులో కుళ్లి పోతుందో... ఇప్పుడు బయటపడింది. ముందు ఆద్యని కంట్రోల్ చేయాలి. లేకపోతే తనింకా రెచ్చిపోతుంది అనుకుంది.

అప్పుడు స్వప్నకి ఫోన్ చేసింది.

"అఖిలా! మనం మాట్లాడుకుని చాలా రోజులు అయినట్లుంది. నాకు కూడా తీరిక ఉండటం లేదు. ఏంటి విశేషాలు?"

"చాలా వున్నాయి. నేను నీ దగ్గరకు రావాలను కున్నాను".

"రావల్సింది. ఇప్పుడైనా ఫ్లైట్‌లో గంటలో రావచ్చు. మళ్లీ రాత్రికి వెళ్లిపోవచ్చు. అంత సీరియస్ కండిషనా? ఆద్య ఎలా వుంది?"

"జైపూర్ వెళ్లింది".

"కాలేజ్ వారు తీసుకువెళ్లారా?"

"తనే వెళ్లింది. అక్కడ లిటరరీ ఫెస్టివల్ జరుగుతోంది".

"ఆద్యకి లిటరేచర్ మీద ఇంట్రెస్టుందా!"

"ఈ మధ్య ఎం.ఎ. లిటరేచర్ చేస్తాను అంది".

స్వప్న మాట్లాడలేదు.

"శ్వేత ఎలా ఉందక్కా?"

"తన సంగతి నీకు తెలియందేముంది. ఈ సారి చాలా పట్టుదలగా ఉంది, ఐఏఎస్ సాధించి తీరాలని..."

"శ్వేతకి లిటరేచర్ అంటే ఇష్టమా!"

"అందులో లిటరేచర్ కూడా ఓ సబ్జెక్ట్. అంతకు మించి ప్రత్యేకంగా ఇష్టం ఉందని నాకు తెలియదు"

"ఆద్య బిహేవియర్ నాకు నచ్చటం లేదక్కా".

"ఎవరినన్నా లవ్ చేసిందా? ఇంట్లో గొడవలు జరుగుతున్నాయా?"

"అదింకా తెలియదు. నా అనుమానం అది కూడా ఉండవచ్చు. ఇప్పుడయితే బయటపడటం లేదు. నా పర్సనల్ వ్యవహారాల్లో మీరు జోక్యం చేసుకోవద్దు అంటోంది".

"అంతదాకా వచ్చిందా?"

"అదే కదా నా బాధ".

"తను జైపూర్ నుండి వస్తుంది కదా.... ఏం జరుగుతుందో చూద్దాం. నువ్వు కంగారు పడవద్దు. ముందు ఆద్య మనసులో ఏముందో మనకు తెలియదు. అది తెలుసుకోవాలి. అవసరం అనుకుంటే నేను బయలుదేరి వస్తాను. అలా అని నువ్వు ఆదర్శ్‌తో గొడవలు పడకు. అతని ప్రాబ్లమ్స్ అతనికి ఉంటాయి".

"అలాగే అక్కా... శ్వేతతో నీకు ఇలాంటి సమస్యలు లేవుగా?"

"ప్రస్తుతానికి లేవు. ఇక ముందు రావని చెప్పలేం కదా".

"అక్కాచెల్లెళ్లు మాట్లాడుకుంటున్నారా?"

"తెలియదు. అయినా మాట్లాడుకోకుండా ఎలా ఉంటారు?"

"సరే చూద్దాం. ఇవన్నీ ఇప్పుడే నువ్వు శ్వేతకు చెప్పకు" అంది అఖిల.

"అలాగే శ్రీనివాస్‌కి కూడా చెప్పను" అంది స్వప్న.

* * *

భువనేశ్వరి-ప్రభాత్ ఎదురెదురుగా కూర్చున్నారు.

"ఈ రోజు మీ అమ్మ గారి పుట్టిన రోజు అనుకుంటాను" అన్నాడు ప్రభాత్.

"మీరు బాగానే గుర్తు పెట్టుకున్నారు. నాకే గుర్తు లేదు".

"ఫోన్ చేసి మాట్లాడతావా?"

"నా పుట్టినరోజు ఆ తులసమ్మ గారు ఫోన్ చేయలేదు. ఆవిడకి కూతురు అవసరం లేనప్పుడు నాకు తల్లి అవసరమా?" అంది భువనేశ్వరి.

"మీ ఇంట్లో అందరికీ పట్టుదలలు ఎక్కువ.

ఎండివై రామమూర్తి స్మారక నవలల పోటీలో ద్వితీయ బహుమతి పొందిన రచన

14

అత్తగారు ఎందుకు చేయలేదో తెలియదు. నువ్వు మరిచిపోయినట్లు తను కూడా మరిచిపోయి ఉండవచ్చు కదా" అన్నాడు ప్రభాత్.

"ప్రభాత్ నువ్వు ఏదో మాట్లాడుతున్నావు. అమ్మకి ఇద్దరు మనవరాళ్లు. ఇద్దరు కూతుర్లని ఒకే రకంగా చూడకపోయినా ఫర్వాలేదు. సరయూ-రసజ్ఞలను ఒకే రకంగా చూసిందా... ఎప్పుడూ వసుంధర దగ్గర ఎందుకు ఉండాలి? మన దగ్గరకు రావటం ఇష్టం లేదు. మనవరాలి దగ్గర కూడా కొన్ని నెలలు ఉండవచ్చు కదా".

"ఈ వయసులో..."

"మా అమ్మకు వయసేంటి ప్రభాత్... ఇప్పటికీ డాన్సులేస్తుంది. పాటలు పాడుతుంది".

"ఇదొకటా..."

"సరయూ పుట్టిన రోజు వీడియోని రసజ్ఞ పంపించింది. అప్పుడు తులసి గారి జోష్ చూడాలి. అదే రసజ్ఞ పుట్టిన రోజుకి మాత్రం బ్లెస్సింగ్స్ పంపిస్తుంది. నిన్ను చూడాలని ఉంది అంటుంది. అన్నీ పై పై మాటలు... నిజంగా అమ్మకు చూడాలనున్నా వసుంధర గారు పంపించాలి కదా!"

"అత్తయ్య రావాలనుకుంటే వదినగారు ఆపగలరా?"

"మీ మగవాళ్లకి కొన్ని విషయాలు తెలియవు. మా అమ్మను అక్కడ పంజరంలో పెట్టింది మా అక్క... అమ్మ మనసుని విరిచేసింది. ఆ ఇంటి నుండి కదలనివ్వదు. వసుంధరకి ఒకటే పట్టుదల. తనకంటే భువనేశ్వరి తల ఎప్పుడూ కింద వుండాలి. భువనేశ్వరి కంటే తన ఆస్తి పదికోట్లు ఎక్కువ వుండాలి".

"ఈ కోట్ల లెక్కేంటి భువనా?"

"అంకెలే ఈ ప్రపంచాన్ని నడిపిస్తున్నాయి ప్రభాత్. ఈ సంవత్సరానికి వచ్చే సంవత్సరానికి ప్రపంచ కుబేరుల స్థానాన్ని మార్చేది ఈ అంకెలే. అందుకే అమ్మ పేరన వున్న ఆస్తులు తను రాయించుకోవాలి. అప్పుడు చెల్లి తనకంటే చాలా కింద ఉంటుంది. చిన్నప్పటి నుంచి అదే? దాని కోరిక".

"నువ్వు మీ అక్క కంటే ఓ అడుగు ఎత్తు ఉంటావు" నవ్వుతూ అన్నాడు.

"అది కూడా దానికి బాధే. ఎత్తు పెరగటం దాని చేతిలో లేదు. ఆస్తి పెంచుకోవటం మాత్రం వుంది. అయినా ప్రభాత్... అమ్మ దగ్గరున్న లిక్విడ్ కేష్‌ని వసుంధర వాడుకోవచ్చు. ఇమ్మూవబుల్ ప్రాపర్టీస్ విషయంలో అది కుదరదు. నేను కోర్టుకి వెళ్తాను" అంది సీరియస్‌గా.

"గొప్పవారి కుటుంబాలు చాలా చాలా కోర్టుల మధ్య తిరుగుతున్నాయి" అన్నాడు ప్రభాత్.

* * *

"గ్రాండ్ మా... మెనీ మెనీ హాపీ రిటన్స్ ఆఫ్ ది డే" అని ఫోన్‌లో అరిచినంత పని చేసింది సరయూ...

"నువ్వు నాకు గిఫ్ట్ ఏం ఇస్తున్నావు?"

"నేను నీకు దూరంగా ఉన్నాను తులసీ... అయినా ఏం పంపించమంటావు?"

"తులసీ అంటున్నావేంటి?"

"తులసమ్మా అంటే నువ్వు ఫీల్ అవ్వాలి" నవ్వింది సరయూ...

"నాకో మనవడ్ని కానుకగా ఇవ్వు సరయూ..."

"సారీ... సారీ... ఇప్పుడే మేం పిల్లల్ని కనాలను కోవటం లేదు. ముందు హోటల్ నిర్మాణం పూర్తి కావాలి".

"అది ఎప్పటికి అవుతుంది?"

"మహా అయితే ఆరేడు సంవత్సరాలు. తొందరగా కంప్లీట్ చేయాలన్నా నాలుగు సంవత్సరాలు"

"అప్పటి దాకా పిల్లల్ని కనరా!"

"అమ్మమ్మా... పిల్లల్ని కనటం అంటే పది సంవత్సరాల కెరీర్‌ని పక్కన పెట్టటం. రాహుల్ కూడా వద్దు అంటున్నాడు. నేను నొప్పులు పడుతుంటే తను చూడలేడంట. అందుకని అప్పుడయినా వూంబ్ అద్దెకి తీసుకుంటాడంట" అంది.

"మన బిడ్డని మన కడుపులో పెంచుకోవాలి గాని, ఇంకొకరి కడుపులో పెంచటం ఏమిటి? నా మనవరాలు హెల్దీగా ఉంటుంది. నీకు ఆ కర్మ పట్టలేదు" అంది తులసి.

"పోనీ టెస్ట్ ట్యూబ్ బేబీ... మేం ఓ డిజైనర్ బేబీ కోసం ప్రయత్నం చేస్తాం. హావ్ ఎ నైస్ డే" అని ఫోన్ కట్ చేసింది.

* * *

"మనుషులు పుట్టిన రోజులు ఎందుకు చేసుకుంటారు రిత్విక్" అన్నాడు రామకృష్ణ.

"మనుషులందరూ చేసుకోరు సర్. చాలామందికి ఎప్పుడు పుట్టారో కూడా తెలియదు. మా తాతలు ఎప్పుడు చనిపోయారో కూడా మాకు తెలియదు".

"ఆదిమ మానవులు కూడా అంతే కదా... ఈ ప్రపంచంలో ఎన్ని వేల కోట్ల మంది పుట్టి, చనిపోయారో తెలియదు. ఇవన్నీ మధ్యలో వచ్చాయి. ఇప్పుడు జాతక చక్రాలు రాయిస్తున్నారు గాని ఒకప్పుడు అవేమీ లేవు" అన్నాడాయన సాలోచనగా.

"అవును సర్. అయినా ఇది మంచి సందర్భం.

పి. చంద్రశేఖర ఆజాద్
9246573575

ఓసారి వెనక్కి తిరిగి చూసుకోవటానికి".

"అందుకు పుట్టిన రోజే కావాలా?"

"మనం నిత్యం పరుగుల్లో ఉంటాం. మనకు రోడ్ల పక్కన మైలు రాళ్లు కూడా కనిపిస్తుంటాయి జర్నీ చేస్తున్నప్పుడు. మనం చూడకుండా, వాటిని దాటేస్తాం. అవసరం అయినప్పుడు వాటి కోసం వెతుక్కుంటాం. మీరు పుట్టిన రోజు గురించి అడుగుతున్నారంటే ఏదో విశేషం ఉండుంటుంది సర్" అన్నాడు రిత్విక్.

"నేను మధ్య మధ్యలో ఏదో అడుగుతుంటాను. ఈ రోజు నా పుట్టినరోజు కాదు. అయినా ప్రతి ప్రశ్న వెనక విశేషాలు ఉండకపోవచ్చు కూడా!"

"కావచ్చు".

"ఈ మధ్య కాలంలో ఓ ప్రముఖుడి గురించి నువ్వు చదివి ఉంటావు. కొన్ని డికేడ్స్ కష్టపడి ఓ వ్యాపార సామ్రాజ్యం ఏర్పరిచాడు. నా అంత వయసు ఉం డవచ్చు. అతను పిల్లల్ని నమ్మాడు. ఆస్తులన్నీ వాళ్లకు రాసిచ్చాడు. ఇప్పుడు అతన్ని ఇంటి నుండి కూడా బయటకు పంపించారు".

"చదివాను సర్".

"ప్రేమించటం, పిల్లల్ని నమ్మటం అతని తప్పా?"

"కాదు సర్".

"మనుషుల్లో ఇంత నిర్దాక్షిణ్యం ఎందుకు పెరుగుతోంది?"

"ఒక్క మాటలో చెప్పగలం అంటారా?"

రామకృష్ణ తలవంకించాడు. తర్వాత అన్నాడాయన.

"పెద్దవాళ్ల తదనంతరం ఆస్తులు వస్తాయని తెలుసు. అయినా అప్పటి వరకు ఆగకుండా తల్లిదండ్రుల్ని చంపుతున్న మనుషుల్ని కూడా మనం చూస్తున్నాం. ఇది కేవలం డబ్బులున్న వారికే కాదు. చిన్న చిన్న కుటుంబాల్లో కూడా జరుగుతున్నాయి. అయినా పుట్టిన రోజులు, పెళ్లిళ్లు, దినాలు, రకరకాల పేర్లతో రక్త సంబంధీకులు కలుసుకుంటారు. నవ్వులు, కొగిలింతలు-మనం కృత్రిమంగా బతకటానికి అలవాటు పడిపోయాం. ఇప్పుడు కొత్తదేదో కావాలనుకుంటాను రిత్విక్...."

"పెద్దవాళ్ల తదనంతరం ఆస్తులు వస్తాయని తెలుసు. అయినా అప్పటి వరకు ఆగ కుండా తల్లిదండ్రుల్ని చంపుతున్న మను షుల్ని కూడా మనం చూస్తున్నాం. ఇది కేవలం డబ్బులున్న వారికే కాదు. చిన్న చిన్న కుటుంబాల్లో కూడా జరుగుతు న్నాయి. అయినా పుట్టిన రోజులు, పెళ్లిళ్లు, దినాలు, రకరకాల పేర్లతో రక్త సంబం ధీకులు కలుసుకుంటారు. నవ్వులు, కొగిలింతలు-మనం కృత్రిమంగా బతక టానికి అలవాటు పడిపోయాం. ఇప్పుడు కొత్తదేదో కావాలనుకుంటాను రిత్విక్...."

"అవును సర్".

"మనుషుల్ని కొంతకాలమైనా మానవత్వం గురించి ఆలోచించేలా చేయగలగటం ఎంత బావుంటుంది. అలాంటి వనిని మీ రచయితలే చేయగలగాలి".

"అది మా ఒక్కరి పని మాత్రమే అని నేను అనుకోను సర్" అన్నాడు రిత్విక్.

* * *

తులసి ముందు కేక్ ఉంచింది వసుంధర. అక్కడ రమేష్ వున్నాడు. తమ ప్రాంతం నుండి పిలిపించుకుని, ఎప్పటి నుండో తులసి పనులు చూసుకుంటున్న జయమ్మ వుంది. ఇంకొంత మంది రమేష్‌కి చెందిన ఉద్యోగులు వున్నారు.

"ఏంటి వసుంధరా ఇదంతా... నేను చిన్నపిల్లను అనుకుంటున్నావా?" అంది తులసి.

"నువ్వు ఒప్పుకోవని ఇంట్లోనే ఏర్పాటు చేసాను. రమేష్ గ్రాండ్‌గా సెలబ్రేట్ చేద్దాం అన్నాడు. సరయూ-రాహుల్ ఉంటే ఎంత అల్లరి చేసేవాళ్లో. కేక్ కట్ చేద్దాం అమ్మా" అంది వసుంధర.

ఆమె మాట్లాడకుండా కూతుర్ని చూస్తుంటే...

"పుట్టినరోజులు జరుపుకోవటానికి వయసుతో సంబంధం లేదు".

"ఇంక మిగిలిపోయిన సంవత్సరాలు గుర్తొస్తున్నాయి".

"ఈ సమయంలో ఇలాంటి మాటలు వద్దు" అంది.

అప్పుడు నిర్లిప్తంగా కేక్‌ని కట్ చేసింది. ఎవరో పాడారు పుట్టినరోజు పాటని. అభినందనలు... రమేష్ విష్ చేసాడు. ఆ తతంగం అంతా పూర్తి అయింది. ఆ తర్వాత తులసి ఒంటరిగా లాన్‌లో కూర్చుండిపోయింది.

ఆమెను రకరకాల జ్ఞాపకాలు కదిలిస్తున్నాయి. ఆమె ముఖంలో రకరకాల భావాలు కదులుతున్నాయి. భువనేశ్వరి గుర్తు వచ్చింది.

"ఇప్పుడయినా అమ్మ గుర్తుకి రాలేదా!" అనుకుంది.

అప్పుడు జయమ్మ ఫోన్ తీసుకు వచ్చి యిచ్చింది. ఎవరు అన్నట్లు చూసింది. జయమ్మ మాట్లాడలేదు. "హలో" అంది.

"పుట్టిన రోజు శుభాకాంక్షలు అమ్మమ్మా!"

"రసజ్ఞ" అంది ఉద్వేగంగా.

"నీ ఆరోగ్యం ఎలా ఉంది అమ్మమ్మా..."

"బాగానే ఉంది. నీకు నా పుట్టిన రోజు గుర్తుందా? నువ్వే నయం మీ అమ్మకి అదీ గుర్తు లేదు. గుర్తు లేకుండా ఎలా ఉంటుంది. నువ్వో, ప్రభాతో గుర్తు చేసి ఉంటారు కదా!"

"నేను అమ్మకి ఫోన్ చేయలేదు అమ్మమ్మా..."

"చేసి ఉంటే నిన్ను కూడా ఫోన్ చేయమని చెప్పదు. చేసావని తెలిస్తే నిన్ను కోప్పడుతుందనుకుంటాను".

"మీ ఇద్దరి మధ్య ఏం జరిగింది అమ్మమ్మా?". నిశ్శబ్దం.

"నువ్వు కూడా నాకు చెప్పలేదు అమ్మమ్మా" అంది రసజ్ఞ.

అప్పుడు తులసి ముఖం మ్లానం అయింది.

"అమ్మగాని, నువ్వు గాని, బయటి మనుషుల్తో ఇలానే ఉంటున్నారా? వాళ్లందరితో మీకు ఎలాంటి డిఫరెన్సెస్ లేవా? అలాంటి వారి ఫంక్షన్లకి మీరు వెళ్తారు. ఆనందంగా మాట్లాడతారు. రక్త సంబంధం ఉన్నవారి మధ్య ఇలాంటి పంతాలు అవసరమా! ఎందుకు అమ్మమ్మా ఇవన్నీ... ఏం సాధించాలని?"

"నువ్వు చిన్న పిల్లవి రసజ్ఞా".

"ఇంకానా?"

"పోనీ నేనే చిన్న పిల్లని అనుకో".

"నేను ఎప్పుడూ అంటుంటాను. నీ వయసుని బట్టి చూస్తే బాల్యం మళ్లీ వస్తుంది అంటారు. నువ్వు ఎవర్ గ్రీన్ యంగ్ గాల్‌వి అమ్మమ్మా..."

తులసి నవ్వింది. **(సశేషం)**

కొంటె బొమ్మలతో కొద్దిసేపు

మా కార్టూన్ పోటీలో విజేతలను ప్రకటిస్తున్న శుభ సందర్భంలో

'ఒక చిత్రం వేయి పదాల భావాన్ని వ్యక్తీకరిస్తే, ఒక వ్యంగ్య చిత్రం లక్షల పదాల భావాలను ఆవిష్కరిస్తుంది. అవన్నీ కూడా ఒక రాజకీయ వార్త లేదా పరిణామాన్ని ఒకరికొకరు పరస్పరం ఎలా చేరవేసుకున్నామో చెప్పేవే' అన్నాడు కేట్ ఆండ్రూస్. ఆయన ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎకనమిక్ అఫైర్స్ అనే సంస్థలో సంచాలకుడట. కక్ష కట్టినట్టు రాజకీయ నేతలకి కసితో వాతలు పెట్టినా, రాజకీయ పరిణామాలని రక్తకన్నీరు కార్చేటట్టు వెక్కిరించినా, వైరిపక్షాన్ని ఎంత జడిపిస్తున్నా వ్యంగ్య చిత్రం లేదా పొలిటికల్ కార్టూన్‌కి రాజకీయ జర్నలిజంలో అర్ధ సింహాసనం ఇవ్వాల్సిందేనని యావన్మందీ ఒప్పుకుంటారు. నేతల్లారా! మీ గీత, మీ రాత రెండూ నేనే అంటుంది కార్టూన్. కార్టూనిస్టు చేతి కుంచె కొన్నిచోట్ల కొంటె విన్యాసం చేసినా, ఇంకొన్ని సందర్భాల పాలిట కొరడా అవతారం దాలుస్తుంది. ఏదో నిశ్శబ్ద రాజకీయ పరిణామాన్ని చెప్పే వార్త లేదా విశ్లేషణ అని పైకి అనిపించినవి కూడా వ్యంగ్యచిత్రం తోడైతే పాఠకుడి బుర్రలోని ఆలోచనలు ముల్లుకర్ర తగిలిన



ఎద్దులా చిందులేస్తాయి. ఏదైనా నవ్వింపోయే పరిణామాన్ని లేదా సమాజంలోని ఆ వేయి విధాలైన వెర్రులలో దేనిని వెక్కిరించాలన్నా అందుకు కార్టూనింగే సరైనది. కార్టూన్ అంటే వార్తకు వక్రరేఖల భాష్యం మాత్రమే కాదట. ఆ రేఖల నిండా నీవు పత్రిక చదివిన కాలం నాటి రాజకీయ వాతావరణం రికార్డయి ఉంటుందట. వార్త కాల వాహిని కింద కప్పడుతుందేమో కానీ, ఆ వార్త మీదే వేసినదైనప్పటికీ ఆ కార్టూన్ మాత్రం చప్పబడదట. రాజకీయ వ్యాఖ్యానం నాలుగు కాలాల పాటు వాడివేడిగా ఉంటాలంటే దానికో కార్టూన్ జోడించ మన్నారు కొందరు పెద్దలు. అంటే కార్టూన్ కాలపరీక్షకు నిలిచేదన్నమాట. ఈ లక్షణాలలో వేటినీ విడిచిపెట్టకుండా కేవలం కార్టూన్‌లతోనే ప్రపంచాన్ని అలరించిన, గిలిగింతలు, చెక్కిలిగింతలూ కూడా పెట్టిన రెండు పత్రికలు ఉన్నాయి. అవే 'ది పంచ్', 'శంకర్స్ వీక్లీ'. మొదటిది ఇంగ్లండ్ వాళ్లది. రెండోది భారతీయులది. భారతీయులకి బొత్తిగా హ్యూమరసం గ్రోలే అభిరుచి లేదన్న అపవాదు నుంచి కాపాడేందుకు శంకర్స్ వీక్లీ తన వంతుగా చాలా తంటాలు పడింది కానీ, ఇందిరాగాంధీ బతకనివ్వలేదు పాపం. పంచ్ కూడా 150 ఏళ్లు కాబోలు బతికేసి అది కూడా చనిపోయింది. మొత్తానికి ఈ రెండూ జమిలిగా నిర్ధారించిన వాస్తవం-ప్రపంచం అంటే, ఏనుగు మీద గుడ్డల్లేకుండా ఊరేగిన ఫలానా ఆ రాజు లాంటిదే. నవ్వులపాలు కావడానికి సరేనంటుంది కానీ, షేమ్ షేమ్, నీ వంటి మీద గుడ్డల్లేవు తెలుసా అంటే మాత్రం చచ్చినా ఒప్పదు. అయినా వాటి పని అవి నిర్భీకతతోనే చేశాయి 'పంచ్', శంకర్స్ వీక్లీ'.

వ్యంగ్యానికీ, హాస్యానికీ పెట్టింది పేరుగా ప్రపంచమంతటికీ తెలిసిన పత్రిక 'పంచ్'. 1841లో మొదలయింది. 1992 వరకు ప్రపంచ ప్రజలను నవ్వించింది. ఆగిపోయింది. మళ్లీ 1996లో ప్రచురణ ప్రారంభించారు గాని, 2002లోనే ఆగిపోయింది. ప్రపంచ నేతలకి, ప్రధానంగా బ్రిటిష్ నేతలకి ఏడవలేక నవ్వే పరిస్థితి కల్పించింది. ఇది పూర్తిగా రాజకీయాలనే వేటాడలేదు. సామాజిక న్యాయం కోసం తపన కూడా పడింది. బ్రిటిష్





ప్రథమ బహుమతి పొందిన కార్టూన్

ప్రోత్సాహక బహుమతి

ప్రోత్సాహక బహుమతి

అస్తిత్వాన్ని నిర్మించడంలోనే పంచ్ భాగస్వామి అన్నంత కీర్తి సంపాదించింది. అంత జాత్యహంకారం, అంత నియంతృత్వం ఉండే బ్రిటన్‌లో ఒక కార్టూన్ పత్రిక ఎలా బతికింది? నిజమే, తప్పక రావలసిన ప్రశ్న. బ్రిటిష్ వాళ్లు వలసలని జలియన్‌వాలా బాగ్‌లు జరిపి చంపేస్తారు కానీ, సొంత దేశంలో మాత్రం మదర్ పార్లమెంటుని ఏర్పాటు చేసుకున్నారు. ఎంత నిర్మొహమాటమో ఈ పత్రికకి. మొదటి ప్రపంచ యుద్ధం జరిగింది. అందులో ఇంగ్లండ్‌ది కీలక పాత్ర. ఉన్న సైన్యం చాలలేదు. దేశంలో యువకులందరినీ చేర్చారు. అప్పుడూ చాలలేదు. ఆఖరికి మీసాలు కూడా మొలవని వాళ్లని చేర్చారు. దాని మీద పంచ్ కార్టూన్ పేల్చింది. అలాంటి ఓ కుర్రాడు సైన్యంలో చేరడానికి ఆ కేంద్రానికి వెళతాడు. నీ వయసు ఎంత అని అడుగుతాడు అక్కడి సైనికాధికారి. పద్నాలుగు అని చెబుతాడు కుర్రాడు. అయితే రేపు రా, 16 ఏళ్లు వస్తాయేమో చూద్దాం అంటాడు అధికారి. ఏ విధంగా చూసినా మన దేశాన్ని ప్రపంచం ఇలా చూస్తున్నది సుమా అని ఆ పత్రిక జాతికి గుర్తు చేసింది. ఎంత గొప్ప సేవ! అందుకు అది ఎంచుకున్న మార్గం కార్టూనింగ్.

పంచ్ వెలువరించిన మొత్తం సంచికలు 7,900. దాదాపుగా రెండు లక్షల పేజీలు. తమని వెక్కిరించినా వాటన్నిటిని ఆ దేశం భద్రంగా దాచుకుంది. తెలివైన వెక్కిరింతకు కూడా విలువ ఉంది. పంచ్ చారిత్రక పత్రాల నిధి అని పేరు పెట్టారు. ఇంత శ్రద్ధ ఎందుకు అంటే, 19,20 శతాబ్దాల ఇంగ్లండ్ చరిత్ర అందులో ఉందని వారు సమాధానం చెప్పారు. అలాగే కార్టూన్ కళను ఎలా అభ్యసించాలో ఆ సంచికల నుంచి చాలా నేర్చుకోవచ్చునని కూడా వారంతా ఈనాటికీ నమ్ముతున్నారు. దీనిని ఫ్రెంచ్ వారు నిర్వహించారు.

మొత్తమన్నీ కార్టూన్లే ఉండే ఒక పత్రికను ప్రచురించాలన్న మహత్తరమైన ఆలోచన ఓ ఇద్దరిది. వారే హెన్రీ మేహ్యూ, ఎబినెజర్ లాండెల్స్. ఈ పత్రిక కోసం వారు పెట్టిన పెట్టుబడి 25 పౌండ్లు. లండన్ దీని ప్రధాన కేంద్రం. దీనికి ఇంత పేరు తెచ్చినవాడిగా జాన్ టెన్నీల్‌ను చెప్పవచ్చు. ఇతడే యాభయ్ ఏళ్లు ఆ పత్రిక ప్రధాన కార్టూనిస్టుగా పని చేశాడు. సంపాదకవర్గంలో మేహ్యూతో పాటు మార్క్ లెమన్, జోసెఫ్ స్టిర్లింగ్ కోయేన్ అనే వారు పనిచేశారు. నాటి ప్రముఖ ఆంగ్ల రచయితలు విలియం మేకీపీస్ థాక్రే, థామస్ హుడ్ కూడా ఇందులో పనిచేసినవారే. జాన్ లీచ్, సర్ జాన్ టెన్నీల్ సాధారణ బొమ్మలు కూడా వేసేవారు.

బ్రిటన్‌లో పంచ్ పత్రిక వారసత్వాన్ని చెప్పకుండా మరేదీ చెప్పలేమని అంటారు. నేటి బ్రిటిష్ సామాజిక చరిత్రకారులకు అదే పెద్ద వనరు. 161 ఏళ్ల చరిత్రలో ఎందరో పీజీ ఓడ్‌హౌస్, ఏఏ మిల్నే వంటి వారు రచనలు అందించారు. మధ్య మధ్య ఈ పత్రిక కూడా కష్టాల బారిన పడక తప్పలేదు. పత్రికలో పని చేసే పెద్ద తలకాయలు రాలిపోయినప్పుడు ఇలాంటి లోటుపాట్లు తప్పేవి కావు. అయినా నిలదొక్కుకుని నడిచింది. ఒక కార్టూన్ ఒక కాలపు రాజకీయ, సామాజిక వాతావరణాన్ని మార్చడానికి ఉపయోగపడుతుంది. అది పంచ్ రుజువు చేసింది. ఆ పత్రిక బ్రిటన్ వంటి సమాజాన్ని మార్చింది. తనను చూసి తాను నవ్వుకునే సంస్కారం వారికి అబ్బేటట్టు చేసింది.

స్వతంత్ర భారతదేశానికి స్వాతంత్ర్యం, కాంగ్రెస్ ప్రభుత్వం రెండూ జమిలిగా వచ్చాయన్న ఒక నమ్మకంతో కేశవ శంకర్ పిళ్లై 1948లో శంకర్స్ వీక్లీని స్థాపించారు. కానీ ఇది 1975లోనే ప్రచురణను నిలిపివేసింది. కారణం అత్యవసర పరిస్థితి. దీనిని పంచ్ పత్రికతో పోలుస్తూ ఉండేవారు. ఆ స్థాయి ప్రమాణాలతో పత్రిక నడిచింది. శంకర్

హిందుస్తాన్ టైమ్స్ పత్రిక కార్టూనిస్టుగా పనిచేసేవారు. నాటి టైమ్స్ సంపాదకుడు దేవ్‌దాస్ గాంధీ వత్తిడి మేరకు శంకర్ పదవి నుంచి వైదొలగవలసి వచ్చింది. ఈయన మహాత్మా గాంధీ నాలుగో కుమారుడన్న సంగతి మరచిపోకూడదు. ఇంతకీ ఈ ఇద్దరికీ ఏమిటి తగాదా? సి. రాజగోపాలాచారి మీద శంకర్ వేసిన కార్టూన్లు మరీ తీవ్రంగా నవ్వించాయట. దానితో ఆయనకి కోపం వచ్చింది. ఏమైనా ఆ విధంగా దేవ్‌దాస్ దేశానికి, కార్టూన్ వ్యవస్థకి మహోపకారమే చేశారు.

శంకర్ కూడా తొలిదశలో మంచి పేరు తెచ్చుకోలేదు. కానీ స్వయం కృషితో అంతర్జాతీయ స్థాయి వ్యంగ్య చిత్రకారునిగా అవతరించారాయన. అందుకోసం ఇంగ్లండ్‌లోని స్లేడ్ స్కూల్ ఆఫ్ ఆర్ట్‌లో ఏడాది పాటు కఠినమైన శిక్షణ తీసుకున్నారు. ఆ తరువాతే హిందుస్తాన్ టైమ్స్‌లో చేరారు. 1946 వరకు అక్కడ ఉన్నారు. ఆ పత్రికకు ఆయన చేసిన సేవ ఎంత విలువైనదో కేరికేచరింగ్ కల్చర్ ఇన్ ఇండియా అన్న పుస్తకంలో రీతూ ఖందూరి తెలియచేశారు. 'శంకర్ కార్టూన్ హిందుస్తాన్ టైమ్స్‌లో అంతర్భాగంగా మారింది. ఇంకా అప్పటికి ఆవిష్కృతమవుతున్న భారతీయ జీవనం మీద తనదైన ముద్రను వేసింది.'

1948లో ప్రథమ ప్రధాని జవాహర్ లాల్ నెహ్రూ చేత తన పత్రికను ప్రారంభింప చేయించారు శంకర్. చిత్రంగా తన పత్రిక అధికార వ్యవస్థలకు వ్యతిరేకమని శంకర్ నిష్కర్షగా ప్రకటించారు. అలాగే నిర్వహించారు. అయినా నెహ్రూ వచ్చి పత్రికను ప్రారంభించారు. ఇదంతా ఆ కాలం గొప్పదనమే మరి. శంకర్స్ వీక్లీ దేశంలోని ప్రముఖ కార్టూనిస్టులందరికీ వేదికగా మారిపోయింది. ఆర్‌కే లక్ష్మణ్, రాజిందర్ పురి, కెవి, కుట్టి, బాల్ ఠాక్రే, ఏసుదాసన్ వంటి వారంతా అద్భుతమైన కార్టూన్లు ఇచ్చారు. పాఠకులు పంపిన కార్టూన్లకు కూడా ఈ పత్రిక చోటు ఇచ్చేది. ఇది గొప్ప ప్రయోగమే. తరువాత దేశంలోనే ప్రముఖ కార్టూనిస్టుగా పేరుగాంచిన ఈపీ ఉన్నీ అలా పరిచయమైనవారే. బ్రిటిష్ వాళ్లు వెళ్లిపోయిన తరువాత వచ్చిన రెండో తరం భారతీయ కార్టూనిస్టులకు శంకర్ వీక్లీ గొప్ప ప్రోత్సాహం కల్పించింది. దేశంలో ఆ కళకు ప్రత్యేక స్థానం తెచ్చింది. నిజానికి ఆ తరం వేరు. వారి ఆలోచనలు వేరు. కార్టూనించే విషయంలో మీరు నన్ను కూడా ఉపేక్షించనక్కరలేదు అని నెహ్రూయే శంకర్‌ను ప్రోత్సహించారు. ఆ కళలో శంకర్ ఆరితేరిన వారే అయినా, ఇతర శైలులకు కూడా ఇతోధికమైన ప్రోత్సాహం ఇచ్చేవారు. 27 ఏళ్లు నడిచిన తరువాత ఇందిరాగాంధీ 1975లో ప్రకటించిన అత్యవసర పరిస్థితి వేళ శంకర్ స్వచ్ఛందంగా తన వీక్లీని ఆపేశారు. దేశంలో నవ్వేందుకు ఆస్కారం లేదని, నవ్వితే శిక్ష అనుభవించవలసిన వాతావరణం ఉందని, నవ్వడానికి తగిన స్వేచ్ఛ లేదని ఆ స్థితిలో తన పత్రిక నడవడం అసందర్భమని ఆయన రాసిన వ్యాఖ్య చాలా గొప్పది.

కార్టూన్ కళ బతకాలి. అంతా కలసి బతికించుకోవాలి. దాని మీద దాడికి దిగేవారు కాస్త ఆలోచించాలి. అవి వాళ్లని వెక్కిరించినా, ఎద్దేవా చేసినా వారి కే మేలు.

"కొంటె బొమ్మల బాపు
కొన్ని తరముల సేపు
గుండెలూయలలు ఊపు
ఓ కూనలమ్మ"

ఇందులో చెప్పింది బాపు గురించే అయినా అది ప్రతి వ్యంగ్య చిత్రకారుడికీ అన్వయిస్తుంది.

విజేతలకు అభినందనలు. ★

జొన్నలగడ్డ లక్ష్మీనారాయణ ఆర్థిక సహకారంతో
జాగృతి నిర్వహించిన - 2023

కార్టూన్ పోటీ ఫలితాలు

1. మొదటి బహుమతి రూ.5000 - వినోద్, సఖినేటిపల్లి
2. రెండవ బహుమతి రూ.3000 - గాంధీ, హైదరాబాద్
3. మూడవ బహుమతి రూ.2000 - గోపాలకృష్ణ, హైదరాబాద్

ప్రోత్సాహక బహుమతి రూ.500 పొందినవి

1. వడ్డేపల్లి వెంకటేశ్
2. ప్రసాద్ కాజా
3. ఎస్వీ రమణ
4. రోహిణీ కుమార్
5. తోపల్లి ఆనంద్
6. కృష్ణ
7. శేఖర్
8. శర్మ

సాధారణ ప్రచురణకు ఎంపికైనవి

1. వర్మ
2. చక్రవర్తి
3. పెండేల
4. క్రివ్

మణిపూర్‌లో కొనసాగుతున్న సే

మణిపూర్ రాష్ట్రంలో గత రెండున్నర నెలలుగా రెండు తెగల మధ్య కొనసాగుతున్న దాడులలో అనేకమంది మెయితీ హిందువులు ప్రాణాలు కోల్పోయారు. వేలమంది నిరాశ్రయులయ్యారు. మహిళలు, బాలికలు అత్యాచారాలకు గురయ్యారు. ఇంతటి విపత్కర పరిస్థితిలో కూడా మెయితీ మహిళలు స్థైర్యాన్ని కోల్పోకుండా సహాయ శిబిరాలలోనూ తమ ఉనికిని, సంస్కృతిని, సంఘటితశక్తిని కాపాడుకుంటున్నారు.

రాష్ట్ర సేవికా సమితి అఖిల భారత సహ కార్యవాహిక చిత్రా తాయి జోషీ మణిపూర్‌లోని కొన్ని సహాయ శిబిరాలలో పర్యటించి వివరంగా రాసిన వ్యాసాన్ని 'ఆర్గనైజర్' (జూలై 16) ప్రచురించింది. ఆ వ్యాసానికి స్వేచ్ఛానువాదం ఇది.

సహజ సిద్ధమైన ప్రకృతి సౌందర్యంతో అలరారే అతి చిన్న రాష్ట్రం మణిపూర్ మే నెల 3వ తేదీ నుంచి విద్వేషాగ్నిలో దహించుకుపోతున్నది. ఎంతో కష్టపడి నిర్మించుకున్న ఇళ్లు నేలమట్టమయ్యాయి, లెక్కలేనన్ని కుటుంబాలు నిలువ నీడలేనివయ్యాయి. స్వరాష్ట్రంలోనే శరణార్థులుగా శిబిరాలలో తలదాచు కోవలసిన విషాదకర పరిస్థితి. చూరచంద పూర్ గ్రామంలోని ప్రతి ఒక్క ఇల్లూ నిమిషాలలో అగ్నికి ఆహుతైంది. మేము ఎప్పటికి తిరిగి మా గ్రామాలకు వెళ్లగలుగుతాం? ఎప్పుడు మరలా పాఠశాలలు తెరుచుకుంటాయి? రేపటి రోజుకైనా పరిస్థితి మెరుగవుతుందా? దుఃఖం, నిరాశ, నిస్పృహలతో నిండిన వారి కన్నులలో ఇవే ప్రశ్నలు. దీనంగా, మౌనంగా సమాధానాల కోసం ఎదురు చూడడం తప్ప వారికి వేరే దారి కనబడటం లేదు. ప్రతీ రోజూ, ఏక్షణమైనా మరో దాడి జరుగు తుందేమో అనే భయం, ఆందోళనలతో బతుకు తున్నారు.

మూలవాసులకు పెద్ద ఎదురుదెబ్బ

"మెయితీ"లు మణిపూర్ రాష్ట్ర నిజమైన స్థాని కులు. మూలవాసులు. వేల సంవత్సరాల నుండి అక్కడ వారి ఉనికి, చరిత్ర, సంస్కృతులకు లిఖిత ఆధారాలు కూడా ఉన్నాయి. సనాతన ధర్మాన్ని అనుస రించే వీరు అందమైన రంగురంగుల పట్టువస్త్రాలు నేయడంలో నిష్ణాతులు. గోవిందునికి 108 రకాల నైవేద్యాలను సమర్పిస్తారు. క్రీడలలో జాతీయ, అంత ర్జాతీయ వేదికలపై బంగారు పతకాలు సాధించిన వారు. మనోహరమైన సంగీతం, నృత్యం వీరి సొంతం. మెయితీలు, కుకీలు ఇరువురూ ఒకప్పుడు మూలవాసుల హోదాను అనుభవించినవారే. నేటికీ, స్థానిక కుకీల పట్ల తమకు ఎలాంటి పగ, కోపం లేదనే మెయితీలు చెప్తున్నారు. వారి క్రోధం, వివాదం అంతా 'చిన్ కుకీల' పైన. 1938లో బర్మా (మయన్మార్) నుంచి 5 కుకీ కుటుంబాలు ఇక్కడికి శరణార్థులుగా వచ్చాయి. నాటి మణిపూర్ మహారాజు దయతో వారికి ఆశ్రయమిచ్చి, సౌకర్యాలు కల్పించాడు. వారి సంఖ్య వేగంగా పెరుగుతూ, నేడు మణిపూర్‌లో జాతి విద్వేషాల కార్చిచ్చును రగిలించే స్థాయికి వచ్చింది. గంజాయి సాగు చేయడం, దానికి అడవులను తగలబెట్టడం, మాదకద్రవ్యాల అక్రమ రవాణా వ్యాపారం ఇంకా ఎన్నో విద్రోహ చర్యలు. నిరసనల పేరుతో జరుగుతున్న దారుణాలకు అదే కారణమా లేక ముందస్తు వ్యూహంతో దేశాన్ని అస్థిర పరచేందుకు విద్రోహకశక్తులు ఆ సాకును అడ్డుపెట్టుకొని పక్కా ప్రణాళికతో అమలు చేయిస్తున్నారా? అనేది మనం తెలుసుకోవాలి. అసలైన నేరగాళ్లు మరెక్కడో దాగి ఈ విస్ఫోటనాలు జరిపిస్తున్నారు.

సహాయ శిబిరం

మెయితీ చక్రవర్తి మహారాజా చూరచంద సింగ్ పేరు మీద ఏర్పడిన చూరచందపూర్ సమూలంగా అగ్నికి ఆహుతి అయిపోయింది. "మా గ్రామంలో కూడా ఇవ్వాళ దాడులు జరిగే అవకాశం ఉందని సమాచారం వచ్చింది. ఆ సమయంలో మేము భోజనాలు చేస్తున్నాం, తిన్నాక అవసరమైన వస్తువులు తీసుకోని వెళ్లిపోవాలి అనుకున్నాం. అంతలోనే మా ఇంటికి నిప్పు అంటించేశారు. ప్రాణాలు మాత్రమే కాపాడుకోగలిగాం. సర్వస్వం కోల్పోయాం" అని అస్సాం రైఫిల్స్ సహాయ శిబిరంలో తల దాచుకుంటున్న ఒక కుటుంబం మాతో చెప్పింది. నేడు ఇలాంటి వారు వేల సంఖ్యలో 349 సహాయ శిబిరాలలో కట్టుబట్టలతో, నిస్సహాయస్థితిలో రోజులు వెళ్లదీస్తున్నారు. ఒక్క మోరియంగ్‌లోనే 4,449 మంది శిబిరాలలో ఉన్నారు.

కర్ఫ్యూ కారణంగా మేము చాలాకొద్ది శిబిరాలకే వెళ్లగలిగాము. కర్ఫ్యూ సమయాలు ప్రతిరోజూ మారు తుండేవి. ఒకరోజు మధ్యాహ్నం 1గం॥ వరకూ ఉంటే మరోరోజు సాయంత్రం 5గం॥వరకూ, ప్రతి రాత్రి 7గం॥ తర్వాత మెయిరా పైబి అనగా మహిళా పహారాదారులు కాగడాలు చేతబట్టి పెద్ద గుంపులుగా రాత్రంతా ఆయా ప్రదేశాలనూ, వాటిని అనుసంధానం చేసే రహదారులనూ కాపలా కాస్తున్నారు. వచ్చే, పోయే ప్రతీ వ్యక్తినీ, ప్రతి వాహనాన్నీ క్షుణ్ణంగా తనిఖీ చేశాకనే వదులుతున్నారు. పోలీసు, సైనిక వాహనాలకు సైతం మినహాయింపులేదు. వాహనాలలో కుకీలుగానీ, ఆయుధాలుగానీ ఉన్నాయేమో నని వెతికి మరీ వదులుతున్నారు. శిబిరాలలోని వారికి అపాయం కలగడానికి వీల్లేదని వారి పట్టుదల.

క్యాంపులలో ఉన్న వారి కన్నీటి గాథలు తెలుసుకున్నాక ఘర్షణలకు దూరంగా ఉన్న ప్రదేశాలలోని మెయితీలలో కూడా కుకీల పట్ల ఆగ్రహం పెరుగుతున్నది. వారికి చిరకాలంగా తమతో సహజీవనం చేస్తున్న 'థాడో కుకీల'తో ఎటువంటి విభేదాలు లేవు. వారికోపం అంతా 'చిన్ కుకీల' పైనే, వారే ఈ హింసాకాండకు కారకులు. ముఖ్య విషయం –ఈ రాష్ట్ర అంతర్జాతీయ సరిహద్దులకు రక్షణ తక్కువ.

"కంచె కావలి"

చిన్ కుకీలు మయన్మార్ నుంచి చాలా సులువుగా ప్రవేశించగలుగుతున్నారు. వారు మయన్మార్ నుంచి

వాయజ్ఞం

ఆధునిక ఆయుధాలతో వస్తున్నారు, చెప్పాలంటే పథకం ప్రకారం పంపుతున్నారు. ఇక్కడి నుండి గంజాయి పంట అక్కడికి వెళ్తుంది, అక్కడ దానిని మాదకద్రవ్యాల రూపంలోకి మార్చి తిరిగి భారత్‌లోకి చేరుతున్నది. అప్పుడప్పుడు ఈ మాదకద్రవ్యాల ట్రక్కులు మిజోరామ్ రాష్ట్రం నుంచి కూడా చేరుతున్నాయి. కుకీలు వ్యూహాత్మకంగా పశు సంపదను దొంగిలించడం, చంపడం, జీవ నోపాధి కోల్పోయిన మెయితీలు ఆ గ్రామం విడిచి పెట్టే పరిస్థితి కల్పించడం చేస్తున్నారు. ముఖ్యంగా గోవులను హతమార్చి గోమాంసం తినడం అనేది మెయితీల ఆగ్రహానికి మరో ముఖ్య కారణం.

మెయితీలు చాలా అభద్రతా భావంతో ఉన్నారు. చిన్ కుకీల వద్ద అత్యాధునిక ఆయుధాలు ఉన్నాయి కానీ వీరి వద్దలేవు. మణిపూర్ అనేక గిరిజన తెగల సమాహారం. మెయితీలు, నేపాలీలు, కుకీలు, అనేక గిరిజన జాతులు, షెడ్యూల్డ్ కులాలు.. వీరిలో మెయితీలు పర్వత ప్రాంతాలలోనే నివసించేందుకు అనుమతి ఉంది. ఈ ప్రాంతమంతా తొమ్మిది హిమాలయ పర్వత సానువులతో నిండి ఉంటుంది. ఇవి ఒకదానితో మరొకటి కలిసి పోయి ఉంటాయి, అందువల్ల ఒక పర్వతం నుంచి మరొక పర్వతానికి చేరుకోవడం చాలా సులువు. గిరిజన తెగలు, కుకీలు మైదానప్రాంతాలు, పర్వతప్రాంతాలు రెండు చోట్లా ఉండేందుకు అనుమతించారు. అదే ఇప్పుడు మెయితీల భయాందోళనలకు ముఖ్యకారణం. కుకీలు ఏవైపు నుంచైనా, తమను లక్ష్యం చేసుకొని దాడులు చేయగలరన్నది వారి భయం.

సహాయ శిబిరంలో జీవనం

అఖిల భారతీయ మహిళా సమన్వయ దృష్టి స్త్రీ అధ్యయన కేంద్రం నిర్వహించిన ఒకానొక సర్వేలో భారతీయ మహిళల 'సంతృప్తి గుణాత్మకత' (contentment quotient) చాలా ఎక్కువని తేలింది. అది ఇక్కడ మరోసారి రుజువైంది. మేము ఒక శిబిరానికి వెళ్లాం. ఒక పెద్ద హాలు, కొన్ని గదులు ఈ కుటుంబాలకు కేటాయించారు. గర్భవతులకు వారి పరిస్థితి దృష్ట్యా మంచాలు ఇచ్చారు. పరుపులు, దుప్పట్లు, దోమతెరలు కూడా ఉన్నాయి. మేము లోనికి ప్రవేశించగానే మా దృష్టిని ఆకర్షించింది, పూజ కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకున్న స్థలం. మెయితీ సంప్రదాయంలో ప్రతిరోజూ సూర్య భగవానునికి నీరు, పుష్పాలు, ఫలాలు, ఒక చిన్న గిన్నెలో ధూపం, మరో చిన్న పళ్లెంలో తులసీదళాలు ఒక గట్టు మీద ఉంచి సమర్పిస్తారు. మెరిసే ఇత్తడి, రాగి పాత్రలు, పూజాస్థలం అమరిక మనసుకు ఎంతో ఆహ్లాదాన్ని ఇస్తున్నాయి. సహాయ శిబిరాలలో అగమ్య గోచర స్థితిలో కూడా తమ నిత్యపూజ, అర్చనలను విడవని ఆ ధీర వనితలకు మౌనంగా ప్రణామం చేశాం.

నేను నేటివరకూ ఎన్నో విపత్తులకు గురైన ప్రదేశాలకు వెళ్లాను కానీ, ఇక్కడ నాకు ఆశ్చర్యకర దృశ్యాలు కనిపించాయి. శారద ఇక్కడ ఉండేందుకు గర్భవతులకు విడిగా ఏర్పాట్లు చేశారు. ఎవరికైనా ప్రసవ వేదన కలిగిన వెంటనే ఒక మహిళా వాలంటీర్ స్వయంగా కారు నడుపుతూ, ఎంత రాత్రయినా ప్రసూతి ఆసుపత్రికి తీసుకువెళుతున్నారు. తల్లీబిడ్డలను మరలా క్షేమంగా శిబిరానికి చేర్చే ఏర్పాట్లు కూడా చేశారు.

మేము అక్కడికి వెళ్లిన రోజు శారద "మీరు జూన్ 19, సోమవారం ఇక్కడకి మళ్లీ రాగలరా? నవజాత శిశువుల కోసం ఆ రోజున శాంతి పూజ ఏర్పాటు చేస్తున్నాం" అని అన్నారు. ఆరోజు చక్కని సన్నివేశాన్ని మేం చూడగలిగాం. చుట్టూ అందమైన రంగ వల్లులతో అలంకరించిన ప్రదేశంలో మట్టి కుండను నీటితో నింపి, మామిడి ఆకులతో కలశం ఏర్పర చారు. అరటిఆకులతో అందమైన దొన్నెలు, చెంచాలు చేశారు, పువ్వులు, చిన్ని చిన్ని విల్లంబులు, పండ్లు, ప్రసాదం, మరమరాలతో చేసిన పెద్ద లడ్డూలు. ఒక పరుపు మీద ఒక ఆడ, ఒక మగ – ఇద్దరు పసిబిడ్డలు. వారి తండ్రులు సంప్రదాయ బద్ధంగా ధోవతి ధరించివచ్చారు. అందరూ గణేశుని, దేవీమాతను, శివ, విష్ణువులను, సూర్యున్ని పూజించారు. బిడ్డల మేనమామలు వచ్చి విల్లంబులు తీసుకొని అన్ని దిక్కులకూ బాణాలు సంధించి వదిలారు. దేవతలకు, ప్రకృతికి నవజాత శిశువుల రాకను తెలిపి వారిని ఆశీర్వదించమని, సర్వదా కాపాడమని కోరారు. బిడ్డల తండ్రులు మేనమామలను సత్కరించారు. మాకు కూడా దక్షిణ సమర్పించారు. తరువాత అందరికీ మరమరాల లడ్డూలు, పరమాన్నం ప్రసాదంగా ఇచ్చారు. తల్లులకు, బిడ్డలకు దేవీ అహల్యా మందిరంలో ప్రత్యేకంగా తయారు చేసిన భోజనం పెట్టారు.

అంతటి విషాదకర సమయంలోనూ ఇటువంటి

అందమైన, సంతోషకర క్షణాలు శక్తినిస్తాయి. పరమాత్మ యెడల అచంచలమైన భక్తి విశ్వాసాలు, కృతజ్ఞతాభావం ఇవే మన అంతర్గతశక్తి. అందుకే హిందూ సమాజం ఎన్ని అటుపోట్లనైనా ఎదుర్కొని నిలబడుతున్నది.

కాగడాలతో మానవహారం

జూన్ 17 రాత్రి నిజంగా ప్రత్యేకమైనది. ఆరోజు మెయితీ ప్రజలు రాత్రి 7 నుంచి 8 వరకు మానవ హారం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. సమా చార, ఇంటర్నెట్ సేవలు నిలిపివేసినప్పటికీ మెయితీ సమాజం ఎక్కడున్నా మానవహారంగా ఏర్పడి సంఘీభావం తెలపాలనే సందేశం దేశవిదేశా లకూ చేరింది. కుతూహలం కొద్దీ మేము కూడా ప్రధాన రహదారి వద్దకు చేరుకున్నాం. 7 గంటలకు కాస్త ముందునుంచే కాగడాలు చేతబట్టిన స్త్రీలు గుంపులుగా రావడం మొదలుపెట్టారు. కొద్ది సేపటిలోనే 3,4 కిలోమీటర్ల పొడవైన మానవహారం ఏర్పడింది. కొంతమంది 'మాకు విభజన వద్దు, శాంతి కావాలి', 'విభజించి పాలించు పాలసీ మాకు వద్దు', 'మణిపూర్‌లో ప్రత్యేక పరిపాలన మాకు వద్దు', 'మణిపూర్ నుంచి కుకీ తీవ్రవాదులను తరిమి కొట్టండి' అనే నినాదాలు రాసిన ప్లకార్డులు ప్రదర్శించారు.

ఆరిపోకుండా నూనె

చాలామంది మహిళలు కాగడాలలో జ్వాలను రగిల్చి ఉంచేందుకు సీసాలు చేతబట్టుకొని వాటిలో నూనె పోయడం, ఎవరూ వరుస తప్పకుండా చూడడం వంటి పనులు చేస్తున్నారు. రహదారి దీపాలు వెలిగాయి. ఎత్తున ఆ దీపాలు, కింద కాగడాలు వెలుగుతూ ఒక అద్భుత దృశ్యాన్ని ఆవిష్కరించాయి. వారి వెనుక నిలబడి చూస్తూ స్ఫూర్తి పొందుతున్న సోదరుల మనసులో ఒక ప్రశ్న కదిలింది–ఇక్కడ ఎక్కువ ప్రభావం చూపినది దీపాలు, కాగడాలా లేక వాటిని చేతబట్టిన మహిళలా?

8 గంటలకు నినాదాలతో మారుమోగుతూ మానవహారం విడిపోయింది. ఎక్కడా ఎటువంటి గందరగోళం గానీ, అనవసరపు మాటలు గానీ, తగాదాలు గానీ లేవు. మరునాడు ఇటువంటివే ఇంఫాల్ నగర వీధులలో కూడా జరుగుతాయి అని కార్యకర్తలు చెప్పారు. ఇంకా, వారు మణిపూర్‌కి ఆవల నివసిస్తున్న తమ సమాజం అంతా కూడా ఇదేవిధంగా చేశారు, చేస్తారు అని నమ్మారు.

జగన్నాథునికి కిచిడి నైవేద్యం

ప్రతీ సంవత్సరం ఆషాఢ విదియ నాడు జగన్నా థుని రథయాత్ర జరుగుతుంది. ఈ సంవత్సరం ఆ సంప్రదాయం కొనసాగించే పరిస్థితి లేదు. అయి నప్పటికీ, స్థానిక ఆలయానికి కిచిడి తదితర నైవేద్యాలకు, పూజకు కావలసిన సంభారాలు ప్రతీ ఇంటినుండి చేర్చారు. పురుషులు ధోతీలు, స్త్రీలు తెల్లని సంప్రదాయ వస్త్రాలు ధరించి ఆలయానికి చేరుకున్నారు. ఇదంతా అక్కడ అసలు కర్ఫ్యూ లేదేమో అనిపించేలా అత్యంత సాహసంతో చేశారు. సహాయ శిబిరాలలో కూడా కిచిడి తయారయ్యింది. ఏ క్షణ మైనా, ఎటువైపు నుంచైనా దాడి జరిగే అవకాశం ఉన్నప్పటికీ వారు తమ భక్తివిశ్వాసాలను, ఆచార సంప్రదాయాలను విడిచిపెట్టలేదు.

రాష్ట్ర ప్రభుత్వం చాలా పాఠశాలలు, కళాశాలలు, హాస్టళ్ల భవనాలను సహాయ శిబిరాలుగా ఏర్పాటు చేసింది. స్థానిక సమాజం కూడా స్వచ్ఛందంగా ముందుకువచ్చింది. ఈ 'సేవా యజ్ఞం' మే 5న ప్రారంభమై నేటికీ కొనసాగుతోంది. ప్రభుత్వం ధాన్యం అందిస్తే, సమాజం ఉప్పు, కారం వంటి వాటిని అందిస్తోంది. ప్రతి ఇల్లు బట్టలు, ఆహారం, ధనం.. ఇలా ఏదో ఒక రూపంలో సహకారం అందిస్తున్నది. వాలంటీర్ల రూపంలో కూడా..

నింగథోఖోంగ్ ప్రాంతంలోని శిబిరంలో ఉంటున్న మహిళలలో 7,8మంది చేనేత పని చేయడానికి ముందుకు వచ్చారు. ఒక వారం రోజుల్లో, కావలసిన నూలు దారం తెప్పించి పని ప్రారంభించే అవకాశం ఉన్నది. రాష్ట్ర సేవికా సమితి స్ఫూర్తితో నడుస్తున్న 'ఇమా లక్ష్మీ ట్రస్ట్, ఇంఫాల్ ' అనే కేంద్రంలో 5 చేనేత మగ్గాలు ఉన్నాయి. వారిని స్వయంసమృద్ధి దిశగా నడిపేందుకు అనేక ఆలోచనలు చేస్తున్నారు.

వైద్య శిబిరం

జూన్ 18న వైద్య సహాయం అందించేందుకు ఇద్దరు డాక్టర్లు ఇక్కడికి చేరుకున్నారు. ఎయిర్ పోర్ట్ నుంచి వారిని నేరుగా ఫార్మసీకి తీసుకువెళ్లాము. చాలా రోజులుగా రవాణా స్తంభించినందువల్ల నిత్యావసర వస్తువులే గాక అత్యవసర మందులకు కూడా తీవ్ర కొరత ఏర్పడింది. వివిధ ప్రదేశాలలో పెద్ద సంఖ్యలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి, వంద లాది మందికి చికిత్సలు అందించడం జరిగింది. డా॥ మృదులాతాయి బాపట్, డా॥ షీలాతాయి (డెంటిస్ట్) లు వైద్య పరీక్షలు చేస్తూ ఉండగా బబిత, మేమా, గిరిజ, ఈశ్వరి, వెల్లోర్ పాట్టి – వీరు నింగతో ఖోంగ్‌లో నర్సులు, మందులు పంపిణీ చేయడం, వైద్యుల సూచనలు రోగులకు అర్థమయ్యేలా వివరించడం చేశారు. కొంతమంది రోగు లను కాస్త వ్యాయామం చేయమని సూచించారు. మహిళలు, పిల్లల మానసిక, శారీరక ఆరోగ్యం కోసం ఆటలు ఆడించాం. ఎన్నో రోజుల తరువాత హాయిగా, మనస్ఫూర్తిగా నవ్వుకున్నామని కొంత మంది మహిళలు మాతో చెప్పారు. చాలామంది మనసులలో దాడుల తాలూకు గాయం మానలేదు. చిన్న పిల్లలు ఏమి జరిగిందో, ఎందుకు జరిగిందో అర్థంకాక అయోమయంలో ఉన్నారు. వారికి భవిష్యత్తు అగమ్యగోచరంగా ఉన్నది. నిస్సహాయత, నిరాశ, నిస్పృహలతో నిరుత్సాహంగా కనిపిస్తున్నారు. పెద్దవాళ్లు చాలామంది తమ కళ్లద్దాలు పోగొట్టు కున్నారు. అధిక రక్తపోటు, మధుమేహంతో ఎంతోమంది కనిపించారు. వీరంతా తమ మందుల చీటీలు, మందులు ఇళ్లవద్దే వదిలి రావాల్సి వచ్చింది, ఇక్కడ మరలా కొనుక్కోవడానికి వారి వద్ద వనరులు లేవు. సరైన మందులు అందకపోతే అటువంటి జబ్బులు ప్రమాదకరంగా పరిణమించే అవకాశం ఉన్నది. ప్రతి శిబిరంలో ఓంకారం, సర్వే భవంతు... మంత్రోచ్చారణ చేయించాం. వారిని ప్రతిరోజూ ఒకచోట చేరి, ఓంకారం పలకడం, భగవత్ ప్రార్థన చేయడం, పిల్లలతో కలిసి ఆటలు ఆడటం, వారికి కథలు చెప్పడం వంటివి చేయమని సూచించాం. వారిని సముదాయించడం, త్వరలోనే స్వస్థలాలకు తిరిగి వెళ్లగలరని నమ్మకం కలిగించడం తప్ప ఇంకేమీ చేయలేకపోయినందుకు బాధపడ్డాం.

ప్రభుత్వం మళ్లీ స్థలం ఇవ్వచ్చు, ధ్వంసమైన ఇళ్లు మరలా నిర్మించుకోవచ్చు, నిత్య జీవనం తిరిగి యథాస్థితికి చేరుకోవచ్చు. కానీ వారి మనసులలోని అప నమ్మకం, అభద్రతాభావం ఏవిధంగా పోగొట్ట గలం! ఇది దీర్ఘకాలం తరువాత జరుగుతుంది. మనందరి పరిస్పర సహకారం, సాంగత్యం, సహనం, స్నేహ సాహచర్యలతోనే సాధ్యం కాగలదు. యావత్ భారతదేశం వారి వెనుక నిలబడి మద్దతు ఇచ్చినప్పుడే మెయితీలు ఈ విపత్తును అధిగమించగలరు. ★

ఆకలిని అంతం చేయడానికి ఆహార భద్రతను మరింత మెరుగు పరచడం, పోషకాహారాన్ని అందచేయడం, ఆ లక్ష్యసాధనకు సుస్థిరమైన వ్యవసాయాన్ని ప్రోత్సహించడంపై నరేంద్ర మోదీ ప్రభుత్వం దృష్టి కేంద్రీకరించింది. అందులో భాగంగానే నూతన సమగ్ర ఆహార పథకం కింద ఈ ఏడాది ఆరంభంలో ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజనను ప్రారంభించింది. అంత్యోదయ అన్న యోజన (ఎఎవై) సహా జాతీయ ఆహార భద్రత చట్టం (ఎన్ఎఫ్ఎస్ఏ) కింద అర్హులైన వారందరికి ఉచితంగా ఆహార ధాన్యాలు అందచేయాలన్నది దీని ప్రధాన ఉద్దేశం. త్వరలో జరిగే జి-20 అగ్రనాయక సమావేశంలోనూ ఆహార భద్రతే ప్రధానాంశం కాబోతోంది.



సుస్థిర సేద్యంతో ఆహార భద్రత

ఆహార భద్రత ప్రపంచ దేశాలకు పెద్ద సవాల్‌గా మారింది. నానాటికి పెరుగుతున్న జనాభా, తగ్గుతున్న సాగు విస్తీర్ణం, వాతావరణంలో మార్పులు ఇందుకు ముఖ్య కారణాలుగా నివుణులు చెబుతున్నారు. దేశ పౌరులందరికీ సమానరీతిలో ఆహార భద్రత కల్పించాలనే లక్ష్యంతో 'ఆహార భద్రత చట్టం -2013'ను భారత్ ప్రభుత్వం ఆమోదించింది. గ్రామీణ,పట్టణ ప్రాంతాలలో 75, 50 శాతం చొప్పున ఆహార భద్రతను కల్పించాలన్నది ఈ చట్టం ప్రధాన ఉద్దేశం. ఆ వెంటనే నరేంద్రమోదీ నేతృత్వంలో ఏర్పడిన ప్రభుత్వం ఆ చట్టానికి జవజీవాలు పోసింది. ఆహారభద్రతను కల్పిస్తూనే, ఆరోగ్యకరమైన ఆహారంతో పాటు పౌష్టికాహారంపై కూడా ప్రత్యేక దృష్టి సారించింది.

ఈ నేపథ్యంలో వచ్చే నెల 9, 10 తేదీలలో దేశ రాజధాని ఢిల్లీలో జరిగే జి-20 సమావేశంలో ఆహారభద్రత, అందుకు అనుసరించవలసిన సుస్థిర సేద్యం తదితర అంశాలపై కూటమి అధ్యక్ష హోదాలోని భారత్ ప్రధానంగా ప్రస్తావించ నుంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఇండోర్‌లో, మార్చిలో చండీఘడ్‌లో, ఏప్రిల్‌లో వారణాసిలో జరిగిన వ్యవసాయ ప్రతినిధుల సమావేశాలలో, జూన్‌లో జరిగిన వ్యవసాయ ముఖ్య శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ మంత్రుల సమావేశాలలో ఈ అంశాలు చర్చకు వచ్చాయి. ఆహార భద్రతలో ఎగుడుదిగుళ్లు, వాతావరణంలో మార్పుల కారణంగా పంట దిగుబడి పడిపోవడం, ఆహారం వృథా లాంటి అంశాలపై ఆ సమావేశాలలో కొంత ఆందోళన వ్యక్తమైంది. ఆ పరిస్థితులను చక్కదిద్దడంతో పాటు అధిక దిగుబడుల సాధనకు వ్యవసాయ రంగంలో అత్యాధు నిక శాస్త్రసాంకేతిక ప్రక్రియలు ప్రవేశపెట్టడం, నీటి వనరుల పరిరక్షణ, జీవ వైవిధ్యాన్ని కాపాడడం, చిన్నసన్నకారు రైతులను బలోపేతం చేయడం వంటి వాటిని సమర్థంగా అమలు చేయాలని ఆ సమావే శాలు అభిప్రాయపడ్డాయి. ప్రకృతి వైపరీత్యాలకు తోడు ప్రపంచాన్ని కదిపి కుదిపిన కరోనా నేపథ్యంలో లాక్‌డౌన్, ఆహార రవాణాపై తీవ్ర ప్రభావం చూపింది. అది ధరల పెరుగుదలకు దారి తీసింది. ఈ పరిస్థితులలో, పంటల దిగుబడిలో ఎదురయ్యే ఒడుదొడుకులను అధిగమించేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలన్న జి-20 దేశాల బృందం ప్రతిపాదనను నరేంద్రమోదీ ప్రభుత్వం గట్టిగా సమర్థించింది.

గత ఏడాది డిసెంబర్ 1వ తేదీన భారత్ స్వీకరించిన జి-20 అధ్యక్ష బాధ్యతలు మరో మూడు నెలల్లో (నవంబర్) ముగుస్తాయి. గడచిన సుమారు తొమ్మిది నెలల కాలంలో వివిధ అంశాలపై వివిధ నగరాలలో నిర్వహించిన సమావేశాలలో వాటి గురించి సమగ్రంగా చర్చించింది. ప్రధానంగా భారత్ వ్యవసాయ ప్రధాన దేశమే కాక, ముఖ్య ఎగుమతి దారుగా ఉండడం వల్ల ఈ రంగంపై సహజంగానే ప్రత్యేక దృష్టి పెట్టారు. సుస్థిర సాగు ద్వారా ప్రపంచ దేశాలకు ఆర్థిక భద్రతను కల్పించేందుకు వ్యవసాయ కార్యాచరణ బృందాన్ని ఏర్పాటు చేయాలన్న 2011 నాటి కేన్స్ (ఫ్రాన్స్) జి-20 సమావేశం నిర్ణయాన్ని భారత్ అందిపుచ్చుకుంది. ఆహార భద్రతతో పాటు ఆరోగ్యానిచ్చే చిరు(సిరి) ధాన్యాల ఆవశ్యకతను గుర్తించింది.

చిరు ధాన్యాలు పోషక విలువలు సమృద్ధిగా కలిగి ఉండడమే కాక, వాటిలో ఎన్నో ఇతర లక్షణాలు ఇమిడి ఉన్నాయి. అవి ఆరోగ్యాన్ని ఇస్తాయి. ఆయుష్షును పెంచుతాయి. అలా పౌష్టికాహార ప్రాధాన్యతను గుర్తించిన నరేంద్రమోదీ ప్రభుత్వం 2019ను చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించింది.

ఐక్య రాజ్య సమితితో ప్రస్తుత ఏడాది (2023)ని అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్స రంగా ప్రకటింప చేసింది. భారత్ ఈ ప్రతిపాదనకు 72 దేశాల మద్దతు లభించింది. ఆహార భద్రత, పోష కాహారం విషయంలో చిరుధాన్యాల పట్ల అవ గాహనను పెంచడం, వీటి పరిశోధన, అభివృద్ధికి పెట్టుబడులను ప్రోత్సహించడం లక్ష్యమని ఆహారం, వ్యవసాయం సంస్థ (ఎఫ్ఏఓ) పేర్కొంది. భారత్ 2019 ప్రతిపాదించిన చిరుధాన్యాల ప్రోత్సాహ పథకం విలువ, కరోనా అనంతర పరిణామాలతో ప్రపంచానికి తేట తెల్లమైనట్టయింది. ఈ చిరుధాన్యాల అభివృద్ధిలో ఇటు ప్రజారోగ్యం, అటు రైతు సంక్షేమం ముడిపడి ఉన్నాయి. అందుకే వీటి మద్దతు ధరను 80 శాతం నుంచి 125 శాతం వరకు పెంచింది. శ్రీఅన్న పథకంలో భాగంగా 'భారత చిరు ధాన్యాల పరిశోధన సంస్థను హైదరాబాద్‌లోనే నెలకొల్పారు.

ప్రపంచ మానవాళి ఆరోగ్యం ఒక క్లిష్ట సమస్యగా తయారవుతోందని భావిస్తున్న సమయంలో మోదీ ప్రభుత్వం చూపిన చొరవ ప్రపంచ దేశాలకు స్ఫూర్తినిచ్చిందని చెప్పవచ్చు.

- జాగృతి డెస్క్

భజన నింపిన

గళం గళం కలిపి పాడినా, పదం పదం కలిపి నడిచినా సమూహంలో తెలియని ఒక శక్తి జనిస్తుంది. అది సామూహిక శక్తిగా అవతరిస్తుంది. తెలంగాణ విముక్తి ఉద్యమంలో రజాకార్లను తరిమికొట్టడానికి ఆ గ్రామ ప్రజల గుండెలలో ధైర్యం అనే ఇంధనాన్ని కొన్ని భజన కీర్తనలు నింపాయి. భజన చేస్తే, శక్తి వస్తుంది. భజన చేస్తే చెడు మీద విజయం సాధించగలమని నాడు పుట్టిన నమ్మకం వారిని అలా వీరోచిత కార్యం వైపు అడుగులు వేయించింది. చిత్రంగా నేటికీ అదే నమ్మకం ఆ ప్రాంతాల ప్రజలను వదిలిపెట్టలేదు.

ఓంకారచ పరబ్రహ్మ /యావదోంకార సంభవః
అకారోకార మాకార /ఏతే సంగీత సంభవాః

సమస్త జగత్తుకు కారణమైన 'ఓం' కారం నుండే సంగీతం ఉద్భవించిందని చెప్పుకుంటాం. ఆ గానకళకు సప్తస్వరాలు పునాదులు.

మనిషికి ఉండవలసిన లక్షణాల్లో మొదటిది శ్రద్ధ అన్నారు పెద్దలు. ఇది ఉంటే ఓటమే ఉండదంటారు. శ్రద్ధ అంటే మనసు పెట్టి పనిచేయడం, నమ్మకంతో పనిని ముందుకు తీసుకు వెళ్లడం. నమ్మకాన్ని చేతల్లో చూపించడం. విశ్వాసాన్ని కార్యాచరణలో పెట్టడం. చేసే పనిలో మమేకం అవ్వడం దీని స్వభావం.

కాశింశెట్టి సత్యనారాయణ
విశ్రాంత ఆచార్యుడు

రుగ్వేదంలో శ్రద్ధాసూక్తం ఉంది. శ్రద్ధాళువులే మహోన్నత సత్యాలను గ్రహించగలరని కఠోప నిషత్తులోని నచికేతుడి కథతో తెలుస్తుంది. అసలు గాథలోకి వెళదాం!

అది 1946. ఆరోజు శనివారం. పాలమూరు జిల్లా మొగలిగిద్దలో కక్కు నారాయణ, గాండ్ల వీరయ్య హనుమాన్ గుడి మీద ఓంకార ధ్వజాన్ని నిలిపారు. అది చూసిన మహమ్మదీయులు గుడికి వచ్చిన భక్తుల మీద దాడి చేశారు. భజనకు ఆటంకం కలిగించారు. కానీ భక్తులంతా కలిసికట్టుగా, పట్టుదలతో ఆ ఆటంకాన్ని లెక్క జేయకుండా 21 రోజులు భజన చేశారు. నియమంతో చేసిన ఆ భజన సమాప్తమైన నాటి నుండి భక్తులలో ఒక నూతనోత్తేజం అనుభవానికి వచ్చింది. మిగిలిన గ్రామస్తులను కలుపుకొని భక్తులంతా తమ ధర్మం మీద దాడికి దిగుతున్న మహమ్మదీయులను ఎదుర్కొని పారదోలారు. ఎన్నడూ లేని రీతిలో నూతనోత్తేజం కలగడానికి నియమబద్ధంగా చేసిన 21 రోజుల భజన కారణమని నమ్మడం ఆరంభించారు. ఇంతకీ వారు పాడినవన్నీ రాకమచర్ల వేంకటదాసు రచించిన కీర్తనలు. నాటి నుండి వారికి వేంకటదాసు కీర్తనలపై అపారమైన నమ్మకం. అదే ఇప్పటికీ కొనసాగుతున్నది.

వేంకటదాసు జీవిత చరిత్ర తెలుసుకునేందుకు 'శ్రీ రాకమచర్ల మహాత్మ్యము వేంకటదాసు గారి జీవితము – భక్తబృంద చరితములు' పుస్తకం తప్ప మరొక ఆధారం లేదు. దీని ప్రకారం మహబూబ్ నగర్ జిల్లా పెద్దాపురం గ్రామానికి చెందిన రాకమచర్ల వేంకటదాసు 1808లో జన్మించారు. తల్లిదండ్రులు అనంతమ్మ, పురుషోత్తం. పెద్దాపురంలో రాకమచర్ల సంస్థానం ఏర్పాటు చేశారు. ఇప్పటికీ వారి వారసులు సంస్థాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రాకమచర్ల కీర్తనలు పేరుతో వేంకటదాసు రచించిన కీర్తనలు రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రాచుర్యంలో ఉన్నాయి. వేంకటదాసు డిసెంబర్ 8, 1859న కన్ను మూశారు.

వేంకటదాసు భజన చేయడానికి కారణమేమిటో తెలియజేసే కీర్తన:

దాసా భావము మదిలోన నమ్మి
రాకమచర్ల వాసుని యందు మనస్సుగమ్మి
దాసిగా నను దయజేసి బ్రోవగల
వాసుదేవ శ్రీ వాసుదేవయని

(రా.వేం.కీ. పేజీ-33)

భక్తిమార్గంలో భజన పద్ధతిని చేపట్టారు. తమ పూర్వీకులు మార్గంలోనే వంశానుగతంతో వచ్చిన మతాచారాన్ని దాసు కూడా అనుసరించారు.

జానపద వాఙ్మయం అంటే పల్లె జీవనానికి పట్టిన అద్దం. పల్లీయుల్లో పుట్టిందే జానపద వాఙ్మయం. దీన్ని సంపూర్ణ సాహిత్యంగా భావింప రాదు. అదే స్థాయిలో ఇది ఒక దీపం వెలిగించినంత. అంతేగాని సూర్యునితో పోల్చరాదు.

సృష్టికి పూర్వం పరమేశ్వరుడు ఒక్కడే. భూమి మొదలు సూర్యుని వరకు ఉన్న సమస్త జగత్తునూ అతడే రచించాడని రుగ్వేదం చెబుతున్నది. 'సమస్త సృష్టి పరమేశ్వరుని వల్లనే జరిగింది' అంటుంది అధర్వం. ఇట్టి విషయాన్ని కీర్తనల రూపంలో, జానపద బాణీల్లో, సాధారణ ప్రజలకు అర్థమయ్యే టట్లు రుషులు, యోగులు, దాసులు రాస్తూ ఉంటారు. ఆ కోవలోనివారే రాకమచర్ల వేంకటదాసు.

ఈ పద్యం వేంకటదాసు 'శ్రీమన్నారాయణ స్తవము' లోనిది.

కం॥ శ్రీ కాంతా హృదయేశ్వర
లోక జనస్తుత్య భక్తలోల సుశీలా
నేకాత్మ నివహ పోషణ
రాకమచర్లాద్రిధామ రఘురామా!

రాకమచర్ల వేంకటదాసు తెలంగాణ ప్రాంత వాగ్గేయకారుడు. ముచుకుంద మహర్షి అంశ. ఎన్నో భక్తి కీర్తనలు రాసి ప్రచారం చేశారు. రంగారెడ్డి జిల్లా వికారాబాద్ సమీపంలోని 'రాకమచర్ల' కేంద్రంగా ఆశ్రమాన్ని స్థాపించారు. దాదాపు లక్ష కీర్తనలు రాసినట్లు ప్రతీతి. కాని 500 కీర్తనలు మాత్రమే లభ్యం. ఈయన ఉమ్మెంతాల గ్రామానికి సమీపంలో ముచుకుంద క్షేత్రంలో వెలసిన శ్రీ లక్ష్మీయోగానంద నరసింహస్వామి వారిని దర్శించి శ్రీహరి కటాక్షం చేత కీర్తనలు రచించారని చెబుతారు. ఇవి పండితులకేగాక పామరులకు, పిల్లలకు కూడా సులభగ్రాహ్యం. ఒక సందర్భంలో ఆచార్య కసిరెడ్డి వేంకటరెడ్డి, ''మా నాన్నగారు వ్యవసాయ దారులైనా... నారాయణ కవచం మొదలైన ఘట్టాలు నోటికి వచ్చేవి. రాకమచర్ల కీర్తనలు గొంతెత్తి పాడేవారు. నాకు మూడు నాలుగేళ్ల వయస్సున్నప్పుడే ఈ పద్యాలు నేర్పించారు. 'రామ రామయన్న రారాదు పాపంబు/ రామ రామ యన్న రాదు భయము / రామ రామ యన్న రారాదు మృత్యువు / రామ నామమమృత రాశి యగును' ఈ పద్యాల అర్థాలు ఆ తరువాతి కాలంలో బాగా ఉపయోగపడ్డాయని" అని చెప్పారు.

సంగారెడ్డి జిల్లా, పాలమూరు జిల్లాలోని క్రొత్తగిడి పరిసర గ్రామాలైన తేరపోలు, లాగర్‌పల్లి, మల్లెపల్లి, సంగారెడ్డి, కల్పగూరు, ఆలుగడ్డ, గోపులారం, ఎదురుగూడెం, హరిదాసుపురం, గుంతపల్లి, కిష్టగూడెం, తోలేరు (రాజంపేట దగ్గర) మొదలైన గ్రామాలలో రాకమచర్ల కీర్తనల భజన మండలులున్నాయి. ఈ కీర్తనలను అత్యంత భక్తి

ప్రపత్తులతో గానం చేస్తారు. ఈ సమాజాల పర్యవేక్షణ భారమంతా యువకుడైన రఘువీరశర్మ చేపట్టాడు. భావం తెలియక పోయినా తబలా, హార్మోనియం, మృదంగం, తాళాలు, ఫ్లూటు మొదలైన వాయిద్య సహకారంతో కీర్తనలు పాడుతూ ప్రజలు తన్మయులవుతారు. సంగీతశాస్త్రం తెలియకపోయినా, రాగజ్ఞానం లేకపోయినా, కేవలం కీర్తన ధోరణిని బట్టి ఏదో ఒక పద్ధతిలో కీర్తనలు పాడుతారు.

గుండె ధైర్యం

మొగలిగిద్ద గ్రామంలో గాజుల శివప్ప, 'భజన రాత్రి పూట 9.30 నుంచి 12 గంటల వరకు చేస్తాం. పనిపాటలతో తీరిక చిక్కని మా అందరికీ (భక్తులకు) రాత్రి అనువుగా ఉండే సమయం. దీనివల్ల మాకు మానసిక నిర్మలత్వం లభిస్తున్నదని" అని వివరించారు. చౌదరిగూడ, రాప్రోలు, తొండపల్లి, చిట్యాల, చిటిగిద్ద, కొల్లూరు, ముతరాసిపల్లె, టేకులపల్లె మొదలైన పల్లెలలో ఎన్నో సంవత్సరాలుగా రాకమచర్ల కీర్తనలు పాడుతున్నారు. శాస్త్రీయ సంగీతం తెలియని కారణంగా సినిమా పాటల బాణీలో పాడుతున్నారు. ఆ కీర్తనలు పాడేటప్పుడు వారికి కలిగే అనుభూతిని ఎవరికి వారు అనుభవించాల్సిందే కాని మాటలతో చెప్పలేరట. రాకమచర్ల కీర్తనలు పాడేటప్పుడు భగవంతుడు ప్రత్యక్షమైనాడు అనే తలంపు, అనుభవం వారికి మిగులుతున్నదట. "తారక నామం తలుద్దాం తాపత్రయంబులు గెలుద్దాం" (రా.వేం.కీ. 74 పేజీ) అనే వేంకటదాసు నినాదమే జనులను ఉత్తేజపరిచి వారి కీర్తనల యెడ మక్కువ పెంచుతున్నది.

గీ॥ జన్మ జన్మాంతరములైన సంచితముల
బాపగా జాలు హరి నామ భజన సేతు
నసుచు మదిలోన నమ్ముక యనుదినంబు
భజన జేసెద పాపంబు బాయు కొరకు

నవాబుపేటలోని వేంకటదాసు భజన సంఘంలో బీర్ల అడిదయ్య సభ్యుడు. చదువురాదు. కానీ ఆ సంఘంలో ప్రతీ సభ్యుడు ముప్పయి మూడు రాకమచర్ల కీర్తనలు భజన వేళ చెప్పాలనే నిబంధన పెట్టుకున్నారు. ఆ నిబంధన అడిదయ్యకు ఇబ్బంది కలిగించినా నిరాశ చెందలేదు. చదువుకున్న వారి దగ్గరకుపోయి కీర్తనలను చెప్పించుకొని నిర్ణీతకాలంలో ముప్పయి మూడు కీర్తనలు నేర్చుకున్నాడు. పారాయణం చేస్తాడు. అందువల్ల ఏ కష్టాలు రావని నమ్ముతాడు.

రాకమచర్ల కీర్తనలు భగవన్నామస్మరణతో నిండి ఉన్నాయి. ఆ కీర్తనలలో ఉన్న రామకృష్ణ శబ్దాల మహాత్యమే ఈ కీర్తనల విస్తృతికి కారణం అంటారు. వేముల నివాసి శ్రీమతి శంకరమ్మ తెల్పిన ఈ కీర్తన పరిశీలిద్దాం.

తారకనామం దలుతాం దలుతాం
తాపత్రయంబుల గెలుతాం గెలుతాం
వారి వీరి చెంత జేరగ మనకేల
నేరుపుతో హరిని జేరి భజించుచు
కామాది గుణమూల విడుతాం విడుతాం
.....
రామరామ సీతారామ హరేయని
మదమత్సరములు లేక నిలుతాం నిలుతాం
మాధవ రమ్మని పిలుతాం పిలుతాం
.....
సుందరాకారుని కందాం కందాం
మందారకారుని కందాం కందాం
మందాధరుని కథ విందాం విందాం

ఈ కీర్తన వేంకటదాసు భక్తిమార్గానికి, భజన పద్ధతికి నిదర్శనం. ఇది వేములపల్లెలో నెలవైవున్న హరి మీద చెప్పిన కీర్తన.

1. చూడు చూడు హరిని చూడు నేడు మనమని
చూడు చూడు నీ చూపు మనసు నొనగూడజేసి

ఈ కీర్తన 'అదిగో భద్రాదీ' అనే రామదాసు కీర్తనను తలపిస్తున్నది.

2. యోగికే ఎరుక పరమ యోగము లెరుగు
భోగియే యెరుగాడు పురుషుని మరుగూ
'తెలియలేదు రామభక్తి మార్గమునూ' అనే త్యాగయ్య కీర్తనను అనుసరించారు.

శ్రీపదార్చకుడు అన్నమయ్యను, నాదబ్రహ్మ త్యాగయ్యను అనుసరించినవారు అరుదు. కానీ వీరిద్దరికి నడుమన, 16వ శతాబ్దానికి చెందిన రామదాసును మాత్రం ఎంతోమంది అనుకరించారు. ఆయన కీర్తనలలోని జన రంజకత్వం, సులభశైలి ఇందుకు కారణం. అంతేగాక ఆయన కీర్తనలలో భక్తి భావ బోధ, భజన సంప్రదాయం ఎందరికో స్ఫూర్తినిచ్చింది. రాకమచర్ల కీర్తనలలో ఆ ప్రభావం కనబడుతున్నది. అలాగే సమకాలీనులు మన్నెంకొండ హనుమద్దాసు, వేపూరి హనుమద్దాసు అనే కీర్తనాకారులు వేంకటదాసును అనుకరించారు. ★



విలువ లేని పాక్

తాత్కాలిక ప్రభుత్వానికి మార్గాన్ని సుగమం చేస్తూ ఆగస్టు 9న గద్దె దిగిన పాకిస్తాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ భారత్‌తో చర్చలకు సిద్ధమేనంటూ ఇటీవల ప్రకటన చేయడం పెద్దగా సంచలనాన్ని సృష్టించ లేదు. పార్లమెంటు ఐదేళ్ల కాలం మూడురోజుల్లో పూర్తవు తుందనగా రాజకీయ, ఆర్థిక సంక్షోభం నడుమ దేశ ప్రధాని గద్దెదిగిపోయారు. ఇప్పుడు ఏర్పడబోయేది తాత్కాలిక ప్రభుత్వమే. మూడు నెలల తర్వాత ఒకవేళ నిజంగానే సార్వత్రిక ఎన్నికలు జరిగి కొత్త ప్రభుత్వం ఏర్పడి, ఆ ప్రభుత్వాధినేత ఇటువంటి ప్రకటన చేస్తే బహుశ విలువ ఉంటుందేమో!

షెహబాజ్ షరీఫ్

నాలుగు రోజుల్లో అధికారం కోల్పోయే వ్యక్తి మాటలకు బహుశ ఏ దేశమూ విలువ ఇవ్వదేమో! అందుకే, భారత్ నుంచి పెద్దగా స్పందన కనిపించ లేదు. అయితే విదేశాంగ మంత్రి ఎస్. జయశంకర్ పాక్ తన సీమాంతర ఉగ్రవాదానికి స్వస్తి చెబితే తప్ప చర్చలు సాధ్యం కావని మరొక్కసారి స్పష్టం చేశారు. ఇది ఇలా ఉంటే, అసలు పాకిస్తాన్‌లో వాస్తవ అధికారం ఎవరి దగ్గర ఉన్నది అనే మరొక ప్రశ్న కూడా తలెత్తడం అసహజం కాదు. ఒకవేళ, భారత్ ముందుకు వచ్చి చర్చలను జరపాలంటే, పాక్ ప్రధానితో జరపాలా? సైన్యాధ్యక్షుడితో జరపాలా? ప్రజాస్వామ్యం ముసుగులో దేశాన్ని నడిపిస్తున్న సైన్యం చేతిలో కీలు బొమ్మలుగా ఉండే రాజకీయ నాయకుల మాటలకు ఎంత విలువ ఇవ్వాలి? ఇది సమాధానం లేని ప్రశ్న.

కశ్మీరులో ఆగస్టు 05, 2019న ఆర్టికల్ 370ను రద్దు చేసినప్పటి నుంచీ పాకిస్తాన్ కుతకుత ఉడికిపోతున్నది. అంతకు ముందు సంవత్సరమే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పెద్ద నోట్ల రద్దు (డీమానిటైజేషన్)ను ప్రకటించడం పాక్ ఆర్థిక వ్యవస్థకు ఊహించని దెబ్బ. ఎందుకంటే, దొంగనోట్ల ముద్రణ చేసి, భారత్‌కు సరఫరా చేస్తూ అప్పటి వరకూ పాక్ తన పబ్బం గడుపుకుంటూ వస్తోంది. డీమానిటైజేషన్ వరకూ ఆ దేశ ఆర్థిక వ్యవస్థ మరీ ఇంతగా దిగజారలేదు. ఆ తర్వాతే నానాటికీ తీసికట్టు అన్న చందంగా తయారయింది. ఇలా భారత్ నుంచి దెబ్బ మీద దెబ్బ తింటున్న పాక్ బింకం వదలకుండా తన శత్రుత్వాన్ని కొనసాగిస్తూ, నేడు పూర్తి ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయింది. అంతర్జాతీయ ద్రవ్య నిధి నుంచి నిధుల కోసం ముప్ప తిప్పలు పడుతూ, ఆర్థిక మద్దతు కోసం దేశదేశాలూ తిరుగుతున్నప్పటికీ పొరుగుదేశంతో సత్సంబంధాలను నెరపాలనే ఉద్దేశం కనిపించనివ్వలేదు.

నిజానికి ప్రపంచ బ్యాంకు విధాన పత్రం పాకిస్తాన్ తన ఆర్థిక సంక్షోభంలో నుంచి బయట పడాలంటే, ఉత్తమ మార్గం భారత్‌తో వాణిజ్యం చేయడమేనని స్పష్టంగా సూచించింది. ఇరుగు పొరుగు దేశాలైన భారత్, పాక్‌లు దాదాపు 3000 కి.మీ. ల పైగా సరిహద్దును పంచుకోవడమే కాదు, వారు వాణిజ్యపరంగా సచేతనమైన అంతర్జాతీయ సముద్రమార్గంతో అనుసంధానమై ఉన్నారు. అయిన ప్పటికీ ఇరు దేశాల మధ్య చెప్పుకోదగిన వాణిజ్యం జరగడం లేదు. నానాటికీ క్షీణిస్తున్న పాక్ ఆర్థిక వ్యవస్థకు ప్రతి ఏడాదీ మిలియన్ల కొద్దీ యువత ఉపాధి రంగంలోకి ప్రవేశిస్తుండడంతో నిరుద్యోగిత పెరుగుతోంది. ప్రస్తుతం ఉన్న నిరుద్యోగిత రేటును తగ్గించాలంటే, ఏడాది 1.5 మిలియన్ల కొత్త ఉద్యోగా లను పాక్ సృష్టించవలసి ఉంటుందని ప్రపంచ బ్యాంకు విధాన పత్రం పేర్కొంది. అయితే, ఈ వాస్త వాలను అటు ఇమ్రాన్ ఖాన్ కానీ తర్వాత వచ్చిన షరీఫ్ కానీ, వారి కేబినెట్ సహచరులు కానీ దానిని చదివి, విలువ ఇవ్వలేదు. ఏ మాత్రం దార్శనికతలేని నాయకులుగా వారు తమను తాము రుజువు చేసుకున్నారు. ఆ విధాన పత్రం 2047 నాటికి పాక్ ఆర్థికంగా పురోగతి పట్టాలు ఎక్కాలంటే భారత్‌తో వాణిజ్యమే మంచి మార్గమని కూడా సూచించింది.

అయితే, పాక్ అవినీతి నాయకులు, సైన్యానికి తమ దేశం పట్ల నిబద్ధత కానీ ప్రేమకానీ ఉన్నట్టు కనిపించదు. ప్రజలు కడుపునిండా తినేందుకు చర్యలు తీసుకోవలసిన నాయకులు, అది తప్ప అన్నీ చేస్తున్నారు. భారత్‌తో వాణిజ్య సంబంధాలు పునరుద్ధరించుకుంటే ఆర్థికంగా తేరుకునే అవకాశం ఉన్నా, డ్రాగన్ కబ్జాలోనే వెచ్చగా ఉందని భావిస్తూ, దేశాన్ని కుదువ పెట్టేసుకుంటున్నారు. పైగా, కశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దును ఉపసంహరించుకుంటే తప్ప తాము భారత్‌తో మాట్లాడటం కానీ, వాణిజ్య సంబం ధాలను కానీ అంగీకరించబోమని పదే పదే చెప్తూ వస్తోంది. ఇటువంటి నేపథ్యంలో, కశ్మీర్ వ్యవహారం పైన కాకపోయినా, మొత్తానికి ఇప్పుడు పాక్ ఒక మెట్టు దిగింది. షెహబాజ్ షరీఫ్, తాము భారత్‌తో చర్చలకు సిద్ధమేనని, ఆ దేశంతో సత్సంబం ధాలను నెరుపుతున్న యూఏఈ ప్రధాని మధ్యవర్తిగా తాము మాట్లాడతామని ప్రకటించేశారు. పొరుగు దేశాలుగా ఉన్న తమ మధ్య మూడు యుద్ధాలు జరిగిన విషయాన్ని గుర్తు చేస్తూ, దానివల్ల ఎవరికీ ఒరిగింది ఏమీ లేదని పేర్కొన్నారు. అయితే, ఇక్కడ షెహబాజ్ షరీఫ్ ఒక చిన్న విషయాన్ని మర్చిపోయారు.

ఇరు దేశాల మధ్య జరిగిన యుద్ధాలు మూడు కాదని, నాలుగన్న విషయాన్నీ, ఆ నాలుగింటినీ ప్రారంభించింది తామేనన్న విషయాన్నీ, ప్రతి యుద్ధం లోనూ తామే ఓడిపోయామన్న విషయాన్నీ ఒక ప్రధానిగా ఆయన మర్చిపోవడం విచిత్రమే. దీనితో పాటుగా, దశాబ్దాలుగా తాము కశ్మీర్‌లో రావణ కాష్టంలా రగులుస్తున్న ఉగ్రవాద చిచ్చు గురించి ఆయన ప్రస్తావించలేదు. బహుశ సమస్య వారు రాసుకున్న చరిత్ర పుస్తకాల్లో ఉన్నట్టుంది. పాకిస్తాన్‌లో

ప్రకటనలు

చదువుకున్న వారు కూడా తాము భారత్‌తో చేసిన ప్రతి యుద్ధంలోనూ గెలిచామనే భ్రమలోనే ఉంటారు. ఇప్పుడిప్పుడే కొందరు విజ్ఞులు ఇది అబద్ధమనే విషయాన్ని గ్రహించి, బహిరంగంగా ఒప్పుకుంటున్నారు.

వాస్తవాలు ఏమిటో చూద్దాం –జమ్ము, కశ్మీర్ మహారాజు హరిసింగ్ కశ్మీర్ ప్రాంతాన్ని భారత్‌లో విలీనం చేస్తాడేమోనన్న ఆందోళనతో, దేశ విభజన అయీ కాకుండానే భారత్‌తో మొదటి యుద్ధాన్ని 1947 అక్టోబర్‌లో పాకిస్తాన్ ప్రారంభించింది. తొలి కశ్మీర్ యుద్ధంగా అభివర్ణించే ఈ పోరులోనే గిరిజన ఇస్లామిక్ శక్తులు పాకిస్తాన్ సైన్యంతో కలిసి జమ్ముకశ్మీర్‌పై దాడి చేసి కొంత ప్రాంతాన్ని ఆక్రమించుకున్నాయి. దీనితో హరిసింగ్ భారత్‌లో విలీనం అయ్యేందుకు పత్రాలపై సంతకాలు చేశారు. తత్ఫలితంగా భారతీయ సైనికులు ముష్కరులను నిలువరించడంతో వారు పూర్తి విజయం సాధించలేక పోయారు. వారు బెలూచిస్తాన్, మరికొంత ప్రాంతాన్ని ఆక్రమించి దానికి ఆజాది కశ్మీర్ అంటూ నామకరణం చేసుకున్నారు. అయితే, కశ్మీర్ వ్యవహారం వివాదాస్పదంగా మారడం, విషయం ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి వరకు వెళ్లడం జరిగింది. ఇరు దేశాలూ తమ తమ సరిహద్దులు ఉన్న ప్రాంతాలలో సైనికులను మోహరించడంతో ఆ ప్రాంతం నియంత్రణ రేఖగా మారింది. ఆ తర్వాత వరుసగా 1965లోనూ, 1971లోనూ, 1999 లోనూ మూడు యుద్ధాలు జరిగాయి. ఇందులో ఏ ఒక్కదానిలోనూ పాక్ గెలవలేదు, పైగా 1971లో ఆ దేశం చీలిపోయి బంగ్లాదేశ్ ఏర్పడడమే కాదు, 90వేలకు పైగా పాక్ సైనికులు భారత్‌కు లొంగిపోయారు. ఇంత పెద్ద సంఖ్యలో సైనికులు లొంగిపోవడమన్నది చరిత్రలో ఎక్కడా కనిపించని విషయం. ఆ తర్వాత 28 ఏళ్లకు జరిగిన నాలుగవ యుద్ధాన్నీ పాకిస్తానే ప్రారంభించింది.

నాటి ప్రధానమంత్రి వాజ్‌పేయి కశ్మీర్ సమస్యతో సహా ఇరుదేశాల మధ్య సత్సంబంధాలను సాధించేందుకు పరిష్కారాలను వెతకాలన్న సత్సంకల్పంతో 1999 ఫిబ్రవరిలో ఢిల్లీ – లాహోర్ బస్సు సేవలను ప్రారంభించడం తెలిసిందే. స్వయంగా అందులో ప్రయాణించి లాహోర్ వెళ్లి తాను శాంతి దూతగా వచ్చానంటూ ప్రకటించి, నాటి ప్రధాని నవాజ్ షరీఫ్‌తో చర్చలు జరిపి లాహోర్ డిక్లరేషన్‌పై సంతకాలు చేశారు. ఇందులో భాగంగా, ప్రమాదవశాత్తు కానీ అనుమతి లేకుండా కానీ అణ్వాయుధాలను ఉపయోగించే అవకాశాలను తగ్గించేందుకు చర్యలు చేపట్టేందుకు కట్టుబడి ఉంటామని కూడా అంగీకరించారు. అయితే, పాకిస్తాన్ తనకు కావలసింది శాంతి కాదనే విషయం మరొకసారి రుజువు చేసుకుంది. వాజ్‌పేయి ఆ దేశంలో పర్యటించి నెల కూడా తిరగకుండానే కార్గిల్‌కు తన దళాలను పంపి, కవ్వించి, భారత్‌ను యుద్ధంలోకి దించి మళ్లీ ఓడిపోయింది! ఇదీ పాకిస్తాన్ సచ్చరిత్ర.

ప్రపంచవ్యాప్తంగా ఎన్ని మార్పులు వచ్చినా, పాక్ వైఖరిలో మాత్రం మార్పు రాలేదు. షెహబాజ్ షరీఫ్‌కు ముందు ప్రధానిగా ఉన్న ఇమ్రాన్ ఖాన్ భారత్‌తో వాణిజ్య సంబంధాలను తెంచుకున్నారు. ఆర్థికంగా ప్రజలకు ఊరట కలిగించగల ఈ సంబంధాలను కశ్మీర్ వంక చూపించి తెంచేసుకున్నారు. అఫ్గానిస్తాన్‌కు సరుకును, సరఫరాలు పంపడానికి పాక్ రహదారిని ఉపయోగించుకునేందుకు అనుమతించాలని, అందుకు అవసరమైన రుసుమును తాము చెల్లిస్తామని నాడు భారత్ కోరింది. ఆ పని చేసి ఉంటే, పాక్ ఆర్థికంగా లాభపడి ఉండేది. అయితే, తాము వ్యూహాత్మక భౌగోళిక ప్రదేశంలో ఉన్నామన్న అహంకారంతో పాక్ ఆ అవకాశాన్ని చేజార్చుకుంది. దీనితో, పాక్‌ను పూర్తిగా పక్కన పెట్టి ఇరాన్‌లో చాబహార్ పోర్టు ద్వారా అఫ్గానిస్తాన్‌కు, మధ్యప్రాచ్య దేశాలకు కూడా తన సరుకును భారతదేశం పంపుతోంది.

ఇది ఇలా ఉండగా, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని (పీఓకే) ప్రజలు ఆర్టికల్ 370 రద్దు తర్వాత జమ్మూ కశ్మీర్‌లో జరుగుతున్న వృద్ధిని చూసి తాము కూడా భారత్‌లో కలిసిపోతామని, మోదీనే తమ ప్రధాని కావాలని కోరుకుంటూ ప్రదర్శనలు కూడా చేస్తున్నారు. ఆ ప్రాంతాన్ని ఏరకంగానూ అభివృద్ధి చేయని పాక్ ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తోంది. ఒకవైపు, ప్రత్యేక బెలూచిస్తాన్ కోసం బెలూచీలు పోరాటం చేస్తుండగా, ప్రత్యేక సింధు దేశం కోసం సింధీలు మరోవైపు ఆందోళనకు దిగుతున్నారు.

ఇక చైనాతో కలిసి ప్రారంభించిన సీపెక్ (చైనా బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్ –బిఆర్ఐకు చెందిన ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు) చొరవ పట్ల బెలూచిస్తాన్ ప్రజలు తీవ్ర వ్యతిరేకత వ్యక్తంచేస్తూ, దాడులకు కూడా దిగుతున్నారు. తమతో సంప్రదించకుండా పాక్ ప్రభుత్వం ఏ హక్కుతో చైనాతో ఈ ఒప్పందం చేసుకుందని వారు ప్రశ్నిస్తున్నారు. ఆశించిన ఉపాధి, ఉద్యోగ అవకాశాలూ ఏమీ లేకుండా, ఆ ప్రాంత మంతా చైనీయుల మయం కావడం బెలూచీలకు మింగుడుపడడంలేదు. వీటికి మించి, వారిపై జరుగుతున్న అణచివేత, వ్యక్తులను మాయం చేయడాల వంటివి కూడా వారిలో తీవ్ర ఆగ్రహాన్ని రేకెత్తిస్తున్నాయి. పైగా, ఆ ప్రాజెక్టు నేపథ్యంలో జరిగిన అవినీతి, తమ దేశంలోని కొన్ని ప్రాంతాలను చైనాకు కుదవపెట్టడం దేశ ప్రజలకు కూడా నచ్చడంలేదు.

వాస్తవానికి షెహబాజ్ ప్రభుత్వం తనకు ముందున్న పీటీఐ ప్రభుత్వం చేసిన తప్పిదాలను చక్కదిద్ది పాక్‌ను ప్రగతి మార్గంలో నడిపిస్తుందని ఆ దేశ ప్రజలు ఆశించారు. వారికి కావలసింది ఆర్థికస్వావలంబన, మెరుగైన భవిష్యత్తే తప్ప భారత్‌తో వివాదాలు కాదు. అయితే, షెహబాజ్ ప్రభుత్వం ఏ విధానాన్నీ చేపట్టకుండా ఆ దేశాన్ని మరింత ఆర్థిక సంక్షోభంలోకి నెట్టివేసింది. అదే వారికి తాడే పామై చుట్టుకున్నట్టుగా చుట్టుకుని, కాటేయడానికి సిద్ధంగా ఉంది. పైగా, ఎప్పటిలా భారత్‌పై కాలుదువ్వడానికి ఇప్పుడు పాక్ సైన్యం దగ్గర కూడా తగినన్ని వనరులు కూడా లేవు. ఇటువంటి సమస్యలన్నింటి నుంచీ, తమ దేశ ప్రజల దృష్టిని మళ్ళించడానికే షెహబాజ్ షరీఫ్ ఈ ప్రకటన చేశారని నిస్సందేహంగా భావించవచ్చు. అందుకే, ఆయన మాటలు ఆశించిన స్పందనను కలిగించలేకపోయాయి. ★

ద్విశతావధాన విద్వన్మణి బాలభాను

***భీ*ర్గవులైరి నేడరుల పాలిట భారత కీర్తి పెంచగన్**
మార్గములెన్నియైన మన మానసమొక్కటి యంచు నేడు మీ
వర్గములోని సైనికులు వందలు వేలును వీరదేహముల్
కార్గిలులోన మీరిపుడు కానుక నిచ్చిరి దేశమాతకున్

ఇదీ పద్యం. దుష్కర ప్రాస'ర్గ'తో రచన. అంశం : కార్గిల్ యుద్ధంలో దేహ త్యాగం చేసిన భారత అమరవీరులకు నివాళి.

సభావేదిక: కొవ్వూరు ఆంధ్ర గీర్వాణ విద్యాపీఠంలోని ఎస్‌వీజేవీఎస్ కళాశాల. అందులో ఆకెళ్ల బాలభాను రాసి, చదివి, వినిపించిన ఐదు పద్యాల్లో ఇదీ ఒకటి. విన్న తక్షణం ముఖ్యఅతిథి తత్వవిదానందస్వామి ఎంతగానో మెచ్చుకున్నారు. అప్పటికి పదిహేడు ఏళ్లయినా నిండని విద్యార్థినిని మనసారా అభినందించారు. 'బంగారు తల్లీ! నువ్వు అవధానాలు చేసి తీరాలి' అంటూ ఆశీస్సులందించారు. అదే తొలి ప్రేరణగా ఆమె ఇప్పటికీ వందలాది అవధానాలు చేశారు. వీటిల్లో ఒక ద్విశత, మూడు శత, 205 అష్టావధానాలుండటమే ఎంతైనా విశేషం, విశిష్టం. ప్రథమ వనితా శతావధానిగా 'వండర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్' స్థానం సాధించారు. స్వదేశంతోపాటు విదేశాల్లోనూ అవధాన జైత్రయాత్ర కొనసాగిస్తూ వస్తున్న 'శతావధాన శిరోమణి' ఆకెళ్ల బాలభాను!

మొట్టమొదటి అవధానం చేసినప్పుడు ఆమె వయసు పదిహేడేళ్లు. విద్యార్థి దశలో ఉండగానే, గణపతి నవరాత్రులవేళ తన కళాశాలలోనే అలా అపురూప దీక్షాదక్షతలు కనబరిచారు. తల్లిదండ్రులతోపాటు గురువులు, మేనమామల ఉత్సాహ ప్రోత్సాహాలే మూలకారణం.

మమ్మి, డాడి, అంకుల్, ఆంటి (నేటి సామాజిక స్థితీగతీ):

ఈ సమకాలీన ఇతివృత్తాన్ని ఎంత ప్రతిభావంతంగా సమర్పించారో చూడండి, ఎంతటి ప్రభాసంపన్నమో గమనించండి....

మమ్మి – డాడియనెడి మాయ సంస్కృతి నేడు
భరతభువిని నిండె భ్రష్టుపట్టి
అంకులాంటిలోన నాప్యాయతున్నదా?
పులిని చూసి నక్కకొలసె వాత

మరొకటి : నిను నిను నిన్ను నిన్ను మరి నిన్నును నిన్నును నిన్ను నిన్నునున్. ఇదిగో ఇలా పూరించారీ 'అవధాన భారతి' –

ఘనతర పాండురాజునకు గాదిలి కోడలినైన నన్ను నీ
జనపతి పుత్రకాధముడు సాధ్విని ఈడ్వగ నొక్కరేనియున్
కనియున్ మిన్నకుండుటిది కాదె యధర్మము, నేనడింగెదన్
నిను నిను నిన్ను నిన్ను మరి నిన్నును నిన్నును నిన్ను
నిన్ననున్

జంధ్యాల శరత్‌బాబు
సీనియర్ జర్నలిస్ట్

హృద్యమైన ఇంతటి పద్యవిద్యను సహజసుందరంగా సొంతం చేసుకున్న బాలభాను స్వస్థలం పశ్చిమగోదావరి ప్రాంతం కొవ్వూరు పరిసరాల్లోని తోగుమ్మి గ్రామం. పండిత వంశీయురాలు. తల్లిదండ్రులు సావిత్రి లక్ష్మీదేవి, విశ్వనాథ శర్మ. భర్త అమలాపురం కళాశాలలో సంస్కృత ఉపన్యాసకులు. ఇంతటి చక్కని నేపథ్యమున్న ఆమె అమలాపురంలోనే జూనియర్ కళాశాలలో సంస్కృత అధ్యాపకురాలిగా విధులు నిర్వర్తిస్తున్నారు.

ఈ 'వనితా తిలకం' బాల్యం నుంచే మేధోనిధి. ప్రథమంగా కథను నాలుగో తరగతిలోనే రచించిన అనుభవముంది. అటు తర్వాత కొన్నేళ్లకే కవితా వ్యాసంగం. ఏడో తరగతిలో పాఠశాల ప్రథమురాలు. అనంతరం కొవ్వూరులోనే ఉన్నత తరగతుల విద్యాభ్యాసం. మొదటి అష్టావధాన ప్రోత్సాహకులు, గురువులను నేటికీ తలచుకుని నమస్సుమాలు సమర్పిస్తుంటారు బాలభాను. తిరుపతిలోని రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠం, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ చదువులు భాష, సాహిత్యం, సంస్కృతి, అవధాన విద్యల పరంగా తన ఉత్సుకతను ఎంతెంతో విస్తరించాయని చెబుతుంటారు. తొలి శత, ద్విశత అవధానాలను సైతం కొవ్వూరు గాయత్రీ సేవాసంఘంవారు నిర్వహించారని కృతజ్ఞత ప్రకటిస్తుంటారు.

ఒక సందర్భంలో ఎదురైన 'సమస్య'

ఒకరా ఇద్దర ముగ్గురా నలుగురా ఉన్నారలందెందరో! ఇదీ 'అవధాన వాగ్వైభవి' పూరణ:

'వికసింపన్ నవపద్యపుష్పములహా! వేవేలు వాగ్ధారలై
వికచాంభోరుహ నేత్రభారతికి నైవేద్యంబులీకైతలే
మకుటుంబీయవధాని సంతతియు సమ్మానంబు చేకూర్పగా
ఒకరా! ఇద్దర! ముగ్గురా! నలుగురా! ఉన్నారలందెందరో'

వేరొక వేదికమీద ఎదురైన అంశం:

రామాయణార్థంలో 'భీష్మ, ద్రోణ, కర్ణ, కృప' సమస్యను...

'కర్ణమందున కైకమాటలు ఖంగుమంచును మ్రోగగా,
జీర్ణమయ్యెడు నాశలన్నియు చింతయున్; కృష్ణలేద, సం
పూర్ణమైనవ భీష్మవాంఛలు పో, యటంచును రాజు దుఃఖార్ణవంబను ద్రోణమందున క్రాగె రాముని పోకుచే' అని పూరించారు 'శతావధాన శ్యమంతకమణి'

అనేకానేక ప్రాంతాల్లోని వేదికలమీద, అంతర్జాలం మాధ్యమంగానూ అవధాన పరంపర సాగిస్తున్న బాలభాను

'మరణము మెచ్చి కొగిటిక మాంతము
చేర్చెను!' అనే సమస్యను
'సరస మనోజ్ఞ రూపయగు సాధ్వియు
భర్తను వెంటనంటి తా
తీరముగనేగి యుద్ధమున తీవ్రముగా
తన వాడి బాణముల్
నరకుని పైనవైచి తన నందను
కూల్చిన భూమి సత్యభా
మరణము మెచ్చి కొగిటికమాంతము
చేర్చెను కృష్ణుడర్మిలిన్'

ఆన్‌లైన్‌లో సంచాలక బాధ్యతలనూ వహించారు. పద్యాలతో పాటు కవితలు, వ్యాసాలు, ఇతర ప్రక్రియల్లో కూడా రాశారు, రాస్తున్నారు. వందరకాల ఛందస్సులలో రాసిన ఘనత తనది. రాసిన వృత్తాన్ని తిరిగి రాయకుండా శతపద్య రచన చేశారు. తాను రాయడంతోపాటు తన విద్యార్థులతో వంద వృత్తాలు రాయించి ఆవిష్కరించారు. తన పిల్లలతోనూ పలు పాదాలు రచింపచేశారు. నేర్చిన విద్యను అందరికీ నేర్పాలన్న హితాభిలాషతో సేవా పథాన ముందు కెళ్తున్నారీ అవధాన సరస్వతి. నారీహృదయం, శతపత్ర సౌరభం, ద్విశత పద్య పరిమళం – మరెన్నో రచనలు ఆమె కలం నుంచి పుస్తక రూపాలుగా వెలువడ్డాయి. తన పేరుతోనే 'బాలభాను శతకం' ముద్రితం కావాల్సి ఉంది.

సాహితీరంగంలోని సంక్లిష్ట సమస్యలను అలవోకగా పూరించడమే కదా అవధానమంటే! తెలుగుభాషకు మాత్రమే ప్రత్యేకమైన, విలక్షణమైన ఆభరణం. పాండితీ ప్రకర్ష, ఆశుకవితాశక్తి, ధారణపటిమ, సందర్భోచిత అంశాల సమాహారమే అవధాన విద్య. శాస్త్రం, కళ, విజ్ఞానం, వికాసం, ఒకే సమయంలో తెలుగు, సంస్కృత ప్రతిభను ప్రదర్శించడం ఎంతటి మహిమాన్వితం! క్లిష్టత నిండిన ఒక సందర్భాన్ని ఎంత సులువుగా విపులీకరించారో చూద్దాం.

'మరణము మెచ్చి కొగిటిక మాంతము చేర్చెను!' అనే సమస్యను
'సరస మనోజ్ఞ రూపయగు సాధ్వియు భర్తను వెంటనంటి తా
తీరముగనేగి యుద్ధమున తీవ్రముగా తన వాడి బాణముల్
నరకుని పైనవైచి తన నందను కూల్చిన భూమి సత్యభా
మరణము మెచ్చి కొగిటికమాంతము చేర్చెను కృష్ణుడర్మిలిన్' అని పూరించారు. ఇటువంటి విన్యాసాలతో, పద చమత్కృతితో, సమయోచిత వర్ణలతో 'అవధాన మయూరి'గా పేరు పొందారు ఆకెళ్ల బాలభాను. ఈమె 200వ అవధాన వేదిక అమెరికాలోని న్యూజెర్సీ ప్రాంతం. ఇంకా ఎడిసిన్, బ్రిడ్జివాటర్, మోర్గన్‌విల్, తదితరాల్లోని ఆలయ ప్రాంగణాల్లో అవధానాలనేకాక ఉపన్యాసాలనూ అందించిన అపార ప్రజ్ఞాశాలి.

టెక్సాస్ వేదికగా చేసిన ప్రసంగ అంశాలు: తెలుగుసాహిత్యం తీరు తెన్నులు, అవధాన విద్య ఆవిర్భావ వికాసాలు, రానున్న తరాలపై తెలుగు ప్రభావం, ఇంకా ఎన్నెన్నో. మకుటాయమానంగా ఏర్పాటైన పంచ సహస్రావధాని మేడసాని మోహన్ నాడు ఫిలడెల్ఫియా నగరంలో చేసిన అవధానికి సభాధ్యక్షులు బాలభాను!

కావ్యపాఠం, కవిత్వం, శాస్త్రార్థం, వ్యస్తాక్షరి, మరెన్నో నిండి ఉంటేనే అవధానం. సమగ్ర ఏకాగ్రతకు మారురూపం. సహజత్వం, సృజనాత్మకత కలగలిసిన అపూర్వ ప్రక్రియారాజం. ధైర్యం, ధోరణి, ధారణలతో సంపూర్ణ మిళితం. భాషానైపుణ్యం, వ్యాకరణ పరిజ్ఞానం, కావ్య – ప్రబంధ– ఇతిహాస– పురాణ ప్రావీణ్యం అవధానంలోని అంతర్భాగాలు. వీటన్నింటినీ పుణికి పుచ్చుకున్నారీ మహిళావధాని.

ప్రత్యేకించి ప్రస్తావించాల్సిన పుస్తకం 'నారీ హృదయం'. ప్రయోగపూర్వక మనో ఆవిష్కరణ. ఆరంభం నుంచి ముగింపు వరకు నారి మానసంలోని వివిధ భావోద్వేగాల నిలుపుటద్దం. ఆలోచనల, అనుభవాల, అనురాగాల సమా హారం. భానుకిరణ ప్రసరణం. స్త్రీని స్త్రీగానే చూడాలన్న దృక్పథ విస్తరణకు అక్షరరూపం.

అష్టావధాని, ప్రథమ మహిళా శతావధాని ఇప్పటికే ఏకైక వనితా ద్విశతావధానిగా వెలుగొందుతున్న ఆకెళ్ల బాలభానును పెద్దలు పోచనపెద్దివారు అభినందించినట్లు –

'భారతీదేవి కృపతోడ బాలభాను
పలుకులందున వసిడిని పంచిపెట్టి
వెలుగునందించె నవధాన విద్యనిపుడు
శతశతాధిక వర్షాలు జయము జయము'
మహిళ వ్యక్తి కాదు... శక్తి!

★

శంకరాభరణము

ప్రతి సోమవారం 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' దినపత్రికలో రచయిత్రి రేణుకా నారాయణన్ 'Faith line' శీర్షికతో మన పురాణ, సంస్కృతి, సంప్రదాయం కథలు రాస్తుంటారు. మార్చి మూడవ తేదీన ప్రచురితమైన కథ పాఠకులతో పంచుకోవాలనే కుతూహలంతో ఆమె రాసినట్టు అనిపిస్తుంది. రేణుకా నారాయణ్ రచనాశైలి ఎంతో విపులంగా, ఆ కాలపు రాజులు, నాయకులు, పండితుల విశేషాలతో, చారిత్రక ఆధారాలతోనూ ఉంటుంది. మనసుకు హత్తుకుపోయే శైలి ఆమెది.

సంగీతంలోని శంకరాభరణం రాగం శంకర భగవానుల ఆభరణం వంటిది.

1800 సంవత్సర ప్రాంతంలో నరసయ్యర్ అనే ప్రసిద్ధ సంగీత విద్వాంసుడు తంజావూరు రాజు 'రాజా సర్‌ఫోజీ' ఆస్థానంలోని సంగీత సభలో 'శంకరా భరణం' రాగం అద్భుతంగా పాడి రక్తి కట్టించడంతో ఆ రాజు ఆ పండితుడిని 'శంకరా భరణం నరసయ్యర్' అని ప్రస్తుతించాడు. అప్పటి నుంచి ఆయన 'శంకరాభరణం నరసయ్యర్'గా ప్రసిద్ధి పొందాడు.

ఒకసారి నరసయ్యర్‌గారి ఆర్థిక పరిస్థితి దెబ్బతిని 80 బంగారు నాణేలు అప్పుకోసం కావేరీ డెల్టాలో ఉండే 'కపిలస్థల' అనే ప్రాంత జమిందారు 'రామచంద్ర మూపనార్' వద్దకు వెళ్లి అప్పు కోసం ప్రార్థిస్తాడు. మూపనార్ మంచి సంస్కారం, సద్బుద్ధి, సంగీతం పట్ల ఎంతో అభిమానం, అభిరుచి కలిగినవాడే కానీ కాస్త గర్విష్ఠి, అహంకారి. అప్పు ఇవ్వటానికి ఒప్పుకున్నాడు. కాని బదులుగా ధరావతు కోరతాడు. అప్పుడు నర్సయ్యర్ తన పరిస్థితి వివరించి తనకున్న ఆస్తి 'శంకరాభరణ' రాగమేనని, ఆ రాగాన్ని, ఆ బిరుదును మూపనార్‌వద్ద కుదువబెట్టుకుని అప్పు ఇవ్వమని కోరగా, మూపనార్ సరేనని అప్పు ఇస్తాడు. తాను అప్పు తీర్చేదాకా ఆ రాగం తానెక్కడా గానం చేయనని వాగ్దానం చేసి మూపనార్‌కు ప్రామిసరీనోటు రాసి ఇచ్చి వెళతాడు.

ఇది జరిగిన కొన్ని రోజులకు ఈస్టిండియా కంపెనీలోని పెద్ద ఉద్యోగి 'అప్పరాయ' ఒక సంగీత సభ ఏర్పాటుచేసి నరసయ్యర్‌ను సకల మర్యాదలతో ఆహ్వానించి తన సభలో 'శంకరాభరణం' గానం చేయవలసిందిగా కోరితే నరసయ్యర్ తాను ఆ రాగాన్ని మూపనార్ వద్ద కుదువబెట్టి అవసరానికి 80 బంగారు నాణేలు తీసుకున్నానని, ఇంకా అప్పు చెల్లించలేదు కనుక తానా రాగం ఆలపించలేనని విన్నవించుకుంటాడు. వెంటనే 'అప్పరాయ' తన క్రింది ఉద్యోగులతో 80 బంగారు నాణేలు మూపనార్‌కు ఇచ్చి 'శంకరాభరణము'ను విడిపించుకు రావలసిందిగా పంపుతాడు. మూపనార్ విషయం విని ఆ బంగారు నాణేలు సహా అప్పరాయ వద్దకు వచ్చి నాణేలను అప్పరాయకు తిరిగి ఇచ్చి నరసయ్యర్‌ను ఎంతో గౌరవించి, డబ్బు కన్నా సాంస్కృతిక హక్కు గొప్పది అంటూ శ్లాఘిస్తాడు.

ఇదంతా చూసి నరసయ్యర్ ఆలోచనలో పడతాడు. ముఖ్యంగా 'శంకరా భరణం'ను కుదువ బెట్టే హక్కు తనకేముందని, అదేమన్నా తన స్వంతమా అని పశ్చాత్తాప పడతాడు. అది అసలే సంగీతంలో శంకరుని ఆభరణము వంటిది. శంకరాభరణానికున్న సాంస్కృతిక హక్కును తాను అతిక్రమించి, దుర్వినియోగం చేశానని పశ్చాత్తాపంతోనే సభలో మాత్రం 'శంకరాభరణము'ను ఎంతో శ్రద్ధతో ఘనంగా ఆలాపిస్తాడు. అది విని అప్పరాయ, ఆయన సభలోని సభ్యులు నరసయ్యర్‌కు ఎంతో విలువైన బంగారు నాణేలు, హస్తాభరణాలు తదితరాలను బహూకరిస్తారు. కాని నరసయ్యర్ మాత్రం శంకరాభరణం తన స్వంతం కాదు కనుక కుదువబెట్టే హక్కు తనకు లేకపోయినా తన నుంచి జరిగిన అపరాధానికి బాధపడుతూ ఆ బహుమానాలేవీ తీసుకోకుండా తన సంగీత జ్ఞానాన్ని ఇంకా అభివృద్ధి చేసుకోవలసి ఉందని, సంగీతానికీ, దేవాలయాలకూ ప్రసిద్ధి పొందిన 'కోవలూరు' అనే ఊరు వెళతాడు.

పూర్వం ఒకసారి సుప్రసిద్ధ సంగీత విద్వాంసుడు ముత్తు స్వామి దీక్షితార్ తాను రచించిన ఒక కీర్తనను నెత్తిన పెట్టుకుని కోవలూరులోని శివాలయానికి నడిచి వెళ్లి, తన కీర్తనను శివుడికి వినిపించటానికి వచ్చానని, అనుమతించాలని పూజారిని కోరతాడు. అప్పటికే మధ్యాహ్న సమయం కావటంతో పూజారి గుడి తలుపులు మూస్తూ విసుగుగా 'దేవుడెక్కడికి పోతాడు? మళ్లా సాయంత్రం తలుపులు తీశాక వినిపించుదువులే' అని వెళ్లిపోతాడు. దీక్షితార్ మాత్రం అక్కడే కూచుని గుడి తలుపులు చూస్తూ తాను రచించి తెచ్చిన కీర్తనను భక్తితో ఆనందంగా మధురంగా గానం చేయటం మొదలుపెడతాడు.

ఆ కీర్తనలో ఆయన సృష్టి రహస్యం, జీవరాశుల ఉత్పత్తి, పెరుగుదల, మళ్లీ అంతా లయం కావటం సహా అన్ని విషయాలు ఎంతో విపులంగా మధురంగా గానం చేస్తుంటే ఊళ్లోని ప్రజలు, పండితులు వచ్చి ఆ గాన మాధుర్యాన్ని ఆస్వాదిస్తూ తమ తమ ఈతి బాధలన్నీ మరిచిపోతుంటారు. ఇంతలోనే అకస్మాత్తుగా దేవాలయ ద్వారాలు తెరుచుకుంటాయి. వెనుక ఉండి ఇదంతా గమనిస్తున్న పూజారి పశ్చాత్తాపంతో దీక్షితార్ గారి కాళ్లమీద పడి క్షమించమని వేడుకుంటాడు. అటువంటి ప్రసిద్ధి చెందిన కోవలూరు శివాలయం ఆవరణలో గుడికి ఒక మూల కూచుని నరసయ్యర్ భగవంతుని, శంకరాభరణ రాగాన్ని గానం చేస్తుంటాడు. అప్పుడు ఆయనకు బ్రహ్మాండ పురాణంలో నారదుడు ఒకసారి 'భద్రగిరి' 'హోసూరు'లో శంకరాభరణంతో శివుడిని స్తుతిస్తే శంకరుడు ఆనందించి మెచ్చుకొని తన లీలలు నారదుడికి తెలియజేశాడనే కథ జ్ఞాపకం వస్తుంది. ఇక్కడి ప్రజల భక్తి విశ్వాసాలు, సంగీతాభిరుచినీ తలుచుకుంటూ నరసయ్యర్ తన విషాదం మరిచిపోయి స్వస్థలానికివెళ్తాడు.

చివరగా రచయిత్రి ఈ ప్రపంచం ఎంతో విశాలమైంది. ఎంతమందో అసంఖ్యాకమైన విద్వాంసులు, పండితులు, జ్ఞానులు వస్తుంటారు, పోతుంటారు కానీ సంగీత ప్రపంచం, జ్ఞానం మాత్రం శాశ్వతంగా, స్థిరంగానే ఉండిపోతుంది అని ముగిస్తుంది. రచయిత్రి రేణుకా నారాయణ్‌గారంత సహజంగా రాయలేకపో యినా విషయం పాఠకులు తెలుసుకుని ఆనందిస్తారనే భావనతోనే ఈ రచన.

అటువంటి గొప్ప సంస్కృతీ సాంప్రదాయాలు కలిగి ఉన్న దేశంలో జన్మించగలగటమే ఒక మహాదృష్టం, పూర్వజన్మ పుణ్యఫలం అనుకుని వాటిని పునరుద్ధరించుకునే ప్రయత్నం చేయటం మనందరి ధర్మమూ, కర్తవ్యమూను. ★

'ఇందుగలడందులేడని సందేహం వలదు' అని ప్రహ్లాదుడితో పోతనామాత్యుడు పలికించినది శ్రీపతికే కాదు ఆయన పత్ని శ్రీమహాలక్ష్మికే అన్వయిస్తుంది. ఆమె ఐశ్వర్యానికి అధిష్ఠాన దేవత కానీ..ధనరూపంలోనే ఉండదు. మానవ జీవితంలో ఆనందమయ ప్రతి క్షణం ఆమె అనుగ్రహమే. సంపదగల వారంతా ఆనందంగా జీవించగలుగు తున్నారా? అని ప్రశ్నించుకుంటే లక్ష్మీ 'కటాక్షం' తత్వం అర్థమవు తుంది. అలాంటి మహిమాన్వితమైన తల్లిని సౌమాంగల్యం, సత్సంతానాభివృద్ధి కోసం శ్రావణ మాసంలో వరలక్ష్మిగా ఆరాధిస్తారు. వివాహితులు తమ వైవాహిక జీవితం సవ్యంగా సాగాలని, కొత్తగా వివాహమైన వారు దీర్ఘ సౌభాగ్యం కోసం, అవివాహితులు ఉత్తమ భర్త కోసం ఈ వ్రతాన్ని ఆచరిస్తారు.

'వర' ప్రదాయినికి హృదయాంజలి

అమృతం కోసం దేవదానవులు పాలకడలిని చిలికిన వేళ చక్కదనాల కుప్పగా శుక్రవారం అవతరించిన అమ్మవారిని విష్ణుపురాణం 'విశ్వమాత'గా అభివర్ణించింది. దారిద్ర్యం నుంచి సంపదపైపు, అజ్ఞాన తిమిరం నుంచి విజ్ఞానం దిశగా నడిపించే దివ్యశక్తి. సత్సంకల్పంతో అడిగే ఏ కోరికనైనా అనుగ్రహించే తల్లి కనుక మహాలక్ష్మి 'వర'లక్ష్మిగా, భక్త హృదయవాసినిగా నిలిచిన భక్త పరాధీన. ముఖ్యంగా శ్రావణంలో ప్రత్యేక పూజలు అందుకుంటోంది. ఈ మాసంలో పూర్ణిమకు ముందు వచ్చే శుక్రవారం నాడు వరలక్ష్మీ వ్రతం ఆచరించాలని 'వ్రతరత్నాకరం' చెబుతోంది. అవకాశం లేనివారు ఈ మాసంలోనే ఇతర శుక్రవారంనాడు వ్రతం ఆచరించవచ్చని పెద్దలు ప్రత్యామ్నాయం సూచించారు. అయితే, ఇక్కడ పూజకు, వ్రతానికి వ్యత్యాసాన్ని పేర్కొంటారు. 'వరలక్ష్మిని ఒక్కసారి పూజించడమే కాదు... జీవితాంతం ఆచరిస్తూనే ఉంటాను' అని తొలిపూజ నాడు చేసే ప్రమాణం కారణంగానే వరలక్ష్మీ 'పూజ' వరలక్ష్మీ 'వ్రతం'గా మారిందని చెబుతారు.

'లోకంలో పరమపావనమైన వ్రతం ఏది?' అన్న జగన్మాత పార్వతీదేవికి మహాదేవుడు దీనిని ఉపదేశించారని, ఆమె మొట్టమొదటిసారిగా వరలక్ష్మి వ్రతం ఆచరించి నవరత్న ఖచితమైన లంకానగరాన్ని సంపదగా పొందిందని భవిష్యోత్తర పురాణం పేర్కొంటోంది. చారుమతిదేవి అనే వనిత అమ్మవారిని కొలిచి, ఆమె అనుగ్రహం పొందినట్లు కథనం. ఆ గాథ ప్రకారం... మగధదేశంలోని కుండిన నగరానికి చెందిన చారుమతి తన కలలో లక్ష్మీదేవి చేసిన ఉపదేశం మేరకు తోటి ముత్తయిదువులతో కలసి శ్రద్ధాభక్తులతో ఆమెను పూజించి, ఆత్మప్రదక్షిణకు ఉపక్రమించింది. మూడు ప్రదక్షిణలకుగాను వారికి వరుసగా, బంగారు గజ్జెలు, హస్తకంకణాలు సహా సర్వాభరణాలూ లభించాయట. అలా అడగకుండానే ఐశ్వర్యాన్ని ప్రసాదించిన 'అమ్మ'ను నిరంతరం పూజించాలన్న ఆకాంక్షే 'వ్రతం'గా మారిందనీ అంటారు. త్రిమాతలు-లక్ష్మీ, సరస్వతి, పార్వతి.. సంపద, వాక్కు, మంగళానికి అధిష్ఠాన దేవతలు. ఈ ముగ్గురూ విడదీయలేని శక్తులుగా ఉంటారని, కనుకనే, వాణీపార్వతుల అధీనంలోని అంశాలు లక్ష్మీదేవిలో ఉమ్మడిగా కనిపిస్తాయని మహర్షుల ఉపదేశం.

డా॥ ఆరవల్లి జగన్నాథస్వామి
సీనియర్ జర్నలిస్ట్

శ్రీమహావిష్ణువు మాదిరిగా మహాలక్ష్మికీ సహస్ర నామ పారాయణం ప్రసిద్ధం. వారిది అవినాభావ సంబంధం. అమ్మవారు వాక్కు అయితే, అయ్యవారు భావం. అమె సంతోషం అయితే, ఆయన సంతృప్తి, ఆమె కాంతి అయితే, ఆయన చంద్రుడు. ఆమె ధర్మపరత్వమైతే ఆయన ధర్మం. 'అలాంటి విడదీయరాని బాంధవ్యం గల ఆదిదంపతుల అర్చనం ద్వారా మోక్షప్రాప్తి కలుగుతుంది. వైకుంఠం అంటేనే మోక్షం. అక్కడి ద్వారం మోక్షద్వారం. అందుకే అక్కడ అమ్మవారు 'మోక్షలక్ష్మి'గా అని పెద్దలు చెబుతారు. అంటే జననం నుంచి కడవరకు ప్రతి దశలో 'అమ్మ' కృపాకటాక్షాలు వెన్నంటే ఉంటాయని భావం.

లక్ష్మీ కేవలం ధన రూపం లోనే కాదు- ప్రకృతిలో, మానవ నడవడిలో, వస్తువులలో... ఇక్కడ అక్కడని కాదు... మంగళకరమైన ప్రతిచోట నెలవై ఉంటుంది. లోగిళ్లు, సౌమ్యం, విచక్షణ, దాన ధర్మాలు, విజ్ఞానం, పాండిత్యం, సన్మాన సత్కారాలు, క్రమశిక్షణ, అంకితభావం, సమయ పాలన.. ఇలా ఎన్నో విశిష్ట లక్షణాలు శ్రీదేవి స్వరూపాలేనట.

వ్రతవిధానం

సర్వసంపదలకు, సర్వసౌభాగ్యహేతువైన వరలక్ష్మి వ్రతం అమ్మవారి ధ్యాన ఆవాహనాలతో ప్రారంభమై షోడశోపచార పూజ, అంగపూజ, అష్టోత్తరశత (సహస్ర) నామాలతో కొనసాగి, వ్రతకథతో పరిసమాప్తమవుతుంది. ఇది వ్రతం కనుక శాశ్వత విగ్రహం కాకుండా, పాత్ర (బిందె/కలశం)మీద కొబ్బరికాయను పెట్టి, ఆసీనురాలైన అమ్మవారి ప్రతిమను సిద్ధం చేసుకోవాలి. గణపతి / విష్వక్సేనులను పంచోపచారాలతో (స్నానం, అర్చన, నైవేద్యం, ప్రదక్షిణం, నమస్కారం) అర్చించి, అమ్మవారిని ఆ కలశంలోకి విధివిధానాలతో అవాహనం చేస్తారు. ఈ సందర్భంలో సప్తమాతృకలను పూజిస్తూ (కౌమారి పూజ)వారిలో ఒకరైన స్కందమాతను ప్రధానంగా అర్చిస్తారు. వ్రతకర్తలు ముత్తయిదువులకు...

'ఇందిరా ప్రతిగృహ్ణాతి ఇందిరా వై దదాతి చ!
ఇందిరా తారికా ద్వాభ్యామ్ ఇందిరాయై నమో నమః'

(తోటి ముత్తయిదువా! ఈ వ్రత పరిసమాప్తితో మనిద్దరం లక్ష్ములమే. మనందరిలోనూ, మన చేతి తోరాల్లోనూ లక్ష్మి ఉందని గ్రహించాను. లక్ష్మీ స్వరూపిణీవై దీనిని స్వీకరించు) అని వాయనం ఇస్తారు. ఆషాఢంలో పుట్టినింట ఉండే నవవధువులు శ్రావణం ప్రవేశించాక, మొదటి మంగళవారం నోము పుట్టింటనే జరుపుకుని మెట్టినింటికి చేరి, అక్కడ వరలక్ష్మి వ్రతం జరుపుకోవడం ఆచారంగా వస్తోంది. ఈ మాసంలో ఉదయం, సాయంత్రం దీపారాధన చేస్తే దీర్ఘసుమంగళీ యోగం, అష్టైశ్వర్యాలు లభిస్తాయని విశ్వసిస్తారు. ★

డా. నాగసూరి వేణుగోపాల్

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత!

దగాపడిన బక్క జీవి న్యాయం కోసం రాజుగారి దివాణం ముందు ధర్మగంటను మోగించలేక మోగించే వాడని చందమామ కథలలో చదువుకున్నాం! మరి ఇప్పుడో? అన్యాయానికి గురైన క్రూరమృగం ఏమి చేస్తుంది?? ఫిబ్రవరి 8, 2023న ఘజియాబాద్ కోర్టు మొదటి అంతస్తులోకి ప్రవేశించిన చిరుతపులి కొందరు లాయర్లనూ, ఓ పోలీసునూ, మరో వ్యక్తినీ గాయపరిచిందని సమాచారం. మరణాలు నమోదు కాలేదు గానీ అటవీ శాఖాధికారులు దానికి ప్రమాదం లేకుండా మత్తుమందులిచ్చి తీసుకువెళ్లారని తర్వాత వార్త. చిత్తూరు సమీపంలో ఉండే పలమనేరు, కుప్పం వంటి ప్రాంతాలలో ఏనుగులు అప్పుడప్పుడు పొలాల మీద పడి తీవ్ర నష్టం చేస్తుంటాయని మనకు తెలుసు. తిరుమల కొండలలోనే కాదు, విశాఖపట్నం పరిసరాలలో ఎదురుపడిన పులుల గురించి వార్తలు వస్తుంటాయి.

అస్సాంలో కాజీరంగా నేషనల్ పార్క్ ప్రాంతంలో శాకాహారులైన ఏనుగులు కొన్ని సందర్భాలలో మనుషులను లాగి, గాలిలోకి విసరడం, ఎత్తి పడేసి చంపడం, చంపి కొన్ని దేహపు భాగాలను తినడం వంటి వార్తలు పాతికేళ్ల క్రితమే చూశాం. మందపు చర్మం గల జంతువులలో కొన్ని ఖనిజ ధాతువులు లోపిస్తే ఇలాంటి విపరీత పోకడలు వస్తాయని అప్పటికి లభించిన వివరణ! లోతుకెళితే నదుల కాలుష్యం వగైరా విషయాలు తారసపడి చివరికి మనిషి దగ్గర ఆగుతాయి!

భరత్‌పూర్ నేషనల్ పార్కులో 1980 దశకంలో ఉన్న రెండువేల రాబందులు రెండు దశాబ్దాలలో నాలుగింటికి తగ్గిపోయాయని ఆ మధ్య లభించిన లెక్కలు! రాబందుల గూళ్లు ఒంటరి అంకె సంఖ్యకు మారాయని కూడా అప్పటి వార్తలు. దీనికి కారణం పెరిగిన క్రిమిసంహారకాలేనని అప్పటి సమాచారం!



ప్లాస్టిక్ గుప్పిట్లో భూగోళం
రచన: ప్రొ. దుగ్గిరాల రాజకిశోర్
ప్రతులకు : రచయిత
సెల్: 8008264690, 9963782445
సాహిత్యనికేన్– హైదరాబాద్
ఫోన్ : 040-27562363
సాహిత్యనికేన్– విజయవాడ
ఫోన్ : 0866-6667421
పుటలు : 276, వెల: ₹.300 ($15)

ఇలా ఏది చూచినా ఒక మహావ్యధే! ప్రకృతిలో రకరకాల కారణాలతో జోక్యం చేసుకుంటున్న మనిషి తాత్కాలిక విజయం సాధించినా, దీర్ఘకాలికంగా పరాజితుడే అనే అభిప్రాయం తరచూ కలుగుతోంది! కనుకనే కొందరు 'పొల్యూటింగ్ టెక్నాలజీ' అని సాంకేతిక శాస్త్రానికి విశేషణం తగిలించి విమర్శిస్తే; వాణిజ్య వర్గాల పెంపుడు చిలుకలైన మేధావులు వాటినే 'టెర్మినేటర్స్ ఆఫ్ టెక్నాలజీ'లని తెగనాడుతున్నారు. వాణిజ్య రూపంలో సంచరించే మాయావి బుట్టలో రాజకీయనాయకుడు కీలుబొమ్మై మరింత ప్రకృతి హననానికి పచ్చజెండా అధికారికంగా ఊపుతున్నాడు! "దీనికి విరుగుడు ఏమిటి? ఎక్కడ??" అన్నమాట అలా ఉంచితే; అసలు ఏ స్థాయిలో పరిసరాలూ, ప్రకృతి నాశనం అవుతున్నాయో ఎలా తెలుస్తుంది? ఎవరు వివరించాలి? ఎవరికి పట్టాలి ఈ విషయాలు?

రెండవ ప్రపంచయుద్ధం తర్వాత జరిగిన పరిణామాలు ఆయా దేశాలలో ఒకటిన్నర, రెండు దశాబ్దాలకు కానీ తెలియరాలేదు. ఆ యుద్ధంలో వాడిన అణ్వస్త్రాలకు బలైన సమాజాలు క్రమంగా సంఘటితమై ప్రపంచ స్థాయిలో దిద్దుబాటు కార్యక్రమాలు మొదలుపెట్టాలని తలచాయి. అందులో తొలి అడుగు జూన్ 5,1972న స్టాక్‌హోంలో మొదలైన తొలి ప్రపంచ పర్యావరణ సమావేశాలు. ఆ తేదీనే నేడు 'ప్రపంచ పర్యావరణ దినోత్సవం' అంటున్నాం. ఆ సందర్భంలోనే 'ఎన్విరాన్మెంట్' అనే పదమూ, భావన మొదలైంది. దీని తర్వాత జరిగిన, జరుగుతున్న సదస్సులు, రాజకీయాలు, వినాశనం మీకు తెలిసిందే! తెలియకపోతే తెలుసుకుందాం!

ఊపిరి కొనసాగడానికి కాస్త ఆక్సిజనూ; పొట్ట ఆకలి తీరడానికి కొంచెం ఆహారం; తలదాచుకునేందుకు చిన్న ఆసరా.. ఇలాంటి అవసరాలు తీరడానికి ప్రకృతి ఉంది కానీ; మనిషి అత్యాశలు, దురాశలు తీర్చడానికి కాదు! గ్రామీణ ప్రాంతాలు, రైతులు, వ్యవసాయం, పశుసంపద, ఆకలి, కరవు ఇలాంటి విషయాలతో పాటు జనాభా పెరుగుతున్న తీరు తెలిసిన గాంధీజీ సుమారు శతాబ్దం క్రితం చేసిన సూత్రీకరణ అది! ఇందులో ధనిక దేశాల రుబాబు, భారతీయ సంస్కృతి, ఆర్థికప్రణాళిక, హేతుబద్ధమైన ఆలోచనలు అంతర్గతంగా దాగి ఉన్నాయి. వీటిని వివరించి సిద్ధాంతీకరించిన స్వాతంత్ర్య సమరయోధులు జె.సి.కుమారప్ప. మన దేశపు తొలి పర్యావరణ పోరాట శీలి. వీరి రచనలు ఏ మాత్రం పరిశీలించినా ఈ విషయాలు మనకు సులువుగా బోధపడుతాయి. ప్రస్తుత కాలంలో కూడా ప్రపంచవ్యాప్తంగా ఏ పర్యావరణ సదస్సు జరిగినా 'ప్రకృతి అనేది మనిషి అవసరాలు తీర్చడానికే కానీ, దురాశ తీర్చడానికి కాదు' అనే మాటలు కీలకంగా ఉంటున్నాయి. కుమారప్ప, మీరాబెన్, సరళాబెన్ ఈ ముగ్గురు వ్యక్తులు మనదేశంలో ఈ దిశగా చాలా కృషి చేశారు. అందువల్లనే ఐదు దశాబ్దాల క్రితం 'చిప్ కో ఉద్యమం'తో మొదలైన పర్యావరణ పోరాటాలు అంతర్జాతీయ ఉద్యమాలతో సంబంధం లేకుండా సాగాయి.

రెండో ప్రపంచ యుద్ధానంతరమే 'సైన్స్ జర్నలిజం' విడిగా రూపొంది, వృద్ధి చెందింది. అందులో భాగమే పర్యావరణానికి సంబంధించిన సమాచారం, విశ్లేషణ, రచనలు! పర్యావరణం లేదా ఎన్విరాన్‌మెంట్ వంటి మాటలు 1972 నుంచి చెలామణిలోకి వచ్చినా అంతకుముందే ఈ సమస్య గురించి ప్రఖ్యాత సంపాదకులు నార్ల వెంకటేశ్వర రావు కొన్ని వ్యాసాలను డా॥ టి.శివాజీరావుతో రాయించి, వాటికి 'విషావరణం' అనే శీర్షిక వాడారు.

అయితే, అదే సమయంలో సైన్స్ వ్యాసాలూ, రచనలూ తక్కువగా వెలువడినపుడు; పర్యావరణానికి సంబంధించి తెలుగులో విశేషంగా రచనలు, వ్యాసాలు వెలువరించే ప్రయత్నాలు జరుగలేదు. కానీ

1999-2000 కాలంలో ఒక రెండు సంవత్సరాలపాటు 'వార్త' ఆదివారం సంచికలో 'ప్రకృతి-వికృతి' పేరున పర్యావరణానికి సంబంధించి తొలి పర్యావరణ శీర్షికను నేను (నాగసూరి వేణుగోపాల్) నిర్వహించాను. ఆ వ్యాసాలు పుస్తకాలుగా వచ్చాయి. కానీ నా వ్యాసాలు కూడా నిరంతరం వెలువడలేదు. కొందరు ప్రయత్నించారు, విద్యార్థులకు దోహదపడే వాచకాలు వంటి రచనలు కొన్ని వచ్చాయి. తెలుగులో 1991-2010 మధ్యకాలంలో వెలువడిన కథాసాహిత్యం నుంచి 20 పర్యావరణ కథలు 'కథావరణం' పేరున విహారి, నాగసూరి వేణుగోపాల్ సంపాదకులుగా 2013లో సంకలనంగా ప్రచురించడం జరిగింది.

'ప్లాస్టిక్ గుప్పిట్లో భూగోళం' పేరిట మిత్రులు ప్రొఫెసర్ దుగ్గిరాల రాజకిశోర్ వెలువరించిన తెలుగు పుస్తకంలో 38 వ్యాసాలను తొమ్మిది విభాగాలలో అమర్చారు. మంచి అధ్యయన ఫలితంగా రాసిన ఈ రచనను చదివితే ప్లాస్టిక్ మహమ్మారి ఎంత లాఘవంగా మొత్తం మానవజాతిని తన బానిసగా మార్చుకున్నదో ఎంతో కొంత బోధపడుతుంది. ఈ మొత్తం సమస్య కేవలం ఆరేడు దశాబ్దాలలో దాపురించింది. ఈ విషయాలను, వాటి విస్తృతిని పలు ఉదాహరణలతో, విపులంగా రాజకిశోర్ మన ముందుబెట్టారు. ఇటువంటి రచన చదవడం ప్రారంభించగానే వెన్నులో వణుకు పుట్టాలి బాధ్యతగల చదువరికి. అది కనువిప్పు కలిగించి కర్తవ్యోన్ముఖుణ్ణి చేయాలి! ఆ పాఠకుడి స్థాయిని బట్టి అది ఉంటుంది కానీ, రాజకిశోర్ శక్తి వంచన లేకుండా కృషి చేశారనడంలో సందేహం లేదు.

ఇక సమాచార వర్గీకరణ, శైలి గురించి ప్రత్యేకంగా చెప్పాలి. నిజానికి ఇలాంటి రచనలు చేయడం కొంచెం కష్టంతో కూడుకున్న పనే! పాఠకులకు విసుగు కలిగించకుండా కలం నడవాలి. దానికోసమే విభాగాల, అధ్యాయాల విభజన ఉంటుంది. 'సౌలభ్యం వెనుక పెను చీకటి' వంటి మాటలు అక్కడక్కడ తారసపడి ఆనందం కలిగిస్తాయి.

భయం గొల్పించి, కనువిప్పు కలిగించే రచనలలో పరిష్కారాలు సూచించక పోతే అవి అసంపూర్ణ రచనలే అవుతాయి. చివరి 15 అధ్యాయాలు ఈ విషయాలనే వివరంగా చర్చిస్తాయి. వీటిని అశావహంగా జాగ్రత్తగా చదవాలి. ముందు ముందు ఈ విషయాలలో మరిన్ని పరిశోధనలు సాధ్యమై మనకు దారిచూపుతాయి!

పర్యావరణానికి సంబంధించి మంచి రచన చేసిన రాజకిశోర్‌ను అభినందిస్తూ; ఇలాంటి ప్రయోజనకరమైన రచనలు మరిన్ని జనరంజకంగా, సుబోధకంగా వెలువరించే పట్టుదల వీరికి మరింత కలగాలని ఆశిస్తున్నాను! ★

ఉన్మేష్, ఉత్కర్ష్

గిరిజన కళలు, సాహిత్యాన్ని వేడుకగా జరుపుకునేందుకు ఇటీవల మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో నిర్వహించిన 'ఉన్మేష్, ఉత్కర్ష్' ఉత్సవాలు ఘనంగా జరిగాయి. "మన సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారవిచారాలు, సహజ పర్యావరణాన్ని పరిరక్షించుకుంటూ గిరిజన సమాజ పురోగమనాభివృద్ధిలో సామూహికంగా భాగస్వాములు అయ్యేందుకు మనం కృషి చేయాలి," అని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము వేడుకలను ప్రారంభిస్తూ అన్నారు. 'ఉన్మేష్ అంటే చైతన్యవంతం కావటం, వికసించడం అని, ఉత్కర్ష్ అంటే గిరిజన సమాజపు పురోగతిని వేడుక చేసుకోవడం' అని రాష్ట్రపతి అభివర్ణించారు. కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ పరిధిలోని సంగీత, సాహిత్య అకాడమీలు మధ్యప్రదేశ్ సాంస్కృతిక మంత్రిత్వ శాఖతో కలిసి భారతీయ జానపద, గిరిజన వ్యక్తీకరణలైన 'ఉత్కర్ష్', 'ఉన్మేష్'లను మొట్టమొదటిసారిగా ఆగస్టు 3 నుంచి 5 వరకు నిర్వహించాయి.

దేశంలోని 36 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన 800మంది కళాకారులు ఉత్కర్ష్ ఉత్సవ్‌లో గిరిజన, జానపద కళలను ప్రదర్శించారు. వర్ణమయమైన ఈ గిరిజనోత్సవాన్ని సాంస్కృతిక విభాగం, సంగీత నాటక అకాడమీ ఫేస్‌బుక్, యూట్యూబ్ ఛానెళ్ళలో ప్రత్యక్ష ప్రసారం చేశారు. మూడు రోజుల ఈ కార్యక్రమంలో లేహ్, లడాఖ్‌లకు చెందిన జబోరా నృత్యాన్ని, నాగాలాండ్‌కు చెందిన సుమీవార్, గోవా టైమ్, సిక్కింకు చెందిన సింధి ఛామ్, మధ్యప్రదేశ్‌కు చెందిన రాయ్, నరేరీ, మేఘాలయలో చేసే బంగ్లా, మహారాష్ట్రకు చెందిన లావణి, అస్సాం వారి బిహూ, ఒడిషాకు సింగారీ, ఝార్ఖండ్‌వారి పైకాతో పాటు తప్పెట గుళ్ళను, అరుణాచల్ ప్రదేశ్ వారి ఆజి లాము, హిమాచల్ ప్రదేశ్ వారి సిమౌరీ నాతి, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన పాంథీ సహా అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన గిరిజన, జానపద నృత్యాలను కన్నుల పండువగా ప్రదర్శించి, ప్రేక్షకులకు ఆయా సంస్కృతులను పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరాష్ట్రం నుంచీ వచ్చిన కళాకారులు తమ ప్రదర్శనలతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు.

ఇదే సందర్భంగా ఆసియాలోనే అతిపెద్ద సాహితీ సదస్సు 'ఉన్మేష్ ఉత్సవ్' కూడా జరిగింది. ఇందులో బహుభాషా కవితా గానం, రచన, గిరిజన కవుల సమావేశం, సాహిత్యానికి చెందిన పలు అంశాలపై చర్చ, ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌పై కవితా గానం, సాహితీ ఉన్నతి, ఉద్ధరణకు సంబంధించిన పలు అంశాలపై ఆయా రంగాలలో నిష్ణాతులైన వారి చర్చలు జరిగాయి. వీటితో పాటుగా, సాహిత్య అకాడమీ సహా పలువురు ప్రచురణ సంస్థలకు చెందిన పుస్తకాలు ఇక్కడ నిర్వహించిన పుస్తక ప్రదర్శనలో అందుబాటు ఉంచారు. ఈ ఉత్సవం సందర్భంగా, ప్రముఖ రచయితలపై సాహిత్య అకాడమీ నిర్మించిన డాక్యుమెంటరీ చిత్రాన్ని ప్రదర్శించారు.

మూడు రోజుల పాటు ఉత్తేజంగా సాగిన ఈ ఉత్సవాలు భారతదేశపు భిన్నత్వంలో ఏకత్వానికి తార్కాణంగా నిలిచాయి. ప్రతి ప్రాంతం తమదైన అస్తిత్వాన్ని నిలుపుకుంటూ, ప్రధాన స్రవంతితో కలిసి మెలిసి ఉండటమే భారతీయ సంస్కృతి విలక్షణ లక్షణమని రుజువు చేసి చూపాయి. ★

కథ

జాగృతిలో నవ సుమాలు...

డాక్టర్ శ్రీదేవీ శ్రీకాంత్



తెలుగు భారతి సాంస్కృతిక కార్యక్రమాలు జరిగే భవంతి ప్రాంగణం చక్కగా రంగురంగుల విద్యుత్ దీపాలతో, "తారలే భువికి దిగివచ్చినట్లు" చక్కగా అలంకరించి ఉంది.

"శ్రవణ కుమార చరిత్ర, బిళహరికథ...అందరికీ ఆహ్వానం" అని స్వర్ణాక్షరాల్లో రాసిన చిత్ర పలకాలు కట్టి ఉన్నాయి.

ఒక్కొక్కరుగా వస్తూ ఉన్నారు. ఆ ప్రాంగణం అంతా కొద్దిసేపట్లోనే ఆహూతులతో నిండి పోయింది.

హరికథకు ఎక్కువమంది వృద్ధులు, మధ్య వయస్సు వారే వస్తారు అని అందరి అంచనా.

కానీ మార్పు కోరుతున్న యువతరాన్ని ఎందుకో "పాతదంతా బంగారం" అన్నట్లు హరికథ వైపు నెట్టింది. "ఇప్పటి యువతరంది చాలా గమ్మత్తు. పసుపు పట్టు పంచెపైన, ఎర్రని కుచ్చుగా చిన్న పట్టువస్త్రం నడుముకి బిగించి కట్టాడు. తలకు కాషాయ రంగు తలపాగా చుట్టుకున్నాడు హరికథను చెప్పే భరద్వాజ శాస్త్రి. సూరీడు ఎర్రదనాన్ని, పాలభాగంలో సిందూరంగా అమర్చిన తీరు రమణీయంగా శోభిల్ల చేస్తోంది. రవి కిరణాలు అన్ని వైపులా ప్రసరిస్తున్నాయా అన్నట్లు కళాత్మకంగానే కాదు, అందులో అనంత అర్థం నిబిడీకృతం అయ్యే రీతిగా పెట్టుకున్న తిలకధారణపై అందరి దృష్టిపడి కాసేపు ఆలోచింప చేసేదిగా ఉంది. నల్లని మేఘాలను కాటుకగా దిద్దిన తీరు... ఆ కళ్లు ఆకారం పద్మనేత్ర సదృశ్యమే అన్నట్లు ఉంది. చెవులకు చిన్న కుండలాలు, భుజకీర్తులు.. మల్లెపూల మధ్యలో అక్కడక్కడా గులాబీలు, బంతిపూల దండ అతని కంఠానికి నిండుతనాన్ని ఇచ్చింది. చేతిలో చిడతలతో భరద్వాజశాస్త్రి వేదికను అలంకరించాడు. భగవంతుని ప్రతి రూపంలా అతని మోములో తేజస్సు కనబడుతోంది. అందరూ అతనికి దణ్ణం పెట్టారు.

"గురుభ్యోనమః"...అంటూ...దణ్ణం పెట్టి చేతిలో చిడతలు మోగిస్తూ..." అగజానన పద్మార్కం" అంటూ రాగయుక్తంగా...వినాయక స్తుతి చేస్తూ ఉన్నాడు.

"హరికథలు పూర్వం ఎంతో ప్రజాదరణ పొందేవి.. మళ్లీ అలాంటి రోజులు రావాలి. దానివల్ల మనిషిలో ఉన్న ఒత్తిడి తగ్గుతుంది" అని అంటుంటే అందరూ "అవును" అన్నట్లు తల ఊపసాగారు.

"ఈనాటి అంశం... శ్రవణ కుమార చరిత్ర... నేటి యువతరానికి తల్లి దండ్రుల పట్ల పిల్లలకు ఉండవలసిన భక్తి ప్రపత్తులను తెలియచేస్తుంది. ఈ కార్యక్రమానికి విచ్చేసిన పెద్దలకు, అనేక మంది విద్యార్థులకు భగవంతుని కృపాకటాక్షాలు మెండుగా ఉండ గలవని ఆశీర్వదిస్తున్నాను".

"తల్లిదండ్రులు దైవ సమానులు. ఈ లోకంలో ఎవరైతే తల్లి దండ్రులకు సేవ చేస్తారో... వారి జీవితం ఎప్పుడూ ఎలాంటి ఆందోళనలకు లోబడక చాలా ఆనందంగా ఉంటుంది. తల్లి దండ్రులను పూజిస్తే దేవతలందరినీ పూజించినట్లే"...

అందరూ కుతూహలంగా వింటున్నారు. కొందరు ఏక కంఠంతో "మంచిమాట చెప్పారు" అన్నారు. "నిశ్శబ్దం..నిశ్శబ్దం' అని హెచ్చరించ సాగారు నిర్వాహకులు...

మళ్లీ చెప్పడం మొదలుపెట్టారు శాస్త్రి.

"ఏ విధంగా విఘ్నేశ్వరుడు తన తల్లి దండ్రులయిన పార్వతీ పరమేశ్వరుల చుట్టూ మూడు సార్లు ప్రదక్షిణం చేసి సమస్త లోకాలు, పుణ్య తీర్థాలు, పుణ్యక్షేత్రాలు దర్శించిన పుణ్యం పొందాడో...! అలాంటి పుణ్యం దక్కాలీ అంటే ఏమి చేయాలి"? అన్నాడు ప్రశ్నార్థకంగా..?

అందరూ ఆసక్తితో చీమ చిటుక్కుమననంతటి

నిశ్శబ్దంతో వింటున్నారు.

"అవును ఏమి చేయాలి"? అందరూ ఆసక్తిగా సమాధానం కోసం ఎదురు చూస్తూ... "ఏమిటా"! అని ఆలోచిస్తూ ఉన్నారు.

ఇంతలో శాస్త్రి గారు...

"ఏనుగుకు లేక లేక ఆడపిల్ల పుట్టింది. ఆ పిల్ల బారసాలకు గౌను కుడదాము అనుకుంది. సూదిలో దారం ఎక్కించాలి అనుకుంటుంది. పాపం..బాగా పెద్దవయస్సు అయ్యాక తల్లి అయిన మన ఏనుగుకి కళ్లు కనబడడం లేదు దారం ఎక్కించడానికి. అప్పుడు అది చేసింది? ఎవరైనా చెప్పగలరా?!" అంటూ కథ గంభీరంగా సాగుతున్న తరుణంలో, మధ్యలో తమాషా ప్రశ్న వేశారు... ప్రేక్షకులలో ఆసక్తిని పెంచడానికి...నవ్వించ డానికి...



"భర్త ఏనుగు సాయం చేసి ఉంటుంది" అని కొందరు, "పక్కింటి ఏనుగు" అని కొందరు...

'అనలు సమాధానం ఏమిటా'...! అని ఆలోచిస్తూ...?! మళ్లీ కథ మొదలు పెట్టారు. పద్యాలు పాడుతుంటే అందరూ ఆశ్చర్యంగా వింటున్నారు..." ఎంత జ్ఞాపకశక్తి.. ఎంతటి ధారణ"... విస్మయ చకితులవుతున్నారు...

అందరూ ఇప్పుడు పూర్తి దీక్షతో వింటున్నారు. ఏనుగు పిల్లకు గౌను గురించిన సమాధానం కోసం.

"ఇప్పుడు సమాధానం చెప్పేస్తున్నా"...!

అందరూ లాటరీ ఫలితాలు వింటున్నట్లు ముఖం పెట్టి వింటున్నారు.

"ఏనుగులు బట్టలు వేసుకోవు" అన్నాడు... హరికథా ప్రసంగ కర్త. అందరూ 'అవును కదా...ఈ సమాధానం తట్టలేదే' అని స్వగతంలో అనుకుంటూ... పెద్దగా నవ్వేశారు. శాస్త్రి పద్యం అందుకున్నారు.

"తల్లి దండ్రి మీద దయగల పుత్రుండు
స్వర్గ ప్రాప్తి నొందు శాశ్వతముగ
నెవడు వారి పట్ల దయజూపకుండునో
నరకలోక మేగు నిజము గాను" ?

"తల్లిదండ్రులను సేవించినవారికి స్వర్గం వస్తుంది. అక్కడ కూడా ముందు స్థానం పొందుతారు. లేకుంటే భువిపైనే ఏదో రూపంలో ఎప్పుడో అప్పుడు ముందుగా నరకాన్ని చూస్తారు".

"మనం అనుకుంటాము... కేవలం భగవంతుని పూజ వల్లో, దాన ధర్మాలు చేయడం వల్లనో పుణ్యం వస్తుంది అని. కానీ వీటన్నింటికన్నా మించినది...తల్లి దండ్రులను సేవించడం. దాని వల్లనే పుణ్యం వస్తుంది" అంటూ..." ఈ రోజు మీకు శ్రవణ కుమారుని కథ చెబుతాను" అన్నారు. చిడతలు లయాత్మకంగా మోగిస్తూ అటూ ఇటూ ఊగుతూ.. చెబుతున్నాడు...

"వివాహం అయిన చాలా సంవత్సరాలు ఆ దంపతులకు పిల్లలు లేరు. ఎన్నో వ్రతాలు నోములు చేయగా వాళ్ల కల ఫలించింది".

"ఆ దంపతులకు కొడుకు పుడతాడు. శ్రవణుడు అని నామకరణం చేస్తారు. తల్లిదండ్రులకు అతనంటే పంచప్రాణాలు. ఎన్నో విద్యలు నేర్పిస్తారు.

శ్రవణ కుమారునికి చిన్నతనం నుండి తల్లి దండ్రులంటే అమిత భక్తి. వారి పాదసేవ పరమావధి అతనికి".

"శ్రవణుడికి పదహారేళ్లు వచ్చేసరికి అమ్మా నాన్నలిద్దరూ పూర్తిగా ముసలి వారు కావడంతో... వారిలో పటుత్వం తగ్గింది. నడవలేని స్థితికి చేరుకున్నారు. వాళ్ల కంటిచూపు కూడా క్రమంగా మందగించింది. చూస్తూ చూస్తూండ గానే గుడ్డి వాళ్లయి పోయారు".

ఒక కాలేజి విద్యార్థి లేచి..." వాళ్లు ముసలితనం వల్ల చనిపోతారా? శ్రవణుడు ఒంటరివాడు అవుతాడా? నేను ఊహించింది నిజమేనా"?.. అన్నాడు.

అందరూ పక్కున నవ్వారు. ఏమౌతుందో అనే జిజ్ఞాస ఆవుకోలేని ఆ కుర్రాడి ప్రశ్నకు సమాధానంగా..." పిల్లలు మన ఇతిహాస, పౌరాణిక గ్రంథాలు చిన్ననాటి నుండి చదవాలి. విధి రాత విందువు గానీ బాబు"... కూర్చో అని చెప్పడం మొదలు పెట్టారు శాస్త్రి....

ఇప్పుడు ఆ తల్లితండ్రులకు శ్రవణుడే ఆసరా. ముసలి తల్లిదండ్రుల అవస్థను అర్థం చేసుకున్న ఆ తనయుడు, వారిని కంటికి రెప్పలాగా చూసుకుంటూ ఉన్నాడు.

తల్లిదండ్రులకు "కాశీ పట్టణం చూడాలని కోరికగా ఉంద'న్న సంగతి తెలుసుకుని, 'ఎలాగైనా సరే, నా తల్లి దండ్రుల కోరికను తీర్చాల'నుకున్నాడు. ఒక కావడిని చేసుకున్నాడు. తల్లిదండ్రులను అందులో చెరొక వైపూ కూర్చో బెట్టుకొని, కావడిని మోసుకొంటూ ప్రయాణం సాగించాడు. 'అమ్మా నాన్నల కోరికను నెరవేర్చాలి' అన్నదొక్కటే అతని సంకల్పం. కొండలు, నదులు, వాగులు, వంకలు దాటుకుంటూ... మెల్లగా అయోధ్య రాజ్యపు సరిహద్దుల్లోని అడవి లోకి ప్రవేశించాడు".

తల్లిదండ్రులు "దాహంగా వుంది" అనడంతో కావడి దించి నీళ్ల కోసం వెళ్లాడు. ఒక కొలను వద్ద పాత్రను ముంచుతుండగా 'బుడబుడ' మని శబ్దం రాసాగింది. శాస్త్రి గారు ఒక్క గంతు వేశాడు. అందెల శబ్దం ఊపందుకుంది.

అదే సమయానికి శబ్దభేది విద్యలో ప్రావీణ్యుడు అయిన దశరథ మహారాజు అక్కడ ఏదో జంతువు నీరు తాగుతుంది అనుకుని బాణం వేశాడు. అది నీళ్లు పడుతున్న శ్రవణ కుమారునికి తగిలింది.

''ఆ...'' అంటూ అరచి నేల కొరిగాడు శ్రవణుడు. 'తన బాణానికి ఏ జంతువు చిక్కిందా'? చూద్దాం అని ఆసక్తితో అక్కడికి వచ్చిన దశరథుడు ఆ బాలుడిని నిర్ఘాంత పోయాడు. ఆ బాలుడు తన తల్లిదండ్రులను గురించి చెప్పి ప్రాణం విడిచాడు".

అదే సమయంలో దేవలోకం నుండి అక్కడికి వచ్చిన నారదుడు..."శ్రవణుడు తన తల్లిదండ్రులను భక్తితో సేవించడం వల్ల స్వర్గం నుండి దేవదూతలు వచ్చి ఆతనిని తీసుకుని వెళ్లారు "అని చెప్పాడు

"అమ్మానాన్నలు మనల్ని బాల్యం నుండి ఎన్నో కష్టాలకు ఓర్చి పెంచి పెద్ద చేస్తారు. మనం బాల్యంలో ఎలాగైతే తల్లిదండ్రుల మీద ఆధార పడతామో... అదేవిధంగా, వృద్ధాప్యంలో తల్లిదండ్రులు పిల్లల మీద ఆధారపడతారు".

"తల్లిదండ్రుల ఇష్టానిష్టాలను తెలుసుకుని, వాళ్లకు ఆసరాగా...వాళ్లకు కష్టం కలగకుండా చూసుకోవటం పిల్లల బాధ్యత. అదే ధర్మంగా భావించాడు

కాబట్టి శ్రవణుడు స్వర్గం చేరుకున్నాడు"... అంత వరకు కథ చెప్పి మంగళం పాడి ముగించారు. శ్రద్ధగా విన్నవారు భరద్వాజ శాస్త్రిని సన్మానించారు.

* * *

"సుశీలా! ఈ రోజు చిన్నాడికి కాలేజీలో ఫీజు కట్టడానికి చివరి రోజట"...! అన్నాడు విచార వదనంతో భరద్వాజ శాస్త్రి భార్యతో..

"మీరు పొద్దుట నుండి ఎంత మందినో డబ్బు సాయం అడిగారు...మా నానమ్మ చెప్పేది...ఇంటి కప్పు ఆలి కొప్పు చూసి ఎదుటి వారు సాయం చేస్తారని" అంది సుశీల.

"కప్పు మాట సరే గానీ...! ఆలి కొప్పు దేనికో...? సుశీలా..."! అన్నాడు అంత బాధలోనూ భర్త, భార్య కళ్లల్లో దీనతను పోగొట్టాలి అని

"బహుశా ఏదో ప్రాసకోసం అని ఉంటారు."... అంది భర్తను కాస్త ఊరడించాలి అని.

"కొప్పు అంటే గుర్తుకు వచ్చింది...మా తాత బుర్ర కథ చెప్పేవాడు...ఎంత పెద్ద కొప్పో ఉండేదట. ఈ రోజు నేను ఏ కొప్పూ లేకనే హరికథ చెప్పాను" అన్నాడు శాస్త్రి.

"సుశీలా...బాధపడకు...మా అమ్మ దగ్గర ఏమన్నా ఉన్నాయేమో అడుగుతాను".

"మీ అమ్మ గారికి ప్రభుత్వం ఇచ్చే ఆ రెండు వేల చిల్లరా ఆమె మందులకే చాలడం లేదు". ఈ వయసులో...ఆమెకు ఈ కష్టాలు చెప్పి బాధ పెట్టకండి".

"సుశీలా! నువ్వు నాకు దేవుడు ఇచ్చిన భార్యే కాదు. నా మనసును పూర్తిగా గెలుచుకున్న స్నేహితురాలివి కూడా... ఉత్తమ ఇల్లాలివైన నిన్ను నా జీవిత భాగస్వామిని చేసిన విరించి రచన మాత్రం అద్భుతం" అన్నాడు సుశీలను ఆప్యాయంగా దగ్గరకు తీసుకుని...

సుశీలా...! నువ్వు నాలో సగం. మనం ఇద్దరం ఒకరి కోసం ఒకరు పరి తపించే అర్ధనారీశ్వర బాంధవ్య తత్వాలం"...భార్య చేతిని తన చేతిలోకి తీసుకుని...

"ఈ డబ్బు ఉంచు" అన్నాడు.

"బాబూ...! గార్గేష్...! చదువు మీద పూర్తి ధ్యాస పెట్టు. నువ్వు ఏదో విశ్వవిద్యాలయంలో ఉద్యోగం చేస్తున్నట్లు మీ అమ్మ చెప్పింది. కాస్త కష్టపడి చదివితే మీ అన్నయ్యలాగా పెద్ద ఉద్యోగం వస్తుంది. ఏకాగ్రత అవసరం. చదువు అయ్యాక ఉద్యోగం చేద్దువు గానీ" అన్నాడు. "నాన్నగారూ...! ఈ రోజులలో చాలా మంది పిల్లలు తమ తల్లి దండ్రులను పట్టించు కోవడం లేదు. ఎవరూ మాట్లాడేవారు లేక ఒంటరితనం అనుభవిస్తున్నారు ముసలి తల్లిదండ్రులు.

"పెద్దోడి ఫీజు కోసమని ఒక తాళి బొట్టు అమ్మాము... రెండో తాళిబొట్టు వీడి కోసం అమ్మితేనే ఈ గండం గడిచేది. పిల్లలు చక్కగా స్థిరపడితే చాలు. దానికన్నా ఏ ఆభరణాలు మనకు సంతృప్తిని ఇస్తాయి"...? అంది చేతిలో పసుపు కొమ్ములు కట్టిన పసుపు తాడును భర్త చేతిలో పెడుతూ...మెడలో కట్టమని.

"సుశీలా"...! అన్నాడు జీరబోయిన కంఠంతో...

"దేవుళ్లు నిత్యం పెళ్లి చేసుకోవడం లేదూ... కట్టండీ"...! అంది

"సుశీలా...! మన మధ్యతరగతి జీవితాలకు అన్నీ కష్టాలే. పైకి చెప్పు కోలేము. 'సితార' సినిమాలో శరత్‌బాబు పరిస్థితిలా...లోపల చిరుగు బ్రతుకులు. బయటకు పనికిరాని డాబు" అన్నాడు. జీవితసారం తెలిసిన అపర తాత్వికుడు అతడు.

* * *

కంప్యూటర్ ముందు కూర్చున్న కొడుకు గార్గేష్ దగ్గరగా నిలబడింది సుశీల.

అలికిడి అవ్వడంతో తల్లివైపు చూశాడు గార్గేష్. చేతిలో కాఫీ పెట్టి, బాబూ...! నువ్వు ఈరోజు ఫీజు కట్టు.

"నీ తాళిబొట్టు అమ్మా"...!

"అమ్మా...అలాంటి పనులు చేయకు. నేను వాట్సాప్ యూనివర్సిటీలో పనిచేసి కాస్త డబ్బు సంపాదించాను... ఫీజు నేను కట్టుకుంటాను. ఇందులో సగం చాలు" అని తల్లి చేతిలో సగం డబ్బు మాత్రం తీసుకున్నాడు.

* * *

"బాబూ...! గార్గేష్...! చదువు మీద పూర్తి ధ్యాస పెట్టు. నువ్వు ఏదో విశ్వవిద్యాలయంలో ఉద్యోగం చేస్తున్నట్లు మీ అమ్మ చెప్పింది. కాస్త కష్టపడి చదివితే మీ అన్నయ్యలాగా పెద్ద ఉద్యోగం వస్తుంది. ఏకాగ్రత అవసరం. చదువు అయ్యాక ఉద్యోగం చేద్దువు గానీ" అన్నాడు.

"నాన్నగారూ...! ఈ రోజులలో చాలా మంది పిల్లలు తమ తల్లి దండ్రులను పట్టించు కోవడం లేదు. ఎవరూ మాట్లాడేవారు లేక ఒంటరితనం అనుభవిస్తున్నారు ముసలి తల్లిదండ్రులు.

అలాంటి వాళ్లను.. వాట్సప్ యూనివర్సిటీలో చేర్చి, యూట్యూబ్‌లో.. భక్తి ఛానెల్స్ ఎలా చూడాలి? కోరిన పాటలు ఎలా వినాలి? అనేక విషయాలు ఎలా తెలుసు కోవాలి?అని నేర్పుతున్నాను. పాపం వాళ్ల ఒంటరి జీవితాల్లో యూట్యూబ్ ఒక నేస్తం అయినట్లు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు" అన్నాడు.

మనదేశంలో పిల్లలు చదువు అయ్యేవరకు పెద్దల పైన పూర్తిగా ఆధార పడతారు. విదేశాల్లో యువకులు చదువు, ఉద్యోగం కలిపి చేస్తారు. నేను మీ బాధలు, మీరు పంచే ప్రేమ చూస్తూ పెరిగాను. నేను బాధ్యతగా చదువుతున్నాను.

ఇప్పుడు కాలేజీలో పిల్లలు పెద్దవాళ్లకు ఎలా ఆసరాగా నిలబడాలి అనే దానిమీద మా ప్రధానో పాధ్యాయులు, మేమంతా కలిసి చదువు అయ్యి వెళ్లిపోయే వారితో...ప్రతిజ్ఞ చేయించడం మొదలు పెట్టాము" అన్నాడు.

అప్పుడే అక్కడికి వచ్చిన గార్గేష్ నానమ్మ..."మీ సంభాషణ విన్నాను. మీ అమ్మలాంటి కోడళ్లు ఉంటే ఆ విశ్వవిద్యాలయాలు, ప్రతిజ్ఞలతో పనిలేదు" అంది.

"నిజమే...!చాలా మంది యువతకు...పెద్దలు పనికి రావడం లేదు. మనవళ్లు, మనవరాళ్లకు కూడా వాళ్ల ఫోన్‌లపై ఉన్న ప్రేమ పెద్దల మీద ఉండడం లేదు. ఇలాంటి రోజుల్లో వృద్ధుల కోసం నువ్వు మంచి పని చేస్తున్నావు. జాగృతిలో నవ సుమాలు" మీరు అంది.

"మీ అమ్మ నాతో స్నేహితురాలిలా ఉంటుంది. బాగా చూసుకుంటుంది. అయినా ఆ "నువ్వు గొట్టం" ఎలా చూడాలో... నాకూ నేర్పవా"? అంది.

ఆ ముగ్గురూ...ఒకరి మొఖం ఒకరు చూసుకుని .."యూ ట్యూబ్...నువ్వు గొట్టం... తెలుగులో"... అని నవ్వుతూ, నోటిమీద వేలు వేసుకున్నారు. ★

మరాఠీ మొలక.. 17ఏళ్లకే విశ్వవిజేత!

ఇతిహాస క్రీడ విలువిద్యలో విశ్వవిజేతగా నిలవాలంటే వయసు, అనుభవంతో పనిలేదని 17 ఏళ్ల మరాఠీ ఆర్చర్ అదితి చాటి చెప్పింది. బెర్లిన్ వేదికగా ముగిసిన 2023 ప్రపంచ విలువిద్య పోటీల వ్యక్తిగత విభాగంలో బంగారు పతకం సాధించడం ద్వారా సరికొత్త చరిత్ర సృష్టించింది.

భారత ఇతిహాస చరిత్రలో విలువిద్యకు ఎనలేని ప్రాముఖ్యత ఉంది. మన ఇతిహాసాలలో ఈ విద్యలో ప్రావీణ్యం కలిగిన గొప్పగొప్ప వీరులు ఎందరో కనిపిస్తారు. ఆ పరంపరను ఆధునిక తరం క్రీడాకారులు కొనసాగించ గలుగుతున్నారు. నాలుగేళ్లకోసారి జరిగే ఒలింపిక్స్‌తో పాటు..ప్రతి రెండేళ్లకు ఒకసారి నిర్వహించే ప్రపంచ పోటీలలోనూ విలువిద్య ఓ ప్రధాన క్రీడగా ఉంటూ వస్తోంది. మన దేశం సహా దక్షిణ కొరియా, జపాన్, చైనా, మెక్సికో, జర్మనీ, ఇంగ్లండ్, సోవియెట్ మాజీ రిపబ్లిక్ దేశాలలో విలువిద్యకు విశేష ఆదరణ ఉంది. లింబారామ్, లాల్‌రెమ్ సంగా, డోలా బెనర్జీ, దీపికాకుమారి లాంటి ప్రపంచ మేటి విలువిద్య క్రీడాకారులను అందించిన ఘనత భారత్‌కు ఉంది.

దిగ్గజాలను మించిన పసికూన...

విలువిద్య మహిళల విభాగంలో భారత పతాకాన్ని రెపరెపలాడించిన దిగ్గజాలు డోలా బెనర్జీ, దీపికా కుమారి, బాంబ్యేలాదేవి, ముస్కాన్ కిరార్, లక్ష్మీరాణి మాజీ, రాజ్ కౌర్ సాధించలేని ఘనతను మరాఠీ మొలక అదితీ గోపీచంద్ స్వామి చిన్నవయసులోనే సాధించి జర్మనీ రాజధాని బెర్లిన్ వేదికగా ముగిసిన 2023 ప్రపంచ విలువిద్య పోటీల టీమ్, వ్యక్తిగత విభాగాలలో జంట స్వర్ణాలు సాధించడం ద్వారా అరుదైన ఘనతను సొంతం చేసుకొంది. అత్యంత పిన్నవయసులో విశ్వవిజేతగా నిలిచిన తొలి క్రీడాకారిణిగా చరిత్ర సృష్టించింది.

తల్లిదండ్రుల ప్రోత్సాహంతో....

సతారాలోని ఓ మధ్యతరగతి కుటుంబానికి చెందిన అదితిత తొమ్మిదేళ్ల ప్రాయంలోనే విల్లు చేతపట్టింది. తండ్రి గణితశాస్త్ర అధ్యాపకుడు కాగా, తల్లి ప్రభుత్వ ఉద్యోగి. కుమార్తెను ఏదో ఒక క్రీడలో

క్రీడా కృష్ణ, 84668 64969
సీనియర్ జర్నలిస్ట్

దేశానికి పేరు తెచ్చే క్రీడాకారిణిగా తీర్చిదిద్దాలని నిర్ణయించారు. అయితే. తమ ప్రాంతంలో అందు బాటులో ఉన్న ది క్రీడ విలువిద్య మాత్రమే కావడతో తమ నగరంలోని విలువిద్య అకాడమీ ప్రధాన శిక్షకుడు ప్రవీణ్ సావంత్‌ను సంప్రదించారు. అదితి బలహీనంగా ఉండటంతో శిక్షణ ఇచ్చేందుకు ప్రవీణ్ మొదట సుముఖత వ్యక్తం చేయలేదు. అదితి తల్లిదండ్రుల బలవంతం మీద ట్రైల్స్‌లో పాల్గొన టానికి అనుమతించారు. ఎంపిక పోటీలలో అదితి పట్టుదల, అంకితభావం చూసి ముచ్చటపడి, తమ అకాడమీలో ప్రవేశం కల్పించారు.

ఎనిమిదేళ్ల శిక్షణతోనే విశ్వవిజేతగా...

సతారా ఆర్చరీ అకాడమీలో శిక్షణతో రాటు దేలిన అదితి సబ్ జూనియర్, జూనియర్ స్థాయిల్లో మెరికలాంటి ఆర్చర్‌గా గుర్తింపు తెచ్చు కొంది. నిరంతరం సాధనకు పట్టుదలను జోడించి అంచె లంచెలుగా ఎదుగుతూ వచ్చింది. ఖేలో ఇండియా క్రీడల్లో సైతం సత్తా చాటుకోడం ద్వారా అంతర్జాతీయ స్థాయి శిక్షణకు ఎంపికయ్యింది. భారత క్రీడా ప్రాధికార సంస్థ ప్రోత్సాహంతో తిరుగులేని ఆర్చర్‌గా రూపుదిద్దుకొంది. గత నెలలోనే ఐర్లాండ్ వేదికగా జరిగిన ప్రపంచ యువజన (అండర్-18) విలువిద్య పోటీలలో జంట స్వర్ణాలతో విశ్వ విజేతగా నిలిచింది. అంతటితోనే ఆగిపోకుండా.. జర్మనీ రాజధాని బెర్లిన్ వేదికగా జరిగిన ప్రపంచ పోటీలలో సైతం అత్యుత్త మంగా రాణించింది.

మహిళల కాంపౌండ్ వ్యక్తిగత విభాగంలో మెక్సికోకు చెందిన ఆండ్రియా బెసీరాను 149- 147 పాయింట్ల తేడాతో ఓడించడం ద్వారా అదితి విశ్వవిజేతగా నిలిచింది. ఇంత చిన్నవయసులో భారత్‌కు చెందిన ఓ ఆర్చర్ ప్రపంచ టైటిల్ సాధించడం ఇదే మొదటిసారి.

మహిళల టీమ్ విభాగంలో ప్రపంచ టైటిల్ కోసం జరిగిన పోరులో సైతం పర్నీత్ కౌర్, వెన్నెం జ్యోతి, అదితిలతో కూడిన భారతజట్టు విజేతగా నిలిచింది. ఫైనల్లో మెక్సికోకు చెందిన ఆండ్రియా బెసీరా, డాఫ్నీ క్వింటెరో, అనా సోఫియాలతో కూడిన జట్టును 235-229 పాయింట్లతో చిత్తుచేసి తొలిసారిగా ప్రపంచ టైటిల్‌ను కైవసం చేసుకున్న అదితిని ప్రధాని నరేంద్ర మోదీ అభినందించారు.

తెలుగు ఆర్చర్‌కూ రెండు పతకాలు..

భారతజట్టులో సభ్యురాలిగా పాల్గొన్న తెలుగు ఆర్చర్ జ్యోతి వెన్నం మహిళల టీమ్, వ్యక్తిగత విభాగాలలో రెండు పతకాలు సాధించడం ద్వారా ఆంధ్రప్రదేశ్ కే వన్నె తెచ్చింది. టీమ్ విభాగంలో స్వర్ణపతకంతో పాటు వ్యక్తిగత విభాగంలో కాంస్య పతకం సాధించింది. వ్యక్తిగత విభాగం సెమీస్‌లో అదితి చేతిలో ఓడిన జ్యోతి, కాంస్యపతకం పోరులో సఫలం కాగలిగింది. విజయవాడ నగరానికి చెందిన జ్యోతి గత కొద్ది సంవత్సరాలుగా అంతర్జాతీయ విలువిద్య పోటీలలో భారత్‌కు ఏదో ఒక పతకం సాధించి పెడుతూనే ఉంది.

ఓజాస్‌కు పురుషుల ప్రపంచ టైటిల్...

పురుషుల వ్యక్తిగత విభాగంలో బంగారు పతకం సాధించిన మొనగాడిగా భారత్‌కే చెందిన ఓజాస్ ప్రవీణ్ డియోటేల్ నిలిచాడు. స్వర్ణపతకం పోరులో పోలెండ్‌కు చెందిన లూకాస్‌ను ఒకే ఒక్క పాయింట్ తేడాతో (150-149)ఓడించి విశ్వ విజేతగా నిలిచాడు. ప్రపంచ విలువిద్య కాంపౌండ్ విభాగం పురుషుల, మహిళల విభాగాలలో భారత ఆర్చర్లు.. మూడు బంగారు పతకాలు సాధించడం ఇదే మొదటిసారి. ★

మణిపూర్‌లో సహాయ శిబిరాలు

గవర్నర్‌తో సంవర్ధిని ట్రస్ట్ సభ్యులు

మణిపూర్ : మణిపూర్ అల్లర్లలో బాధితులకు సంవర్ధిని ట్రస్ట్ (సేవికాసమితి లో ఒక విభాగం) ఆధ్వర్యంలో 5 స్థలాలలో సహాయ శిబిరాలను నిర్వహిస్తున్నది. ఈ శిబిరాలను జూలై 23, 30,31 తేదీలలో సంవర్ధిని ట్రస్ట్ కార్యదర్శి డా॥ మేధా బ్రహ్మపూర్కర్ , ఆర్గనైజింగ్ సెక్రటరీ మాధురీ మరాతేతోపాటు స్థానిక కార్యకర్తలైన డా॥ థానిన్ లెమజి, నేతాజిని సందర్శించి జరుగుతున్న కార్యక్రమాలను సమీక్షించారు. అదే సమయంలో బాధితులను పరామర్శించి వారికి మరింత ధైర్యాన్ని నెలకొల్పారు. శరణార్థి శిబిరాల్లో తలదాచుకుంటున్న విద్యార్థులకు స్థానిక కార్యకర్తల సహాయంతో ట్రస్ట్ కార్యకర్తలు సాంఘిక సంక్షేమశాఖతో కలిసి విద్యను అందించే ప్రయత్నం ట్రస్టు ద్వారా జరుగుతున్నది.

బాధితుల మనసులో భయాందోళనలను, వత్తిడిని తగ్గించే ఉద్దేశంతో యోగా, ఆటలు మొదలైన కార్యక్రమాలను జూలై 20వ తేదీ నుంచి అమలు చేస్తున్నారు. రాష్ట్ర గవర్నర్ గౌరవనీయ యు.అనసూయను ట్రస్ట్ సభ్యులు కలిసి శరణార్థి శిబిరాలకు తగినంత రక్షణను కల్పించవలసిందిగా కోరారు. ★

పాత్రికేయ సన్మాన సభ

నెల్లూరు : సాహితీ సుధా ఫౌండేషన్‌వారి ఆధ్వర్యంలో పాత్రికేయ సన్మాన సభ ఆగష్టు 8న నెల్లూరులోని జేసీస్‌భవన్, పప్పులవీధిలో జరిగింది. ఈ కార్యక్రమానికి సీనియర్ పాత్రికేయులు కస్తూరి రాకాసుధాకర్ ముఖ్యవక్తగా పాల్గొని మాట్లాడుతూ జర్నలిజంలో మౌలిక విలువలను పాటించాలని కోరారు. హిందూ సాంప్రదాయాలను కించపరుస్తూ ఇటీవల కాలంలో కుంభకోణం, వంగనామాలు, స్వాహా, శరగోపం మొదలైన పదాలను ఉపయోగిస్తున్నారని ఆ పదాలు వాడకుండా కూడా రాయవచ్చని తెలియ జేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న నెల్లూరు జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫిస్ రామకృష్ణ మాట్లాడుతూ ప్రజా సేవ చేస్తున్న పోస్టల్ డిపార్ట్‌మెంటువారిని కూడా మీరు గుర్తించడం ఆనందంగా ఉందన్నారు. ఇటువంటి జర్నలిస్టుల సమావేశంలో పాల్గొనే అవకాశం కల్పించడం మాకెంతో గర్వంగా ఉందని అన్నారు. అనంతరం జర్నలిస్టులు, ప్రముఖులు, రచయితలకు సన్మానం జరిగింది.

ఇతిహాస సంకలన సమితి ఆధ్వర్యంలో "గ్రామదేవతలు-ఆరాధనా సంస్కృతి"

ఇందూరు : ఇతిహాస సంకలన సమితి – ఇందూరు ఆధ్వర్యంలో స్థానిక హరిచరణ్ హిందీ విద్యాలయంలో ఆగష్టు 1న "గ్రామ దేవతలు – ఆరాధనా సంస్కృతి" విషయంపైన సెమినార్ జరిగింది. గ్రామ దేవతల సంస్కృతి అంశం

మీద డా॥ గంగల్ లక్ష్మీపతి ఉపన్యాసం వారి జానపద పాటలు, పద్యాల నడుమ సుదీర్ఘమైన వారి అధ్యయన సారాంశం జనరంజకమైన రీతిలో, ఎన్నో కొత్త విషయాలను తెలియజేసేలా కొనసాగింది. అధ్యక్షోపన్యాసంచేస్తూ భోగరాజు వేణుగోపాల్ చరిత్ర అధ్యయనం, ఆవశ్యకతను వివరిస్తూ గ్రామ దేవతా సంస్కృతి ఔన్నత్యాన్ని తెలియజేశారు. ఇతిహాస సంకలన సమితి ప్రధాన కార్యదర్శి కందకుర్తి ఆనంద్ చరిత్ర అధ్యయనం కోసమే అంకితమైన సంస్థ అని, తరతరాలుగా వక్రీకరణకు గురైన భారతీయ చరిత్రను మళ్లీ భారతీయ దృష్టి కోణంలో ఆధారాలతో సహా పునఃలిఖించడం కోసం మనందరం కృషి చేయాలని, అందరూ తమ కుటుంబ చరిత్ర నుంచి ప్రారంభించి దేశ చరిత్ర దాకా అధ్యయనం చేయాలని, అందుకోసం ఇతిహాస సంకలన సమితి సహకరిస్తుందని తెలిపారు.

ప్రధాన వక్త విశ్రాంత అధ్యాపకులు డా.గంగల్ లక్ష్మీపతి మాట్లాడుతూ భారతీయ సంస్కృతికి ఆధారం గ్రామదేవతలే నని ఆ గ్రామ దేవతలే గ్రామాల్ని, దేశాన్ని రక్షిస్తున్నాయని వ్యాఖ్యానించారు. మనిషి తాను చేసే ప్రతీ పనిలో భగవంతుని దర్శించడమే సంస్కృతి అని, అలా ప్రతీ గ్రామంలో ఆ గ్రామాన్ని రక్షించే ఒక నమ్మకాన్ని దేవతగా నిలిపి ఆ నమ్మకానికి పోచమ్మ, ఎల్లమ్మ, మైసమ్మ అనే వివిధ రకాల పేర్లతో పిలుస్తున్నామని తెలిపారు.

ప్రతి కులానికి ఒక కుల దేవత ఉంటుందని, కుల వృత్తిలో వాడే పని ముట్లను కూడా దేవతగా భావించే మహోన్నత సంస్కృతి మన దేశంలో ఉందని, గ్రామ దేవతలు విషజ్వరాల నుంచి, చీడ పీడల నుంచి గ్రామ ప్రజలను రక్షించేది గ్రామ దేవతలే అని, రాముడు సైతం అయోధ్య గ్రామదేవతను ఆరాధించాడని, పాండవులు రాజ్యలక్ష్మీ దేవతను ఆరాధించారని ఇతిహాసాలు చెబుతున్నాయని అన్నారు. కేవలం ఇందూరు (నిజామాబాద్) జిల్లాలోనే 145 రూపాల్లో గ్రామ దేవతల్ని ఆరాధిస్తున్నారని, ఇంకా ఎన్నో రకాల పేర్లు, ఎన్నో రకాల రూపాలతో దేవతల్ని ఆరాధిస్తున్నారని, ఇది మన సంస్కృతి వారసత్వమని అన్నారు. ★

బి.వి.కె కళాశాల విద్యార్థులకు అభినందన సభ

విశాఖపట్నం: ద్వారకానగర్ బి.వి.కె డిగ్రీ కళాశాల బి.ఏ విద్యార్థులకు ఆంధ్ర విశ్వ విద్యాలయం సెమిస్టర్ పరీక్షల్లో బి.మేఘన మొదటి ర్యాంక్, ఎం.రాహుల్ రెండో ర్యాంక్, సిహెచ్. ఖద్యోతి మూడో ర్యాంక్, పి.ధరణి మూడో ర్యాంక్, సాధించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని భారతీయ విద్యా కేంద్రం ఛైర్మన్ ప్రొఫెసర్ పి.ఎస్ అవధాని మాట్లాడుతూ వరుసగా నలుగురు విద్యార్థులు ర్యాంక్ లు సంపాదించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. డైరెక్టర్స్ అంజలి ప్రసాద్, లక్ష్మీనారాయణ, రాంబాబు, కరెస్పాండెంట్ వై.శ్రీధర్ విద్యార్థులను ప్రశంసించారు.

కళాశాల ప్రిన్సిపల్ డి.వి.ఎల్.ఎన్ జోగిరాజు బి.ఏ అధ్యాపకులు రత్నశేఖర్, భరత్, అనురాధ తదితర అధ్యాపక బృందం ర్యాంక్‌లు సాధించిన విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని ఆనందంతో శుభాశీస్సులు అందించారు. ★

బాల జాగృతి

తెలుసుకుందాం

కాలభైరవ దేవాలయం - ఉజ్జయిని

మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయిని నగరంలో షిప్రా నది ఒడ్డున వెలసిన పురాతన హిందూ దేవాలయమిది. ప్రధాన దైవం కాలభైరవుడు. భద్రసేన్ అనే రాజు ఈ ఆలయాన్ని నిర్మించినట్లుగా చారిత్రక ఆధారాలు చెబుతున్నాయి. ఈ ఆలయానికి ప్రతిరోజూ వందలాది మంది భక్తులు వస్తూ ఉంటారు. ఉజ్జయిని నగరానికి కాలభైరవుడు రక్షణగా నిలుస్తున్నారని స్థానికుల విశ్వాసం.

కథ | దొంగపిల్లిని మార్చిన పిల్లలు

అనగనగా ఒక ఊరిలో ఒక పిల్లి ఉండేది. అది ఆ ఊరంతా తిరుగుతూ పాలు, పెరుగు, మాంసం, చేపలు.. ఎవరింట్లో ఏది దొరికితే అది, ఏ మూల దాచుకున్నా పసిగట్టి మరీ తినేసేది.

దాంతో ఊళ్లో వారందరూ ఈ పిల్లి ఆగడాలను గురించే మాట్లాడుకోవడం మొదలుపెట్టారు.

అందరూ కలిసి దానికి 'దొంగపిల్లి' అని బిరుదు తగిలించి, తిట్టుకునేవారు. ఆ పిల్లిని ఏదో ఒక విధంగా వదిలించుకోవాలని ప్రయత్నించేవారు. కాని అది అంత సులువుగా ఎవరికీ దొరికేది కాదు. కన్ను మూసి తెరిచి చూసే లోపు అందరి కళ్లు కప్పి పారిపోయేది.

దాంతో ఊరి పెద్దలందరూ ఆ ఊళ్లో పిల్లలకి పిల్లి ఆటకట్టించే బాధ్యత అప్పగించారు.

కొంత కాలానికి పిల్లి అందరి ఇళ్లల్లో దొంగతనంగా తినటం మానేసింది. పిల్లలు ఏ పని చెప్తే ఆ పని చేయటం మొదలుపెట్టింది. ఊరిలోని పెద్దలందరూ ఆశ్చర్యపోయారు.

పిల్లిలో ఇంత మార్పు ఎలా వచ్చిందో అర్థం కాలేదు.

ఒకరోజు ఊరి పెద్దలందరూ ఊరి మధ్యలో చెట్టుకింద కూర్చున్న పిల్లల్ని పిలిపించి, 'ఆ పిల్లిని మీరు ఏం చేసి మార్చారు?' అని అడిగారు. అప్పుడు పిల్లలు 'ఈ పిల్లి చేసే పనులు కొన్ని రోజులు జాగ్రత్తగా గమనించాం. పిల్లికి బాగా ఆకలేసినప్పుడల్లా, తినే పదార్థాలు ఉన్న ఇళ్లలోకి దూరుతోంది. ఎక్కడ

పద్యము

నిండు నదులు పాఱు నిల్చి గంభీరమై
వెఱ్ఱివాగు పాఱు వేగబొర్లి
అల్పుఉడాఁడు రీతి నధికుండు నాఉడునా?
విశ్వదాభిరామ! వినుర వేమ!

భావం : ఓ వేమనా! గొప్ప నదులు నిదానంగానూ, గంభీరంగానూ ప్రవహించును. కానీ చిన్న వాగు, అతి వేగంగా గట్లుదాటి పొర్లి ప్రవహించును. అట్లే యోగ్యుడు నిదానంగా, గంభీరంగా మాట్లాడును. నీచుడు వాగుచూ ఉండును.

శ్లోకము

న శరీరం పునః పునః
'పునర్దారాః పునర్విత్తం,
పునఃక్షేత్రం పునః పునః
పునః శుభాశుభం కర్మ,
న న శరీరం పునః పునః'

భావం : భార్య, ధనం, పొలం వంటివాటిని కోల్పోయినా తిరిగి రావచ్చు. శుభాశుభాములూ అంతే. కానీ శరీరం తిరిగి రాదు. కనుక, జీవించి ఉండగానే సత్కార్యాలు చేయాలన్నది పెద్దల మాట.

జతపరచండి

ఇక్కడున్న పదాలకు పక్కనున్న పదాల్లో ఏవి సరిపోతాయో కనుక్కోండి.

ఉత్తం	సూక్ష్మం
తగ్గు	పొగడ్త
నెమ్మది	నీచం
విమర్శ	తొందర
స్థూలం	హెచ్చు

సమాధానాలు : ఉత్తం-నీచం; తగ్గు-హెచ్చు; నెమ్మది-తొందర; విమర్శ-పొగడ్త; స్థూలం-సూక్ష్మం.

నిర్వహణ : నయనశ్రీ

భారత స్వాతంత్ర్య సమరయోధులు

గోరూరు రామస్వామి అయ్యంగార్

ఈయన గోరూరుగా ప్రసిద్ధి చెందారు. 1904లో కర్ణాటకలోని హసన్ జిల్లాలోని 'గోరూరు'లో జన్మించారు. స్వాతంత్ర్యోద్యమంతో ప్రభావితమై మహాత్మా గాంధీకి అనుచరుడయ్యారు. క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నందుకు 1942లో 2 నెలల పాటు అరెస్ట్ కూడా అయ్యారు. తన 87వ ఏట సెప్టెంబర్ 28, 1991న తుదిశ్వాస విడిచారు.

జనరల్ నాలెడ్జ్

1. తెల్ల ఏనుగుల దేశం అని దేనిని అంటారు?
2. భారత రాజ్యాంగ పితామహుడు అని ఎవరిని పిలుస్తారు?
3. ఇటీవల కేరళ ప్రభుత్వం ఆ రాష్ట్రం పేరును మారుస్తూ అసెంబ్లీలో తీర్మానం చేసి, ఆమోదించింది. నూతన పేరేమిటి?

జవాబులు : 1. థాయ్‌లాండ్; 2. బి. ఆర్. అంబేద్కర్; 3. కేరళం

మెదడుకు మేత

ఎర్రవాడొస్తే,
నల్లవాడు
పారిపోతాడు..
ఏమిటది?

జవాబు : అగ్గిపుల్ల

దాచినా తినేస్తోందని మాకు అర్థం అయింది. అప్పటి నుంచి మేం దానికి ప్రతి రోజూ తినటానికి ఏదో ఒకటి పెట్టటం మొదలుపెట్టాం. అలా కొన్ని రోజులు పెట్టేసరికి అది ఎక్కడికీ వెళ్లకుండా మేం పెట్టే తిండి కోసం ఎదురు చూడసాగింది. దాంతో అది మాకు బాగా దగ్గర అయింది. మాతో స్నేహంగా ఉండసాగింది. మేం కనిపిస్తే దగ్గరకు వచ్చి తలను మా కాళ్లకు రుద్దుతుంది. సంతోషంతో గంతులేస్తుంది. మేం ఆడుకుంటుంటే అది మాతో కలిసిపోతుంది. ఆ విధంగా పిల్లి మారింది' అని చెప్పారు. పిల్లిలో పిల్లలు తెచ్చిన మార్పుకు పెద్దలు సంతోషించారు. ★

మంచిమాట

జ్ఞానానికి మించిన
మహాశక్తి ఈ
ప్రపంచంలో మరొకటి
లేదు!

సింహంభట్ల సుబ్బారావు
6300674054

మేషం : అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం

కొత్త కార్యక్రమాలు సకాలంలో పూర్తి చేస్తారు. సంగీత, సాహిత్యాలపై ఆసక్తి చూపు తారు. ఆస్తి వివాదాలు తీరి లబ్ధి పొందుతారు. జీవిత భాగ స్వామితో వివాదాలు తీరి సఖ్యత నెలకొం టుంది. ఒక ఆహ్వానం సంతోషం కలిగిస్తుంది.రుణభారాలు తొలగుతాయి. పరిశోధకులకు అవకాశాలు దగ్గరకు వస్తాయి. 24,25 తేదీల్లో వృథా ఖర్చులు. అనారోగ్యం. అనుకోని ప్రయాణాలు. లక్ష్మీగణపతి స్తోత్రాలు పఠించండి.

వృషభం : కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి, మృగశిర 1,2 పాదాలు

ఆస్తి వివాదాలు నుంచి కొంత గట్టెక్కుతారు. కొత్త కాంట్రాక్టులు పొందుతారు. పెండింగ్‌బాకీలు కొన్ని వసూలవుతాయి. ఖర్చులు పెరిగినా తట్టుకుని ముందుకు సాగుతారు. వ్యాపారులకు అనుకున్న లాభాలు అందుతాయి. పారిశ్రామికవేత్తలు, కళా కారులకు మరింత అభివృద్ధి ఉంటుంది. రచయితలు, క్రీడాకారులు సత్తా చాటుకుంటారు. 21,22 తేదీల్లో దూరప్రయాణాలు. మానసిక అశాంతి. శ్రీరామ రక్షా స్తోత్రాలు పఠించండి.

మిథునం : మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు

యత్నకార్యసిద్ధి. బంధువుల నుంచి శుభవార్తలు అందుతాయి. విద్యార్థులకు విజయాలు వరిస్తాయి. దేవాలయాలు సందర్శిస్తారు. రావలసిన సొమ్ము అంది అవసరాలు తీరతాయి. వ్యాపారాల విస్తరణలో ముందుకు సాగుతారు. రాజకీయవేత్తలు, కళాకారులకు అరుదైన ఆహ్వానాలు అందుతాయి. రచయితలు, పరిశోధకులకు మరింత గుర్తింపు లభిస్తుంది. 24,25 తేదీల్లో వృథా ఖర్చులు.

కర్కాటకం: పునర్వసు 4వ పాదం, పుష్యమి, ఆశ్లేష

కార్యక్రమాలు సాఫీగా పూర్తి కాగలవు. సన్నిహితుల నుంచి ఒక ముఖ్య సమాచారం అందు తుంది. ఆస్తి విషయాలలో బంధువులతో వివాదాల పరిష్కారం. వ్యాపారులకు ఆశించిన విధంగా పెట్టుబడులు అందుతాయి. రాజకీయ, పారిశ్రామిక వేత్తలు సన్మానాలు, సత్కారాలతో బిజీగా గడుపుతారు. రచయితలు, పరిశోధకులకు మరింత అనుకూల సమయం. 26,27 తేదీల్లో శారీరక రుగ్మతలు. బంధువిరోధాలు. గణేశాష్టకం పఠించండి.

సింహం : మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం

ముఖ్య కార్యక్రమాలు నెమ్మదిగా సాగుతాయి. ఆకస్మిక ప్రయాణాలు ఉంటాయి.విద్యార్థుల యత్నాలు నిరుత్సాహ పరుస్తాయి. అవసరాలు పెరిగి కొత్తగా రుణాలు చేయాల్సి వస్తుంది. వ్యాపారులకు కొద్దిపాటి లాభాలు లభిస్తాయి.ఉద్యోగులు మరింత శ్రమపడాల్సిన సమయం. కళాకారులు, రచయితలకు కొంత నిరాశా. 25,26 తేదీలలో శుభకార్యాలకు హాజరు. ఆస్తి లాభం. నృసింహస్తోత్రాలు పఠించండి.

కన్య: ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1,2 పాదాలు

ఊహించని వ్యక్తులతో పరిచయాలు. గతంలో నిలిచిపోయిన కార్యక్రమాలుపూర్తి చేస్తారు. గృహం, వాహనాలు కొనుగోలు యత్నాలు సఫలం. అవసరాలకు డబ్బు సమకూరి రుణదాతల ఒత్తిడులు తొలగుతాయి. పరిశోధకులు, క్రీడాకారులకు మరింత ఉత్సాహవంతంగా ఉంటుంది. 23,24 తేదీల్లో మానసిక ఆందోళన. కుటుంబసభ్యులతో తగాదాలు. ఆంజనేయ దండకం పఠించండి.

తుల: చిత్త 3,4 పాదాలు, స్వాతి, విశాఖ 1,2,3 పాదాలు

ముఖ్య కార్యక్రమాలు విజయవంతంగా పూర్తి కాగలవు. స్థిరాస్తి వివాదాలు కొలిక్కి వస్తాయి. శు భకార్యాలలో పాలుపంచుకుంటారు. నిరుద్యోగుల యత్నాలు సఫలం. పారిశ్రామికవేత్తలు, కళాకారులకు పురస్కారాలు అందుతాయి. రచయితలు, పరి శోధకుల కృషి ఫలిస్తుంది. 25,26 తేదీల్లో ఖర్చులు పెరుగుతాయి. శారీరక రుగ్మతలు. హయగ్రీవ స్తోత్రాలు పఠించండి.

వృశ్చికం : విశాఖ 4వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ

కార్యక్రమాలలో అవరోధాలు తొలగుతాయి. దీర్ఘకాలిక రుణాలు తీరతాయి. విద్యార్థులు సత్తా చాటుకుని ముందుకు సాగుతారు. పెట్టుబడులు సమకూరి, వ్యాపార విస్తరణ యత్నాలు ఊపందు కుంటాయి. రాజకీయ, పారిశ్రామిక వేత్తలకు ఊహిం చని అవకాశాలు. 26,27తేదీల్లో అనుకోని ప్రయాణాలు. అనారోగ్యం. శివాష్టకం పఠించండి.

ధనుస్సు : మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం

భూములు, భవనాలు కొంటారు. దేవాలయాల సందర్శనం. ఆస్తుల విషయంలో నూతన అగ్రిమెంట్లు చేసుకుంటారు. ఉద్యోగులకు విధుల్లో ప్రతిబంధకాలు తొలగుతాయి. వ్యాపారులు లాభాల బాటలో పయనిస్తారు. రాజకీయవేత్తలు,రచయితలు, కళాకారులకు మరింత అనుకూల సమయం. 24,25 తేదీలలో దూరప్రయాణాలు. బంధువులతో తగాదాలు. ఆదిత్యహృదయం పఠించండి.

మకరం : ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు

విద్యార్థులు, నిరుద్యోగులు మరిన్ని అవకాశాలు సాధిస్తారు. తీర్థయాత్రలు చేస్తారు. రావలసిన డబ్బు అంది, రుణబాధలు తొలగుతాయి. వ్యాపారులకు పెట్టు బడులు అందడమే కాకుండా తగినంత లాభాలు దక్కుతాయి. ఉద్యోగులకు ఇంక్రిమెంట్లు లభిస్తాయి. కళాకారులు, రాజకీయవేత్తలకు విజయాలు వరిస్తాయి. 21,22 తేదీల్లో దూర ప్రయా ణాలు. దక్షిణామూర్తి స్తోత్రాలు పఠించండి.

కుంభం : ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు

ముఖ్య కార్యక్రమాలలో విజయం. సన్ని హితులతో ఆనందంగా గడుపుతారు. నిరుద్యోగులకు ఉద్యోగలాభం. కొత్త కాంట్రాక్టులు పొందుతారు. తీర్థ యాత్రలు చేస్తారు. దీర్ఘకాలిక రుణబాధలు తొలగు తాయి. ఉద్యోగులకు పదోన్నతులు లభిస్తాయి. రాజ కీయవేత్తలు, కళాకారులకు ఆహ్వానాలు అందుతాయి. 23,24 తేదీల్లో అనారోగ్యం. కుటుంబంలో చికాకులు. శ్రీకృష్ణస్తోత్రాలు పఠించండి.

మీనం : పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి

కార్యక్రమాలు అనుకున్న విధంగా పూర్తి చేస్తారు. విద్యార్థులు మరిన్ని అవకాశాలు సాధిస్తారు. తరచూ ప్రయాణాలు ఉండవచ్చు. రావలసిన బాకీలు అందు తాయి. ఉద్యోగులకు అదనపు బాధ్యతలు దక్కి కొత్త ఆశలు చిగురిస్తాయి. రాజకీయ, పారిశ్రామిక వేత్తలకు ఆకస్మిక విదేశీ పర్యటనలు. రచయితలు, కళాకారులు విశేష పేరుప్రతిష్ఠలు పొందుతారు. 24,25 తేదీల్లో అనుకోని ఖర్చులు, స్నేహితులతో విభేదాలు. శివపంచాక్షరి పఠించండి.

పదరసం-429

ఆధారాలు

అడ్డం

1. బురద, పంకం (3)
3. కోపం, ద్వేషం (2)
5. పాలు తోడు కంటే (3)
7. కొండ/చెట్టు ఎక్కడం (4)
9. బొట్టు, నామం (3)
11. పాపను సంబోధించండి (2)
14. కదళీ
15. కలహభోజనుడి వీణ (3)
16. సముద్రయాన వాహనం (2)
17.వంకర లేనిది (2)
19. భూమి, వెల (2)
21. లక్షల కొద్దీ...(4)
24. అనుకోకుండా వచ్చే వ్యక్తి (3)
26. సొరకాయను ఇలానూ అంటారు (3)
29. అందని ఈ పండు పుల్లనట (2)
31. ధాన్యం నిల్వ చేసేది (3)
33. ఉదరం, కడుపు (2)
34. అత్యధికం (3)

నిలువు

1. సమం కానిది (3)
2. మంచి బుద్ధి కలది (2)
3. పసిడి, స్వర్ణం (3)
4. కొప్పు, జుట్టుముడి (2)
5. అనేక, పలు (2)
6. రచయిత చలం ఇంటిపేరు (4)
8. పొగడ్త, అభినందన (2)
10. ఐక్యం కావడం (2)
11. పలుగుతో పాటే మరో పరికరం (2)
12. విరటుని కొలువులో పార్థుడు (4)
13. కుంభం (3)
14. వధూవరులకు చూపే నక్షత్రం (4)
15. మనస్సు, బుద్ధి (2)
18. మంచిదేనా..? (2)
20. రథం ఎక్కినవాడు (2)
22. ఓర్పు, సహనం (2)
23. మొదటి...కింద నుంచి (2)
24. అపరిచితుడులో సగమే...(3)
25.భద్రాచలమే.(3)
27. ఆభరణాలు (3)
28. అత్యల్పం (3)
30. కన్ను, నయనం (2)
32. వేడి, కాక (2)



పదరసం - 429

పేరు : .....

చిరునామా:.....

.....

పిన్‌కోడ్ : ..... మొబైల్ : .....

మా చిరునామా : పదరసం, జాగృతి వారపత్రిక, 3-4-228/4/1, కాచిగూడ, హైదరాబాద్-27

సమాధానాలను పైగడులలో పూరించి, కత్తిరించి కవర్‌పై పదరసం నెం. వేసి 2023 సెప్టెంబర్ 04లోగా జాగృతికి పంపండి. సరైన సమాధానాలు రాసిన వారిని విజేతలుగా ప్రకటిస్తాం. ఒకరిని లాటరీ ద్వారా ఎంపికచేసి నగదు బహుమతి అందచేస్తాం. తుది నిర్ణయం జాగృతి యాజమాన్యందే.

పదరసం - 425 సమాధానాలు



విజేతలు: శ్రీపాద, హైమవతి, శేషు, రమణమూర్తి, విమలాదేవి, రాధిక, ప్రభాకర్, విజయలక్ష్మి, ధన్వంతరి, నాగేశ్వరరావు, దత్తాత్రేయశర్మ, మురళి, వరుణ్, ఫణికుమార్, ముకుందము, మాధవి, సురెందర్‌రెడ్డి, అల్లీరాణి, స్వాతి, సత్యప్రసాద్, భాస్కరయ్య, కౌముది, పృథ్వీసాయి, భావ్యశ్రీ, అంజనీదేవి, అనుపమ, వనమాల,హరికృష్ణ,గాయత్రి,పల్లవి,రామలింగాచారి, వెంకటేశ్వర్లు, కాంతామణి, ప్రదీపు, రామచంద్రమూర్తి, సత్యం, గణేష్, శ్రీధర్, శాంతకుమారి, హనుమంతరావు, సత్య నారాయణ, సుశీల, శార్వాణి, ఫణిమంజరి, రాజయ్య, విజయ లక్ష్మి, ప్రభాకరరావు, లక్ష్మి, కార్తికేయ ఆంజనేయులు, సుగుణ,

ఈ వారం విజేత : బాచరాజు సుధాకర్ రావు

అరుణ

కొత్తదనం కరవైన భోళాశంకర్

మెగాస్టార్ చిరంజీవికి రీమేక్స్ చేయడం కొత్తకాదు. ఆయన కెరీర్ ప్రారంభం నుండి చేస్తూనే ఉన్నారు. అందులో కొన్ని సూపర్ హిట్ అయితే మరికొన్ని బ్లాక్ బస్టర్ సక్సెస్‌ను సాధించాయి. బహుశా ఆ నమ్మకంతోనే కావచ్చు ఆయన తన సెకండ్ ఇన్నింగ్స్‌ను తమిళ సినిమా 'కత్తి' రీమేక్‌తో మొదలెట్టారు. 'ఖైదీ నంబర్ 150'గా వచ్చిన ఆ సినిమా మంచి విజయాన్నే సాధించింది. ఆ తర్వాత మలయాళ చిత్రం 'లూసిఫర్' రీమేక్ 'గాడ్ ఫాదర్'లో నటించిన చిరంజీవి, ఇప్పుడు తమిళ 'వేదాళం' తెలుగు రీమేక్ 'భోళాశంకర్'లో చేశారు. ఈ సినిమా ఆగస్ట్ 11న జనం ముందుకొచ్చింది.

'వేదాళం' సినిమాలో అజిత్ హీరోగా నటించాడు. సిస్టర్ సెంటిమెంట్‌తో ఎనిమిదేళ్ల క్రితం వచ్చిన ఆ మూవీ ఫర్వాలేదనిపించింది. కథ, కథనాలలో కొత్తదనం లేని దాన్ని చిరంజీవి రీమేక్ చేయడం ఏమిటనే ప్రశ్నలు ఈ సినిమా ప్రకటన వచ్చిన రోజునే ఉత్పన్నమయ్యాయి. అయితే దర్శకుడు మెహర్ రమేశ్ ఈ తరానికి నచ్చేలా మార్పులు చేర్పులూ చేస్తాడని అభిమానులు ఆశపడ్డారు. కానీ వారి ఆశలు అడియాశలయ్యాయి.

కథగా చెప్పుకోవాలంటే... తన చెల్లి మహాలక్ష్మి (కీర్తి సురేశ్)ని తీసుకుని హైదరాబాద్ నుండి కోల్‌కతా వస్తాడు శంకర్ (చిరంజీవి). అక్కడ ఆమెను ఆర్ట్స్ కాలేజీలో చేర్పించి తాను టాక్సీ డ్రైవర్‌గా పనిచేస్తుంటాడు. అదే సమయంలో కోల్‌కతా కేంద్రంగా ఓ ముఠా, అమ్మాయిల అక్రమ రవాణాకు పాల్పడుతూ ఉంటుంది. వారి ఆచూకీ తెలిస్తే చెప్పాలని పోలీస్ కమిషనర్ టాక్సీ డ్రైవర్లను కోరతాడు. కొందరు వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరిస్తూ కన్పించడంతో శంకర్ వారి గురించి కమిషనర్‌కు తెలియచేస్తాడు. ఈ విషయం తెలిసిన ఆ ముఠాకు శంకర్ టార్గెట్‌గా మారతాడు. హ్యూమన్ ట్రాఫికింగ్‌కు పాల్పడుతున్న అలెగ్జాండర్ (తరుణ్ అరోరా)తో పాటు అతని ఇద్దరు తమ్ముళ్ల ఆచూకీ తెలుసుకున్న శంకర్ వారిని అంతమొందించడమే లక్ష్యంగా పెట్టుకుంటాడు. అసలు శంకర్ గతం ఏమిటీ? మానవ అక్రమ రవాణ ముఠాతో శంకర్‌కు ఉన్న వైరం ఏమిటీ? హైదరాబాద్‌లో భోళాశంకర్ అనే కిరాయి గూండాగా వ్యవహరించిన అతను కోల్‌కతా ఎందుకు వచ్చాడు? అనేది అసలు కథ.

'భోళాశంకర్' పైకి యాక్షన్ డ్రామాగా అనిపించినా... ఇందులో సిస్టర్ సెంటిమెంట్‌కు, ఫ్యామిలీ ఎమోషన్స్‌కు బాగానే చోటుంది. నిజానికి కథంతా శంకర్ సోదరి మహాలక్ష్మి చుట్టూనే సాగుతుంది. ఎనిమిదేళ్ల క్రితం వచ్చిన ఈ సినిమాను ఏవో కొద్దిపాటి మార్పులు చేయడం తప్ప యథాతథంగా తీసేశాడు దర్శకుడు మెహర్ రమేశ్. అదే ఈ సినిమాకు మైనస్‌గా మారిపోయింది. కరోనా సమయంలోనూ, ఆ తర్వాత ఓటీటీలో పలు వెబ్ సీరిస్‌లు, సినిమాలు కూడా హ్యూమన్ ట్రాఫికింగ్ మీద వచ్చాయి. ఇక సిస్టర్ సెంటిమెంట్ మూవీస్ ఎన్నో దశాబ్దాలుగా చూస్తున్నవే. అందువల్ల ఇందులో కొత్తదనం కొరవడినట్టు అయ్యింది.

చిరంజీవి సినిమాలో జనం కోరుకునేవి మంచి పాటలు, ఫైట్స్. దానితో పాటు కథలో ఏ మాత్రం కొత్తదనం ఉన్నా దాన్ని నెత్తిన పెట్టుకుంటారు. 68 సంవత్సరాల వయసులో చిరంజీవి ఆటపాటల తోనూ, పోరాట సన్నివేశాలతోనూ బాగానే మెప్పించాడు. కానీ వినోదం పేరుతో వెగటు పుట్టించే సన్నివేశాలను ఇందులో పెట్టారు. మరీ ముఖ్యంగా పవన్ కళ్యాణ్ 'ఖుషీ'లోని కీలక సన్నివేశాన్ని చిరు, శ్రీముఖి మీద చిత్రీకరించడం మరీ ఎబ్బెట్టుగా ఉంది. అలానే జబర్దస్త్ టీమ్‌తో చేయించిన కామెడీ సైతం పండలేదు. ప్రథమార్ధంలో 'వెన్నెల' కిశోర్ ఉన్న కొన్ని సన్నివేశాలు ఫర్వాలేదనిపిస్తాయి. హీరోయిన్‌కు, విలన్‌లకు పెద్దంత ప్రాధాన్యం లేదు. అయితే చిరంజీవి-కీర్తి సురేశ్ మధ్య చిత్రీకరించిన సన్నివేశాలు సెంటిమెంట్ పరంగా ఆకట్టుకున్నాయి. ఈ తరహా పాత్ర చేయడం చిరంజీవికి నల్లేరు మీద నడకే. కీర్తి సురేశ్ కూడా బాగానే చేసింది. తమన్నా మేకప్ ఓవర్‌గా ఉంది. సొంత డబ్బింగ్ అంతగా సెట్ కాలేదు. తమన్నా అన్నయ్యగా సుశాంత్ ఓ కీ-రోల్ ప్లే చేశాడు. ఇతర ప్రధాన పాత్రలను మురళీశర్మ, తులసి, నాగమహేశ్, కాశీ విశ్వనాథ్, సాయాజీ షిండే, రవిశంకర్, షవర్ అలీ, రఘుబాబు, ఉత్తేజ్ తదితరులు పోషించారు. వీరు కాక ఏడెనిమిది మంది జబర్దస్త్ కమెడియన్స్ కూడా ఉన్నారు.

ఈ చిత్రానికి మణిశర్మ తనయుడు మహతీ స్వరసాగర్ సంగీతాన్ని అందించాడు. డుడ్లే సినిమాటోగ్రఫీ బాగుంది. నిర్మాత అనిల్ సుంకర రాజీ పడకుండా ఈ సినిమాని నిర్మించారు. కానీ పాత చింతకాయ పచ్చడి లాంటి కథ, కథనాల కారణంగా 'భోళాశంకర్' బాక్సాఫీస్ బరిలో బొక్కబోర్లాపడింది. సహజంగా చిరంజీవికి రీమేక్స్ బాగా కలిసివస్తాయనే భావన ఉంది. అయినా ఈ సెకండ్ ఇన్నింగ్స్‌లో చిరంజీవికి రీమేక్స్ పెద్దంతగా అచ్చిరాలేదు. ఎందుకంటే ఆయన సెకండ్ ఇన్నింగ్స్‌కు సంబంధించిన సినిమాల మొదటి రోజు కలెక్షన్స్ చూస్తే తొలి మూడు స్థానాలలో స్ట్రయిట్ చిత్రాలైన "సైరా నరసింహారెడ్డి, ఆచార్య, వాల్తేరు వీరయ్య" నిలిచాయి. ఆ తర్వాత వరుసగా రీమేక్స్ "ఖైదీ నంబర్ 150, భోళా శంకర్, గాడ్ ఫాదర్" ఉన్నాయి. ఇతర భాషల్లో విజయవంతమైనా ఈ రీమేక్స్ ఏవీ చిరంజీవి సినిమాల ఓపెనింగ్స్‌కు ఉపయోగపడలేదనే చెప్పాలి. రీమేక్స్ తీయడంలో పేరున్న మెహర్ ఈ సినిమాను ఆసక్తికరంగా మలచడంతో తడబడ్డాడు. 'ఆచార్య' పరాజయం తర్వాత 'వాల్తేరు వీరయ్య' విజయంతో మళ్లీ చిరంజీవి కాస్తంత ఊపిరి పీల్చుకున్నారు. కానీ ఇప్పుడీ 'భోళాశంకర్' మళ్లీ ఆయన్నీ, అభిమానులను నిరుత్సాహానికి గురిచేసింది.

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్

From: JAGRITI Telugu Weekly
Jagriti Bhavan, H.No.3-4-228/4/1, Lingampally,
Kachiguda, Hyderabad-500027; email: jagritiweekly@gmail.com

Publishing on Every Thursday; Posting on Every Friday & Saturday
Postal Regn. No. HSE/1052/2021-2023; RNI Regd. No. 3270/57.
Volume : 75 Issue : 44

Estd : 1997

G.NARAYANAMMA ISTITUTE OF TECHNOLOGY & SCIENCE FOR WOMEN

AUTONOMOUS

SPONSORED BY G.PULLA REDDY CHARITIES TRUST, HYDERABAD
ACCREDITED BY NBA & NAAC, AFFILILATED TO J N T U H & APPROVED BY A. I. C. T. E

Shaikpet, Hyderabad - 500 104.
Ph: 040 2956 5856 / 2956 7756 Website : www.gints.ac.in, Email: principal@gnits.ac.in

COURSES OFFERED

B.Tech Courses

- Electronics & Communication Engineering
- Computer Science & Engineering
- Electrical & Electronics Engineering
- Information Technology
- Electronics & Telematics Engineering
- Computer Science & Engineering (Artificial Intelligence & Machine Learning)
- Computer Science & Engineering (Data Science)
- Computer Science & Technology

M.Tech Courses

- M.Tech in Power Electronics & Electric Drives
- M.Tech in Computer Science & Engineering
- M.Tech in Digital Electronics & Communication Systems
- M.Tech in Computer Networks & Information Security
- M.Tech in Wireless & Mobile Communications

OTHER INSTITUTIONS RUN BY THE TRUST

1. G. Pulla Reddy Engineering College, Kurnool.
2. G. Pulla Reddy College of Pharmacy, Mehdipatnam, Hyderabad.
3. G. Pulla Reddy Degree & PG College, Mehdipatnam, Hyderabad.
4. G. Pulla Reddy Junior College, Abids, Hyderabad.
5. G. Pulla Reddy High School, Mehdipatnam, Hyderabad.
6. G. Pulla Reddy Memorial School, Dilsukhnagar, Hyderabad.
7. G. Pulla Reddy Government Polytechnic, Kurnool.
8. G.Narayanamma High School, Mehdipatnam, Hyd.
9. G. Narayanamma Hospital, Gokavaram, Atmakuru Taluk, Kurnool.
10. G. Narayanamma Pulla Reddy Respite Home for Mentally Retarded Women, Kurnool.
11. Vignana Peetham (Orphanage), Kurnool.
12. Samskruta Bhasha Prachara Samithi, Nampally Station Road, Hyderabad.
13. G. Pulla Reddy Dental College & Hospital at Kurnool.

CHAIRMAN
P. Subba Reddy

TREASURER
G. Raghava Reddy

PRINCIPAL
Dr. K. Ramesh Reddy